అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

సోమవారం 01-5-2023 సమగ్ర తెలుగు దినపత్రిక

www.navatelangana.com

సంపుటి : 9 సంచిక : 120 Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar 10 పేజీలు వెల : 6.50

మెక్ కార్మిక్ ఫ్యాక్టరీ
కార్మికులు తమ
యజమానుల దాష్టీకానికి
కుమిలి పోలేదు.
తిరగబడ్డారు...
వారి దోపిడీపై ఎగబడ్డారు...
ఆ తర్వాత 8 గంటల
పనిదినం సాధించుకున్నారు.
ఎర్రజెండా ఆద్యులైనారు...
ఆరాధ్యులైనారు...
కార్మికోద్యమ వినీలాకాశంలో
ధృవతారలైనారు. ఆ చికాగో
కార్మికులు పరిచిన దారే
ఆ తర్వాత ప్రపంచ
కార్మికోద్యమ రాదారయ్యింది.



ఎర్రెర్రని దారుల్లో..!

నాటి రుధిర ధారలు... అవిగవిగో... ఇంకా పచ్చిగానే ఉన్నాయి. లఖీమ్‌పూర్‌ఖేరిలో రైతుల జీవితాలను చిదిమేసిన కార్ల కాన్వాయి గీసిన రక్తపు చారలు... కనపడటం లేదా?! దేశాలేవైనా, పాలకులెవరైనా చికాగో యజమానుల నుండి 'బ్యాటన్' అందుకుని కష్టజీవులపై బుల్‌డోజర్లు తోలుతూనే ఉన్నారు. అయితే స్పార్టకస్ వారసులేం తక్కువ తిన్నారూ? నాటి విచ్చుకత్తులూ, పిడి బాకుల మధ్య పోటీలేదు. ఒకర్నొకరు చంపుకోవాల్సిన దుర్నీతి నేడు లేదు. కార్మికులు, వారిని చూసి రైతులు, వ్యవసాయ కూలీలు, వృత్తులవారు సంఘటితమవు తున్నారు. సంఘాలు స్థాపించుకుం టున్నారు. యంత్రాలు శత్రువులు కాదన్న విషయం 'లుడ్డైట్' అమరులకే అర్థమైంది. పని గంటలు తగ్గించుకుంటేనే చాలదన్న తెలివిడి ఎరుకలోకొచ్చిన తర్వాత పెట్టుబడి దోపిడీనే పెకలించాలన్న అవగాహన పెరుగుతోంది. 'ప్యారిస్ కమ్యూన్' వైఫల్యాలను స్వయంగా బేరీజు వేసుకున్న లెనిన్ రైతాంగాన్ని విప్లవంలో అంతర్భాగం చేశాడు. బలమైన కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి అంకురార్పణ చేశాడు. 1917లో సోవియట్ యూనియన్ ఉనికిలోకొచ్చింది. ప్రపంచ చరిత్రలో మొట్ట మొదటిసారి దోపిడీ రహిత సమాజాన్ని మానవాళి చవిచూసింది. ఆ తదుపరి, మూడవ వంతు భూమండలంలో అది అనుభవంలోకొచ్చింది.

అయితే నేడది గత చరిత్ర అయ్యింది. 1991 తర్వాత ఫ్రాన్సిస్ ఫుకయూమా వంటి వారు చరిత్ర అంతమయిందన్నారు. పెట్టుబడిదారీ విధానమే శాశ్వతమన్నారు. దోపిడీ చిరాయువన్నారు. ఆ దశాబ్దంలోనే ఆసియా టైగర్ల సంక్షోభం భళ్ళున బద్దలైంది. కొరియా చూడు, థాయిలాండ్ చూడు అంటూ నల్లముసుగేసి బయస్కోప్ పాటపాడిన పాలకులంతా తెల్లమొహమేశారు. దానివెంటే డాట్ కామ్ సంక్షోభం, హౌసింగ్ బుడగ సంక్షోభం ఉరికొచ్చి స్థిరపడిపోయి ఉన్నాయి. అమెరికాతో సహా అన్ని పాశ్చాత్య దేశాల్లో "పెట్టుబడిదారీ విధానం నశించాల"నే నినాదాలు మిన్నంటుతున్నాయి. పెట్టుబడిదారీ విధానం ఉద్యోగాలివ్వ లేదని, కేవలం ఒక్క శాతం ప్రజల ఆదాయాల్నే పెంచుతోందని తమ అనుభవంలో తెలుసుకుంటున్నారు. అమెరికాలోని యువతలో 18-24 వయసున్న యువతలో 51శాతం సోషలిజమంటే ఇష్టపడుతున్నారు. నయా ఉదారవాదం ఇక "డెడ్‌ఎండ్"కు చేరుకుందని అనేక మంది ఆర్థిక శాస్త్రవేత్తల అభిప్రాయం. కానీ దాన్ని గట్టెక్కించేందుకు ప్రజల్ని చీలుస్తున్నారు. అయినా వీటిని అధిగమిస్తూ లాటిన్ అమెరికన్ దేశాల్లో అనేక ప్రత్యామ్నాయాలు వెల్లివిరుస్తున్నాయి.

మన దేశంలోనూ నయా ఉదారవాద విధానాల వైఫల్యం కొట్టొచ్చినట్లు కనపడుతోంది. కార్మిక హక్కుల్ని 'కోడ్‌లు' తినేశాయి. 8 గంటల పనిదినానికి వారసులుగా గర్వించేవారు 12గంటల పనిదినం సర్వ వ్యాపితమవు తున్నందుకు అప్రమత్తం కావాల్సి ఉంది. గత ఐదేండ్లలో ఫ్యాక్టరీలు, గనులు, ఇతర నిర్మాణాల్లో వేలాది మంది కార్మికులు చనిపోయారు. కళ్ళు, కాళ్ళు, చేతులు పోయినవారి లెక్కే లేదు. కార్పొరేట్-హిందూత్వ శక్తులు ఎవరి పనిలో వారు నిమగ్నమయ్యారు. కార్పొరేట్‌లను మేపే పనిలో మోడీ బృందముంటే, సమాజాన్ని విచ్ఛిన్నం చేసే పనిలో సంఘ్ పరివారముంది. ప్రపంచ ఆకలి సూచీలో 107వ ర్యాంకుకు చేరినా అక్షయపాత్ర కథలు విని కడుపులు నింపుకోమని ఆరెస్సెస్ జోకొట్టేపనిలో ఉంది. 'తిండి లేదు. ఉపాధి లేదంటూ 'ఇహపర'మైన విషయాలపై ఆందోళనెందుకు? అయోధ్యలో రామ మందిరం చూడండి. తాము 'విముక్తి' చేయబోయే కాశీ, మధురలు చూడండి' అని చెపుతోంది.

మనుస్మృతి అమలుకు, బ్రహ్మణాధిక్య సమాజ నిర్మాణంలో సంఘ్ పరివార్ నిమగ్నమై ఉంది. మహిళలు, దళితులు, ఆదివాసీలపై దాడులు దేశమంతా జరుగుతున్నాయి. వాటినెదిరించ కుండా, కులవ్యవస్థ మూలాలను ప్రశ్నించకుండా. వర్గ ఐక్యత అసాధ్యం. వర్గ ఉద్యమ ప్రస్థానం కూడా అసాధ్యమే.

భారతదేశంలో ఇదే కీలక మేడే కర్తవ్యం!





ఆకాశమంత ఎత్తుకు

నా తెలంగాణ..

మరుగుజ్జుల్లారా..పున:నిర్మాణమంటే ఇదీ..

ప్రతిపక్షాలపై సీఎం కేసీఆర్ ఘాటు వ్యాఖ్యలు..!!

- వైభవంగా సచివాలయం ప్రారంభోత్సవం
- కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణపై ఫైలుపై తొలి సంతకం

అభివృద్ధిలో నా తెలంగాణ ఆకాశమంత ఎత్తుకు ఎదిగిందనీ,అది మరుగుజ్జులకు కనిపించకపోతే తానేం చేయలేనని సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. 'రాష్ట్ర పరిపాలనకు గుండెకాయగా, అత్యంత శోభాయమానంగా నిర్మించిన సచివాలయం నా చేతుల మీదుగా ప్రారంభించడం నా జీవితంలో దొరికిన గొప్ప అదష్టంగా భావిస్తున్నా' అని అన్నారు.సచివాలయ నిర్మాణంలో అందరి కృషి ఉందని కొనియాడారు. సచివాలయ తరహాలోనే తెలంగాణ పల్లెలు కూడా వెలిగిపోతున్నాయని చెప్పారు.

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

తెలంగాణకు తలమానికమైన, దేశానికి దిక్సూచిగా నిలిచిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయం అత్యంత వైభోవేతంగా ఆదివారం ప్రారంభమైంది.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ అంజనీకుమార్, మంత్రులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో సీఎం కేసీఆర్ కొత్త సచివాలయం రిబ్బన్ కట్ చేశారు. ఈ సందర్భంగా వేదపండింతులు పలు క్రతువులు నిర్వహించారు. ఈ సందర్భంగానే తన పరిపాలనపై విమర్శలు గుప్పిస్తున్న ప్రతిపక్షాల నేతలపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. అనంతరం సీఎం కేసీఆర్ సచివాలయంలోని ఆరో అంతస్తులోని తన ఛాంబర్‌లో కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ ఫైలుపై తొలి సంతకం చేశారు. మంత్రులు కూడా తమ శాఖలకు చెందిన కీలక ఫైళ్లపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం కేసీఆర్ మాట్లాడారు. 'తెలంగాణ అవతరణకు ముందు అనేక వాదోపవాదాలు, అనేక చర్చలు చూశాం. తెలంగాణ అవతరించిన తర్వాత కూడా పున:నిర్మాణం కోసం అంకితభావంతో అడుగులు వేసే సందర్భంలో కొందరు అర్భకులు తెలంగాణ ...3లో

ఆరు ఫైళ్లపై సంతకం

కొత్త సచివాలయంలోని ఆరో అంతస్తులోని సీఎం కార్యాలయానికి వెళ్లిన ముఖ్యమంత్రి. సుముహూర్తంలో కుర్చీలో ఆసీనులయ్యారు. ఆరు ఫైళ్లపై సంతకాలు చేశారు.



1. దళితబంధు పథకం
2. పోడుభూముల పట్టాలు
3. సీఎంఆర్ఎఫ్ నిధులు
4. కేసీఆర్ న్యూట్రిషన్ కిట్
5. కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్
6. పాలమూరు లిఫ్టు ఇరిగేషన్

అమిత్ షాను విమర్శించినందుకు...

సీపీఐ(ఎం) ఎంపీకి రాజ్యసభ చైర్మెన్ నోటీసు

- ఈ చర్య దిగ్భ్రాంతి కలిగించింది.. ఇది చరిత్రలో కనీ వినీ ఎరుగనిది : సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర హెూం మంత్రి అమిత్ షాను విమర్శిస్తూ ఆర్టికల్ రాసినందుకు సీపీఐ(ఎం)ఎంపీ జాన్ బ్రిట్టాస్ కి రాజ్యసభ చైర్మెన్ జగ్‌దీప్ ధన్కర్ సమన్లు ఇచ్చారు. కేంద్ర హెూంమంత్రి అమిత్ షా కేరళను చిన్నచూపు చూశారని రాసిన వార్తాపత్రిక కథనానికి వివరణ ఇవ్వాలని కోరారు. రాజ్యసభ చైర్మెన్ చర్య "దిగ్భ్రాంతికి గురిచేసింది" అని జాన్ బ్రిట్టాస్ అన్నారు. ఎంపీ బ్రిట్టాస్ మాట్లాడుతూ, "ఉపరాష్ట్రపతి కూడా అయిన ధన్కర్‌ను కలవాల్సిందిగా రాజ్యసభ సెక్రెటేరియట్ మొదట నాకు నోటీసు పంపింది. గత వారం ధన్కర్‌ను కలిసి, ఈ విషయం గురించి మౌఖికంగా "బ్రీఫ్" చేసాను. ఆ తరువాత రాతపూర్వక వివరణ ఇవ్వవలసిందిగా అడిగారు" అని తెలిపారు. ఈ చర్య "దేశ చరిత్రలో కనీ వినీ ఎరుగనిది" అని బ్రిట్టాస్ అన్నారు. అటువంటి సమావేశం జరిగినట్టు ధ్రువీకరించడానికి, తిరస్కరించడానికి రాజ్యసభ వర్గాలు నిరాకరించాయి. "అన్ని సమావేశాలకు అధికారులను పిలవరు" అని రాజ్యసభ సెక్రెటేరియట్ అధికారి తెలిపారు.

బ్రిట్టాస్ దేశద్రోహానికి పాల్పడ్డారని కేరళ బీజేపీ ప్రధాన కార్యదర్శి పి.సుధీర్ చేసిన ఫిర్యాదు ఆధారంగా ధన్కర్ ఈ చర్య తీసుకున్నట్టు భావిస్తున్నారు. "అధికార బీజేపీ రాజ్యసభ చైర్మెన్‌కు ఫిర్యాదు చేయడం. అధికార పక్షం నుంచి వచ్చిన ఫిర్యాదుపై చర్చించడానికి చైర్మన్ నన్ను అధికారికంగా సమావేశానికి పిలిచినందుకు నేను విస్తుపోయాను" అని పేర్కొన్నారు.

ఫిబ్రవరి 20న ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రచురించబడిన "ప్రచారానికి సంబంధించిన ప్రమాదాలు" అనే శీర్షికతో బ్రిట్టాస్ తన అభిప్రాయాన్ని రాశారు. కర్నాటక పర్యటనలో షా "తన పార్టీ మాత్రమే కర్నాటకను సురక్షితంగా ఉంచగలదని" చెప్పినట్టు రాశారు. కర్నాటకలో కేరళ గురించి "...మీ దగ్గర కేరళ ఉంది. దాని గురించి నేను పెద్దగా చెప్పదలచుకోలేదు" అంటూ అమిత్ షా చేసిన వ్యాఖ్యలను ఉటంకిస్తూ వ్యాసం రాశారు. "నేను (కథనంలో) హెూం మంత్రి చేసిన ఆరోపణలపై ఇప్పుడే స్పందించాను. అందులో తప్పేమీ లేదు. చాలా పేరున్న వార్తాపత్రిక ప్రచురించింది. ఇది వాక్ స్వాతంత్ర్యం. భావప్రకటనా స్వేచ్ఛ. నా ప్రాథమిక హక్కు" అని అన్నారు. "నేను దీని గురించి చైర్మన్‌కి తగినంతగా వివరించాను. అయితే అధికార పార్టీ కార్యకర్త ఒకరు అలాంటి ఫిర్యాదును దాఖలు చేయడం, రాజ్యసభ సెక్రెటేరియట్, చైర్మెన్ దానిని గుర్తించడం పట్ల నేను ఆశ్చర్యపోయాను. ఈ మొత్తం ప్రక్రియ నన్ను పూర్తిగా దిగ్భ్రాంతికి గురి చేసింది" అని బ్రిట్టాస్ అన్నారు.

"కేరళను లక్ష్యంగా చేసుకుని షా చేసే ప్రకటనలు ఆయన నిరాశకు నిదర్శనం. అలాగే దేశాన్ని హిందూ రాష్ట్రంగా మార్చడానికి, రాజ్యాంగం స్థానంలో మనుస్మృతితో ఈ దేశాన్ని గతానికి రివైండ్ చేయడానికి ఆయన చేసిన ప్రయత్నానికి నిదర్శనం. కేరళ ఆయన పార్టీ డిజైన్లను అవిశ్రాంతంగా ప్రతిఘటించింది" అని రాశారు.

'యాదృచ్ఛికంగా, కేరళలో వామపక్ష ప్రభుత్వాన్ని కూల్చివేస్తామని అమిత్ షా గతంలో బెదిరించారు. భౌగోళిక ప్రాముఖ్యత కంటే, కేరళ ఆలోచనే బీజేపీని కలవరపెడుతోంది. వాస్తవానికి, షా ప్రకటనలు కొంతవరకు ప్రాణాంతకమైనవి, ఎందుకంటే కేరళ మతపరమైన స్నేహానికి అభేద్యమైన కోట. అందువల్ల తన పరిధికి మించినదని షా గ్రహించారు. అంటే కేరళను కించపరచడం ద్వారా రాజకీయంగా ఏమీ కోల్పోలేదని కూడా షా భావిస్తారు" అని రాశారు. "కేరళను చిన్నచూపు చూడడానికి షా కారణాన్ని వేరే చోట ఓట్లు లాగే ప్రయత్నంగా చూడాలి. దేశంలో భాగమైన రాష్ట్రం గురించి కేంద్ర హెూంమంత్రి ఇంత పరుషంగా మాట్లాడటం దుర్మార్గం" అని రాశారు.

హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ ఏకగ్రీవ ఎన్నిక

హైదరాబాద్:హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ కమిటీనీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం జరిగిన జనరల్ బాడీలో కమిటీకి ఎన్నికలు నిర్వహించారు. 82ఏండ్లల్లో హైదరాబాద్ సొసైటీ ఎన్నికలలో మూడుసార్లు మాత్రమే ఏకగ్రీవంగా కార్యవర్గం ఎన్నికైంది.

కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణపై ఉద్యోగ సంఘాల హర్షం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్దీకరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయడంపై పలు ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తంచేశాయి. చారిత్రాత్మక నూతన సచివాలయాన్ని రికార్డ్ సమయంలో అద్భుతంగా నిర్మించి తన చేతులమీదుగా ప్రారంభించడమే కాకుండా, రాష్ట్రంలో వివిధ శాఖల్లో దశాబ్దాల కాలంగా పనిచేస్తున్న 5,544 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తూ ఉత్తర్వులు విడుదల చేసిన సీఎం కేసీఆర్‌కు తెలంగాణ ఉద్యోగుల జేఏసీ పక్షాన చైర్మెన్ మామిళ్ల రాజేందర్ సెక్రటరీ జనరల్ వి.మమత అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్గం జగదీష్, టీజీవో ప్రధాన కార్యదర్శి సత్యనారాయణలతో పాటు టీఎన్జీవో, టీజీవో నేతలు తదితరులు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శం : గాదె వెంకన్న

కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ దేశానికే ఆదర్శమని ఆర్జేడి కాంట్రాక్టు అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గాదె వెంకన్న అన్నారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌కు కతజ్ఞతలు తెలిపారు. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణలో గెజిటెడ్ స్థాయి ఉద్యోగాలను క్రమబద్ధీకరణ చేసిన ఏకైక రాష్ట్రంగా తెలంగాణ రాష్ట్రం మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని అన్నారు. క్రమబద్ధీకరణ ఉత్తర్వుల కోసం కషి చేసిన మంత్రులు, అధికారులందరికీ పేరుపేరునా కతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సచివాలయం వద్ద సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

స్వాగతిస్తున్నాం : యూనివర్సిటీ కాంట్రాక్టు టీచర్స్ జేఏసీ

కాంట్రాక్ట్ అధ్యాపకుల క్రమబద్ధీకరణకు తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ టీచర్స్ జేఏసీగా స్వాగతిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వానికి కతజ్ఞతలు తెలిపింది. 11 విశ్వవిద్యాలయాలలో పనిచేస్తున్న 1,335 మంది యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకుల్ని కూడా రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ టీచర్స్ జేఏసీ చైర్మెన్ డాక్టర్ ఎం.రామేశ్వరరావు, కన్వీనర్ డాక్టర్ శ్రీధర్ కుమార్‌లోధ్ ఒక ప్రకటనలో కోరారు. 2015లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఒక సర్క్యులర్‌ను జారీ చేసిందని, దానికనుగుణంగా యూనివర్సిటీలో పనిచేస్తున్న 1,335 మందిని రెగ్యులరైజ్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

కేసీఆర్‌కు ధన్యవాదాలు :మాచర్ల రామకృష్ణగౌడ్

రాష్ట్రంలో 23 సంవత్సరాలుగా పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు, లెక్చరర్ల శ్రమను, వెట్టి చాకిరిని గుర్తించి ఆ ఉద్యోగులను క్రమబద్ధీకరించిన సీఎం కేసీఆర్‌కు తెలంగాణ ఇంటర్ విద్యా పరిరక్షణ సమితి రాష్ట్ర కన్వీనర్ మాచర్ల రామకష్ణగౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. అందుకు సహకరించిన మంత్రులు, విద్యాశాఖ కార్యదర్శి, ఇంటర్ విద్య, కాలేజియేట్, టెక్నికల్ కమిషనర్, ఆర్థికశాఖ కార్యదర్శి, జీఏడీ కార్యదర్శి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు సహకరించిన అధికారులందరికి హదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. కాంట్రాక్టు అధ్యాపకుల కుటుంబాలు ప్రభుత్వానికి రుణపడి ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

మిగిలినవారినీ క్రమబద్ధీకరించాలి యూనైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్

పోరాటాల ఫలితంగానే కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించారని, మిగత ఉద్యోగులందరినీ బేషరతుగా రెగ్యులర్ చేయాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ కోరింది. రాష్ట్రంలో పనిచేస్తున్న 5,544 మంది కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయడంపై రాష్ట్ర కమిటీ హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎండీ ఫసియోద్దీన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యాదనాయక్ మాట్లాడుతూ వైద్యారోగ్యశాఖలో 2001 నుండి పనిచేస్తున్న ఉద్యోగుల్లో కొంతమందినే రెగ్యులర్ చేయడం అన్యాయమని తెలిపారు. 22ఏండ్లుగా యూనియన్ ఆధ్వర్యంలో దశల వారి ఆందోళన పోరాటాలు, నిరవధిక సమ్మెలు నిర్వహించామని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు కూడా రెగ్యులర్ కాని ఉద్యోగులు నిరాశ, నిస్పృహలకు లోను కాకుండా క్రమబద్ధీకరణ జరిగే వరకు పోరాటాలలో ఐక్యంగా కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు.

ఉపాధ్యాయులకు ట్యాబ్‌ల పంపిణీపై పీఆర్‌టీయూటీఎస్ హర్షం

రాష్ట్ర ప్రజలకు, ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు అన్ని విభాగాలు ఒకే చోట ఉండేటట్టుగా సమీకత సచివాలయం నిర్మాణం చేపట్టి దానికి భారతరత్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్.బీఆర్. అంబేద్కర్ పేరు పెట్టడం పట్ల పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పింగలి శ్రీపాల్‌రెడ్డి, బీరెల్లి కమలాకర్ రావు, శాసన మండలి సభ్యులు కూర రఘోత్తంరెడ్డి, మాజీ శాసన మండలి సభ్యులు పూలరవీందర్, మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రం చెన్నకేశవరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. రాబోయే విద్యా సంవత్సరం ఆరంభంలో ఉపాధ్యాయులకు ట్యాబ్‌ల పంపిణీకి సంబంధించిన ఉత్తర్వులు విడుదల కావడంపై సంతోషం వ్యక్తం చేశారు. పదోన్నతులు, బదిలీల ప్రక్రియలో ఏర్పడిన న్యాయపరమైన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి విద్యార్థులకు విషయ నిపుణుల కొరత తీర్చి, నాణ్యమైన విద్యను అందించే విధంగా కషి చేయాలని కోరారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణను స్వాగతిస్తున్నాం క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ అసోసియేషన్

ప్రభుత్వం కేవలం 5,544 మందిని మాత్రమే పరిగణలోకి తీసుకుని మిగతా వేల మంది కాంట్రాక్టు ఉద్యోగుల జీవితాలను ప్రభుత్వం గాలికి వదిలేసిందనిక్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు, తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుండిగల్ యాదగిరి అన్నారు.

సర్కార్ నిర్ణయాన్ని ఖండించారు. 'తెలంగాణ సమగ్ర శిక్షా'లో దశాబ్ద కాలంగా విధులు నిర్వహిస్తున్న 21వేల మంది ఉద్యోగులను కూడా రెగ్యులర్ చేస్తామని ఇచ్చిన మాటపై నిలబడాలని ప్రభుత్వాన్ని కోరారు.

సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు రాష్ట్ర ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్

తెలంగాణ రాష్ట్రంలో కాంట్రాక్టు ఉద్యోగులు /లెక్చరర్ల వెట్టి చాకిరి విముక్తిపై నూతన సచివాలయంలో తొలి సంతకం చేసిన సీఎం కేసీఆర్‌కు రాష్ట్ర ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జి.రమణారెడ్డి, డాక్టర్ కుప్పిశెట్టి సురేష్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయం దేశవ్యాప్తంగా కాంట్రాక్టు ఉద్యోగుల విముక్తికి దిక్సూచిలాగా ఉంటుందని అన్నారు. 22ఏండ్లుగా క్రమబద్ధీకరణ కోసం ఉద్యమాలు చేశామని గుర్తుచేశారు.

కాంట్రాక్టు ఉద్యోగులపై కనికరం లేని విద్యాశాఖ

కేజీబీవీ ఉద్యోగులకు వేసవి సెలవులివ్వాలి: టీఎస్‌యూటీఎఫ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పన్నెండు నెలలు వేతనం ఇస్తున్నాం కాబట్టి వేసవి సెలవుల్లో కూడా రోజూ బడికి రావాల్సిందేనంటూ కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల ఉపాధ్యాయులు, ఉద్యోగులకు సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ హుకుం జారీచేయడం సబబు కాదని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె జంగయ్య, చావ రవి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిరోజూ పాఠశాలలో బయోమెట్రిక్ అటెండెన్స్ వేయాలనీ, సగం మంది బడిలో ఉండాలనీ, మిగిలిన సగం మంది ఊళ్లలో తిరిగి బాలికలను పాఠశాలలో చేర్పించటానికి క్యాంపైన్ చేయాలంటూ ఇచ్చిన ఆదేశాలను వెనక్కి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వేసవి మండిపోతుంటే నెలా పదిహేను రోజులు గ్రామాల్లో తిరగటం ఏంటనీ, పిల్లలు లేకుండా ప్రతిరోజూ బడికొచ్చి ఏం చేయాలని అడుగుతున్న ఉద్యోగులు ఆవేదనను పరిగణలోకి తీసుకోవాలని వారు కోరారు. విద్యాశాఖ వెకేషన్ డిపార్ట్మెంట్ అనీ, ఆ డిపార్ట్మెంట్ లోని కాంట్రాక్టు ఉద్యోగుకు కూడా వేసవి సెలవులు వర్తిస్తాయని గుర్తు చేశారు. కానీ మానవత్వం లేకుండా కేజీబీవీ ఉద్యోగులను వేసవి సెలవుల్లో కూడా పాఠశాలకు హాజరు కావాలని విద్యాశాఖ అధికారులు ఆదేశించటాన్ని ఖండిస్తున్నామని పేర్కొన్నారు. కనీస వేతనాలు ఇవ్వకున్నా రెసిడెన్షియల్ పద్ధతిలో పాఠశాలలు నిర్వహిస్తూ నైట్ డ్యూటీలు, ఆదివారం, పండుగ రోజుల్లో సైతం విధులు నిర్వహిస్తూ మానసికంగా ఒత్తిడికి గురౌతున్న ఉపాధ్యాయులకు వేసవి సెలవులు కూడా వర్తింపజేయకపోవటం శోచనీయమని తెలపారు.అన్ని పాఠశాలలకు ఇచ్చినట్టుగానే కేజీబీవీ ఉద్యోగులకు కూడా వేసవి సెలవులు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు వేసవి సెలవులివ్వాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై అశోక్ కుమార్, ఎం రవీందర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రాజ్యాంగానికి సవాలుగా బీజేపీ విధానాలు

ఏఐఎడబ్ల్యూయూ జాతీయ ప్రధాన కార్యదర్శి బి. వెంకట్



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

వివిధ రాష్ట్రాల్లోనూ, కేంద్రంలోనూ అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని విధ్వంసం చేయటం, ఆధిపత్య భావజాలాన్ని సమాజంపై రుద్దటమే లక్ష్యంగా పెట్టుకున్నదని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి. వెంకట్ విమర్శించారు. ఆదివారం ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ముఖ్య కార్యకర్తల విస్తృత సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన వెంకట్ మాట్లాడుతూ కార్పొరేట్లు, మతోన్మాదులు కలిసి దేశంలో పెట్రేగిపో తున్నారని, అరాచకాలు, దౌర్జన్యాలతో పాలన సాగిస్తున్నారని అన్నారు. దేశ సంపదను అడ్డగోలుగా సంపన్నులకు దోచిపెడుతున్నారని విమర్శించారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో దళితులు, గిరిజనులు, మైనారిటీలను లక్ష్యంగా చేసుకొని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం సామాజిక తరగతుల హక్కులు చట్టాలను సమాధి చేస్తున్నదని ధ్వజమెత్తారు. ఈ అఘాయిత్యాలకు వ్యతిరేకంగా వ్యవసాయ కార్మికులు ఇతర సామాజిక తరగతులను కలుపుకొని సమరశీల ఉద్యమాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. యూపీలో మూడు కోట్ల మందికిపైగా దళితులు ఉన్నారని, కోట్లాది మంది ముస్లిం మైనారిటీలు ఉన్నారని, 80 అసెంబ్లీ స్థానాలకుపైగా దళితులకు కేటాయించబడ్డాయని తెలిపారు. యూపీలో మొత్తం వ్యవసాయ, పారిశ్రామిక ప్రాధాన్యత రంగాలన్నింటి లోని ఉత్పత్తిలో దళితులు, మైనారిటీలే అత్యధికంగా ఉన్నారని తెలిపారు. ఉత్పత్తిలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నటువంటి దళితులు, మైనారిటీలకు ఇప్పుడు అమలులో ఉన్న హక్కులు, చట్టాలను కాలరాసి చాతుర్ వర్ణ వ్యవస్థను, మనుధర్మ శాస్త్ర అనాగరిక పద్ధతిని తిరిగి తేవడానికి బీజేపీ పన్నాగాలు పన్నుతోందని విమర్శించారు. ఉపాధి హామీని నిర్వీర్యం చేసారని, అభివద్ధి పేరుతో అణగారిన తరగతుల భూములను యోగి ప్రభుత్వం గుంజుకుంటున్నదని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో పనులు లేక ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నుండి పెద్ద సంఖ్యలో ఇతర రాష్ట్రాలకు పేదల వలసలు పోతున్నారని ఆయన తెలిపారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం, యూపీ లోని యోగి ప్రభుత్వం కలిసి కష్టజీవులకు నేడున్న కనీస హక్కులు లేకుండా చేస్తున్నారని ఈ దురా ఘాతాలపై ప్రశ్నించినటువంటి వారిపై అమానుషంగా హత్యలు, ఎన్కౌంటర్లు చేస్తున్నారని అన్నారు. నేడు దేశంలోనూ, యూపీలోనూ దళితులపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలు, హత్యలు అన్నీ ప్రభుత్వ ప్రేరణతో, ప్రభుత్వం యొక్క అండదండల తోనే జరుగుతున్నాయని, ఇవి ప్రభుత్వ హత్యలు, దాడులు తప్ప మరొకటి కాదని తెలిపారు. రాజ్యాం గం కల్పించిన హక్కులను అడగటానికి అవకాశం లేని పరిస్థితులు నేడు యూపీలో కొనసాగుతున్నాయని అన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో బీజేపీ దుష్ట ఆర్థిక విధానాలను, రాజ్యాంగాన్ని ధ్వంసం చేయటానికి చేస్తున్న కుట్రలను సమరశీల పోరాటాల ద్వారా అడ్డుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.సమావేశంలో వ్యకాస జాతీయ ఉపాధ్యక్షులు బ్రిజిలాల్ భారతి, జాతీయ కమిటీ సభ్యులు సతీష్, రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

'కంకి-కొడవలి" కొనసాగుతుంది'

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సీపీఐ ఎన్నికల గుర్తుగా 'కంకి కొడవలి' కొనసాగుతున్నదని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీకి రాష్ట్ర స్థాయి గుర్తింపును కొనసాగిస్తున్నట్టుగా పేర్కొంటూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ విడుదల చేసిందని పేర్కొన్నారు. దేశంలో కేరళ, మణిపూర్, తమిళనాడు రాష్ట్రాలతో పాటు తెలంగాణలో కూడా గుర్తింపును కొనసాగిస్తున్నట్టుగా ఆ నోటిఫికేషన్‌ద్వారా తెలిపారని గుర్తుచేశారు. 2018 ఎన్నికల గుర్తులకు సంబంధించిన నియమనిబంధనల ప్రకారంగా రాష్ట్రంలో పార్టీకి ఉన్నటువంటి నిర్మాణం, ఇతర అంశాలను పరిగణనలోనికి తీసుకుని రాష్ట్రస్థాయి గుర్తింపును కొనసాగిస్తున్నట్టుగా, స్థానిక సంస్థలతోపాటు, రాష్ట్రంలో పార్టీ ప్రాతిపదికగా జరిగే అన్ని ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ గుర్తు అయినటువంటి "కంకికొడవలి" యధాతథంగా కొనసాగిస్తున్నట్టుగా ఆ నోటిఫికేషన్ వెల్లడించిందని పేర్కొన్నారు. జాతీయ స్థాయి హోదాను కూడా త్వరలోనే తిరిగి పొందగలిగే అవకాశాలు ఉన్న నేపథ్యంలో కమ్యూనిస్టు పార్టీ అభిమానులు, కార్యకర్తలు, అనుచరులు, ఓటర్లు మరింత విశ్వాసంతో పార్టీని పురోగమనం వైపు తీసుకెళ్లాలని కూనంనేని ఈ సందర్భంగా కోరారు.

నవచిత్రం



దేవి శ్రీ ప్రసాద్, హరీష్ శంకర్

ఆ మ్యాజిక్ రిపీట్ కోసం..

'గబ్బర్ సింగ్' బ్లాక్ బస్టర్ తర్వాత పవన్ కళ్యాణ్, హరీష్ శంకర్ కాంబోలో రాబోతున్న మాస్ ఎంటర్‌టైనర్ 'ఉస్తాద్ భగత్ సింగ్'. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో శ్రీలీల కథానాయికగా నటిస్తోంది. దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్ర నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే చిత్రీకరణ ప్రారంభమైంది. పది రోజుల పాటు జరిగిన తొలి షెడ్యూల్‌లో కీలక సన్నివేశాలను తెరకెక్కించారు. మొదటి షెడ్యూల్ ఎడిటింగ్ పనులు కూడా ఇప్పటికే మొదలయ్యాయి. ఇక తాజాగా మ్యూజిక్ సిట్టింగ్స్ కూడా మొదలవ్వడం విశేషం. పవన్ కళ్యాణ్, హరీష్ శంకర్, దేవి శ్రీ ప్రసాద్ కలయికలో వచ్చిన 'గబ్బర్ సింగ్' ఎంతటి ఘన విజయాన్ని సాధించిందో తెలిసిందే. ఈ విజయంలో సంగీతం కూడా కీలక పాత్ర పోషించింది. అలాంటి మ్యాజిక్‌నే మరోసారి రిపీట్ చేయడానికి దేవిశ్రీ ప్రసాద్, దర్శకుడు హరీష్‌శంకర్ సిద్ధమయ్యారు.

పాన్ ఇండియా స్థాయిలో..

సాయిధరమ్ తేజ్ హీరోగా నటించిన మిస్టికల్ థ్రిల్లర్ 'విరూపాక్ష'. సంయుక్తా మీనన్ కథానాయిక. కార్తీక్ దండు దర్శకత్వంలో శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్స్‌పై బాపినీడు బి.సమర్పణలో నిర్మాత బీవీఎస్ఎన్ ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మించారు. సుకుమార్ ఈ చిత్రానికి స్క్రీన్ ప్లే అందించారు. ఇటీవల విడుదలై బ్లాక్ బస్టర్ విజయాన్ని సాధించింది. ఈ సందర్భంగా థ్యాంక్స్ మీట్‌లో హీరో సాయిధరమ్ తేజ్ మాట్లాడుతూ,'ప్రేక్షకుల అభిమానం, ఆదరణ, ఆశీర్వాదంతో ఈ సినిమాను మే 5న హిందీ, తమిళం, మలయాళ భాషల్లో, మే 12న కన్నడలో విడుదల చేస్తున్నాం' అని తెలిపారు. 'ఈ సినిమాను నమ్మి మేం సినిమ చేస్తే.. మాలాగే సినిమాను నమ్మి డిస్ట్రిబ్యూటర్స్ అందరూ డిస్ట్రిబ్యూట్ చేశారు' అని నిర్మాత బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ చెప్పారు. దర్శకుడు కార్తీక్ దండు, 'ఈ సక్సెస్‌కి కారణం కథ. ఈ కథ రాసుకోవటానికి కారణం నా ముగ్గురు స్నేహితులు సంతోష్, శ్రీకాంత్, క్లాక్స్' అని అన్నారు. దిల్ రాజు మాట్లాడుతూ, 'తేజు.. కెరీర్‌లో విరూపాక్ష హయ్యస్ట్ గ్రాసర్‌గా నిలిచింది. దర్శకుడు కార్తీక్,



సాయి ధరమ్ తేజ్

నయా క్రైమ్ కామెడీ థ్రిల్లర్



వెంకట్

మైత్రి ఆర్ట్స్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెం. 1గా తెరకెక్కబోతున్న సినిమా ఆదివారం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ఈ పూజా కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా నటుడు అలీ, నిర్మాత రామ్ తాళ్లూరి, దర్శకులు వైవిఎస్.చౌదరి, వేణు ఉడుగుల, శివబాలాజీ తదితరులు పాల్గొన్నారు. రాజ్ తాళ్లూరి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈ చిత్ర ప్రారంభోత్సవంలో సుచిరిండియా కిరణ్ క్లాప్ కొట్టగా, దర్శకులు వేణు ఉడుగుల కెమెరా స్విచాన్ చేశారు. తొలి సన్నివేశానికి వైవిఎస్ చౌదరి గౌరవ దర్శకత్వం వహించారు. క్రైం కామెడీ థ్రిల్లర్‌గా ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ సినిమాలో హీరో వెంకట్, రవిందర్ రెడ్డి, ఆదిత్య, మహేష్ విట్ట, వెంకట్, వేద్విక, చాందిని రావ్, శుభశ్రీ నటిస్తున్నారు. త్వరలో టైటిల్ అనౌన్స్‌మెంట్‌తోపాటు ఫస్ట్ లుక్‌ను చిత్ర యూనిట్ రిలీజ్ చేయనున్నారు.

ఈ సందర్భంగా దర్శకులు రాజ్ తాళ్లూరి మాట్లాడుతూ, 'మంచి కాన్సెప్ట్‌తో అందరికి నచ్చే సినిమాతో మీ ముందుకు వస్తున్నాను. ఈ నెల 10నుండి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. నిర్మాతలు ప్రవీణ్ రెడ్డి, వాసుదేవగార్ల సహకారం మరువలేనిది' అని తెలిపారు. నిర్మాత ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ,'దర్శకులు రామ్ తాళ్లూరి మంచి స్క్రిప్ట్ చెప్పారు. ఈ కథ నచ్చి వెంటనే సినిమా చేద్దాం అని చెప్పాను. ప్రేక్షకులు ఎప్పుడూ మంచి సినిమాలను ఆదరిస్తారని నమ్మకం ఉంది. ఆ నమ్మకంతోనే ఈ సినిమా నిర్మిస్తున్నాం' అని అన్నారు. ఈ చిత్రానికి కెమెరామెన్: సన్నీ.

స్నేహం.. ప్రేమగా మారిందా?

అనుష్క శెట్టి, నవీన్ పోలిశెట్టి కాంబినేషన్‌లో వస్తోన్న చిత్రం 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి'. ఈ చిత్రంపై ఇప్పటికే మంచి అంచనాలున్నాయి. యూవీ క్రియేషన్స్ బ్యానర్‌లో రూపొందిన ఈ చిత్రానికి పి.మహేష్ కుమార్ దర్శకుడు. రీసెంట్‌గా విడుదల చేసిన ఈ చిత్ర టైటిల్, ఫస్ట్ లుక్



అనుష్క నవీన్ పోలిశెట్టి

పోస్టర్, ఫస్ట్ లిరికల్ సాంగ్‌కు మంచి స్పందన వచ్చింది. లేటెస్ట్‌గా ఈ చిత్ర టీజర్‌ను శ్రీ నిధి కాలేజ్‌లో ఇంజనీరింగ్ విద్యార్థుల సమక్షంలో చిత్ర బృందం గ్రాండ్‌గా రిలీజ్ చేసింది.

ఈ మూవీ ఒక చెఫ్, ఒక స్టాండప్ కమెడియన్ మధ్య సాగే కథగా ఇప్పటికే చెప్పారు. టీజర్‌లో దాన్ని మరింత ఎంటర్టైనింగ్‌గా చూపించారు. రవళి పాత్రలో నటించిన అనుష్క ప్రొఫెషనల్ చెఫ్. పెళ్లంటే ఇష్టం ఉండదు. ఆ విషయంలో ఫ్యామిలీ సపోర్ట్ కూడా ఉంటుంది. ఇటు పేరెంట్స్‌కు ఇష్టం లేకపోయినా స్టాండప్ కమెడియన్‌గా రాణించాలని ప్రయత్నించే కుర్రాడు. ఈ ఇద్దరికీ అనుకోకుండా పరిచయమై, ఆ పరిచయం స్నేహంగా మారుతుంది. మరి ఆ స్నేహం ఏ తీరాలకు చేరింది అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే అన్నట్టుగా ఉంది టీజర్. ఈ ఇద్దరి మధ్య వచ్చే సన్నివేశాలు చాలా ఫ్రెష్‌గా ఉన్నాయి. ముఖ్యంగా అనుష్క.. నవీన్‌ను ఇంటర్వ్యూ చేస్తూ.. నీ స్ట్రెంత్ ఏంటి అని అడుగుతుంది.. అందుకు నవీన్ 'అవకాశం ఉన్నప్పుడల్లా కామెడీ చేస్తుంటా' అని చెబుతాడు.. వీక్ నెస్ గురించి అడిగితే.. సిట్యుయేషన్‌కు సంబంధం లేకుండా కామెడీ చేస్తుంటా' అని చెప్పే డైలాగ్ ఫన్నీగా ఉంది. చివర్లో నీ టైమింగ్ ఎప్పుడూ ఇంతేనా అని అడిగితే కామెడీ టైమింగ్ మాత్రం పర్ఫెక్ట్‌గా ఉంటుంది మేడమ్ అని చెబుతాడు.దీంతో ఈ సినిమా నుంచి కూడా బోలెడు కామెడీ ఎక్స్‌పెక్ట్ చేయొచ్చు అని ఇన్‌డైరెక్ట్‌గా చెప్పారు. మొత్తంగా టీజర్ చాలా ఇంప్రెసివ్‌గా ఉంది. ఖచ్చితంగా ఓ మంచి ఎంటర్టైనింగ్ మూవీని చూడబోతున్నాం అనేలా టీజర్‌తోనే చెప్పారు. తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మళయాల భాషల్లో విడుదల కాబోతోన్న ఈ చిత్రంలో జయసుధ, మురళీ శర్మ తులసి తదితరులు నటించారు.

కాంతారా రేంజ్‌లో నరకాసుర టీజర్

సుముఖ క్రియేషన్స్, ఐడియల్ ఫిలిం మేకర్స్ సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'నరకాసుర'. 'పలాస' ఫేమ్ రక్షిత్ హీరోగా సెబాస్టియన్ ఈ చిత్రానికి డైరెక్ట్ చేశారు. శనివారం ఈ చిత్ర టీజర్ లాంచ్ ఘనంగా జరిగింది.



సంగీర్తన, రక్షిత్, అపర్ణ

ఈ సందర్భంగా నిర్మాత శ్రీనివాస్ మాట్లాడుతూ, 'ఈ సినిమాలోని ఆర్టిస్టులంతా అద్భుతంగా చేసారు. సెబాస్టియన్ బాగా డైరెక్ట్ చేసారు. డీవోపీ నాని వర్క్ చాలా బావుంది. సినిమా కూడా చాలా బాగా వచ్చింది' అని తెలిపారు. 'నాకు ఈ అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థ్యాంక్స్. ఇందులో నా పాత్ర చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుంది. ఈ సినిమా మీ అందరికీ ఖచ్చితంగా నచ్చుతుంది అనుకుంటున్నాను' అని హీరోయిన్ సంగీర్తన అన్నారు.

మరో హీరోయిన్ అపర్ణ మాట్లాడుతూ, 'ఈ మూవీ హండ్రెడ్ పర్సంట్ హిట్ అవుతుందని చెప్పగలను' అని చెప్పారు.దర్శకుడు సెబాస్టియన్ మాట్లాడుతూ, 'నేను స్క్రిప్ట్ రాసుకున్నదంతా తీసే ప్రయత్నం చేశాను. మాక్సిమమ్ నేను అనుకున్న ఫలితం వచ్చింది. ఈ జర్నీ మొత్తంలో ఆర్టిస్టుల సపోర్ట్ మరువలేను. హీరో రక్షిత్ సపోర్ట్ గురించి ఎంత చెప్పిన తక్కువే. స్క్రిప్ట్‌కు తగ్గట్టుగా రకరకాలుగా కనిపించేందుకు రెండున్నరేళ్ల పాటు ఎంతో కష్టపడ్డాడు. ఖచ్చింతంగా ఈ మూవీతో సక్సెస్ అందుకుంటాం' అని తెలిపారు.

'ఒక టీజర్ ఇంపాక్ట్ ఏంటో పలాస టైమ్‌లో చూసాను. ఆ మూవీ తర్వాత గాప్ రావడంతో అందరూ హేళనగా మాట్లాడారు. బట్ ఈ టీజర్ వారికీ సమధానం చెబుతుంది. ఈ మూవీ కోసం రెండేళ్ల పాటు హీరోయిన్స్ కూడా కష్టపడ్డారు. ఇంతమంది సీనియర్ యాక్టర్స్‌తో పని చేసే అవకాశం కల్పించిన దర్శకుడికి థ్యాంక్స్ చెబుతున్నాను. ఈ మూవీ టీజర్ కాంతారా రేంజ్‌లో కనిపిస్తుందనటం ఆనందంగా ఉంది. ఒక మంచి సినిమాతో మీ ముందుకు వస్తున్నాం. త్వరలోనే మరో పాటతో రాబోతున్నాం' అని హీరో రక్షిత్ అన్నారు.

తెలుగుతో పాటు హిందీ, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో త్వరలోనే ఈ సినిమా విడుదల కానుంది.

కళ్యాణమస్తు రిలీజ్‌కి రెడీ



శేఖర్ అయాన్ వర్మ, వైభవి రావ్

శేఖర్ అయాన్ వర్మ, వైభవి రావ్ హీరో, హీరోయిన్లుగా రూపొందుతున్న సినిమా 'కళ్యాణమస్తు'. ఒ.సాయి దర్శకత్వంలో బోయపాటి రఘుబాబు నిర్మించిన ఈ సినిమాను మే 12 రిలీజ్ చేయనున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా ఈ చిత్ర ట్రైలర్‌ను హీరో శివబాలాజీ లాంచ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా ఈ చిత్ర ట్రైలర్‌ను ప్రెజెంట్ చేసారు. అద్భుతమైన విజువల్స్‌తో, క్యూట్ లవ్ స్టోరీతో, కమర్షియల్ ఎలిమెంట్స్‌తో ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా ఉంది. తప్పకుండా సినిమా హిట్ అవుతుందనే నమ్మకం ఉంది' అని తెలిపారు.

'ఈ సినిమా నుంచి ఇప్పటి వరకు రిలీజ్ అయిన ప్రతి కంటెంట్‌కి ప్రేక్షకులు నుండి మంచి స్పందన వచ్చింది. మంచి కాన్సెప్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాం' అని దర్శకుడు ఒ.సాయి అన్నారు. హీరో శేఖర్ వర్మ మాట్లాడుతూ, 'ఈ సినిమాలో ఆడియన్స్ కోరుకునే ప్రతి ఎమోషన్ ఉంది. కామెడీ, డ్రామా, యాక్షన్, స్టోరీ, నా గత సినిమాలతో పోల్చుకుంటే నా మేక్ ఓవర్ చాలా బాగుంటుంది. కచ్చితంగా అందరూ ఈ సినిమా చూసి ఆదరించాల్సిందిగా కోరుకుంటున్నాను' అని చెప్పారు. హీరోయిన్ వైభవి రావ్ మాట్లాడుతూ, 'ఈ సినిమా నాకు చాలా చాలా ఇంపార్టెంట్. అందరూ చాలా కష్టపడి పని చేశారు. కచ్చితంగా మీరందరూ సినిమాని చూసి విజయవంతం చేయాలని ఆశిస్తున్నాను' అని తెలిపారు.

ఆకాశమంత ఎత్తుకు నా తెలంగాణ..



(మొదటిపేజీ తరువాయి)

భావాన్ని, అర్థాన్ని, పున:నిర్మాణ కాంక్షను జీర్ణించుకోలేని పిచ్చివాళ్ల కారుకూతలు కూశారు. "తెలంగాణ రాష్ట్ర పున:నిర్మాణమంటే ఏంటీ? ఉన్నయన్నీ కూలగొట్టి మళ్లీ కడతారా? మొత్తం తెలంగాణనే కూలగొట్టి మల్ల కడతారా?" అంటూ చిల్లర వ్యాఖ్యలు చేశారు. వాటిని పట్టించుకోకుండా ఈ రోజు ఆకాశమంత ఎత్తుకు ఎదిగిపోయింది నా తెలంగాణ అని గర్వంగా ప్రకటిస్తున్నా' అని సీఎం చెప్పారు.

మండు వేసవిలో మత్తడి దుంకే చెరువులే ...

పున:నిర్మాణం అంటే ఏంటో తెలియని మరుగుజ్జులకు నాలుగు మాటలు చెప్పదల్చుకున్నానని సీఎం కేసీఆర్ అన్నారు. సమైక్య పాలనలో కాకతీయుల కాలం నాటి చెరువులన్నీ శిథిలమైనపోయాయన్నారు. జీవనదులు, వాటికి ఉపనదులున్నా గోదావరిలో డబ్బులు, రాగి నాణేలు వేద్దామంటే నీళ్లు ఉండేవి కావన్నారు. రామగుండ వద్ద బ్రిడ్జి మీద నుంచి నడిచి ఎక్కడైనా చిన్న గుంతల్లో నీళ్లు కనిపిస్తే వాటిని వేసేవాళ్లమని చెప్పారు. పున:నిర్మాణంలో భాగంగా నేడు ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణం చేశామనీ, ఆ ప్రాజెక్టు ప్రపంచానికే తలమానికంగా మారిందని చెప్పారు. వాగుల మీద నిర్మించిన చెక్‌డ్యామ్‌లూ గోదావరి, కష్ణ, మంజీర, మానేరు, హల్దీ, కూడవెల్లి తదితర ఉప నదులపై నిర్మించిన చెక్‌డ్యామ్‌లు ఏప్రిల్, మేలో కూడా మత్తడి దుంకుతున్నాయనీ, తెలంగాణ పున:నిర్మాణానికి భాష్యం ఇదేనని అన్నారు.

పున:నిర్మాణం అంటే ...

'ఆ నాడు నెర్రలుబారి నోళ్లువెల్లబెట్టిన లక్షలాది ఎకరాల తెలంగాణ బీడు భూములు నేడు నిండు నీటిపారుదలకు నోచుకొని పంట పొలాలై వెదజల్లుతున్న హరిత క్రాంతే తెలంగాణ పున:నిర్మాణం. ఈ యాసంగి పంటలో భారతదేశంలో ఉన్న వరి పైరు 94లక్షల ఎకరాలు. ఇందులో 56లక్షల ఎకరాలు తెలంగాణలో పండుతున్నదని నేను సగర్వంగా చెబుతున్నా. పున:నిర్మాణం అంటే ఒక కాళేశ్వరం... ఒక పాలమూరు ఎత్తిపోతల పథకం... ఒక సీతారామా ప్రాజెక్టు అని మనవి చేస్తున్నా. అర్ధరాత్రి కరెంటు పోయి.. ఎప్పుడు వస్తుందో తెలియక, పారిశ్రామికవేత్తల ధర్నాలు, ప్రజల గగ్గోలు, జనరేటర్లు, ఇన్వర్టర్లు, కన్వర్టర్లతో ఉన్న రాష్ట్రంలో నేడు అవన్నీ మాయమై జాజ్వల్యమానమైన కరెంటు వెలుగులతో విరాజిల్లుతున్నది తెలంగాణ. ఇదీ పున:నిర్మాణం అంటే. అర్ధరాత్రి కరెంటు పెట్టేందుకు వెళ్లి పొలాల దగ్గర కరెంటు షాకులతో నాడు పాములు, తేళ్లకాట్లతో చనిపోయిన రైతులు నేడు దినం పూటనే సాయంత్రం 6 గంటల వరకు పొలాలను పారించుకొని దర్జాగా ఇంటికి వచ్చి కంటినిండా నిద్రపోతున్నారు. ఈ తెలంగాణ రైతుల దర్పమే తెలంగాణ పున:నిర్మాణమని తెలియజేస్తున్నా' అని అన్నారు.

మిషన్ భగీరథ ప్రతీక

'గ్రామాలు, పట్టణాలు ఎంత అద్భుతంగా అలరాలుతున్నాయో, ఎన్ని అవార్డులు సొంతం చేసుకుంటున్నాయో మీ అందరికీ తెలుసు. క్షీణించిపోయి, పత్తాలేకుండాపోయి అగమైనపోయిన అడవులు నేడు హరితశోభను వెదజల్లుతున్నాయి. ఇదీ తెలంగాణ పున:నిర్మాణం అంటే. కోల్పోయిన అడవులను తిరిగి తెచ్చుకోవడమే పున:నిర్మాణం ఆ అర్భకులు, ఆ మరుగుజ్జులకు చెబుతున్నా. వలసపోయిన పాలమూరు కూలీలు మొత్తం తిరిగి వచ్చి వాళ్ల సొంత పొలాల గట్ల మీద కూర్చుంటే ఇతర రాష్ట్రాల కూలీలు తెలంగాణ పొలాల్లో పని చేస్తున్న దృశ్యాలే తెలంగాణ పున:నిర్మాణమని చెబుతున్నా. ఒకనాడు దాహంతో అల్లాడి, ఫ్లోరైడ్‌తో నడుం వంగి లక్షలాది మంది జీవితాలు కోల్పోయిన, కుమిలిపోయిన తెలంగాణలో మిషన్ భగీరథలో ఇంటింటికీ నీరందిస్తున్నాం. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో ఏ నీళ్లు ఉంటయో.. ఆదిలాబాద్ గోండుగూడెంలో అదే నీరందిస్తున్న మిషన్ భగీరథ తెలంగాణ పున:నిర్మాణానికి ప్రతీక' అని కేసీఆర్ స్పష్టం చేశారు.

అంతర్జాతీయ నగరాలకు ధీటుగా తెలంగాణ

'అంతర్జాతీయ నగరాలకు ధీటుగా తెలంగాణ రూపుదిద్దుకుంటుందున్నది. రాష్ట్రమేర్పడ్డప్పటి నుంచి తెలంగాణలో మత కల్లోలాలు లేవు. సమ్మిళిత అభివృద్ధితో ముందుకు పోతున్నాం. పారిశ్రామిక రంగంలో లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఐటీ విధానంలో బెంగళూరును దాటిపోతున్నాం. మురికి కూపాలుగా ఉన్న పట్టణాలను అభివద్ధి చేస్తున్నాం. పచ్చదనం, డంపుయార్డులతో, ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లతో పట్టణాలు, గ్రామాలు అభివద్ధి చెందుతున్నాయి. అంతర్జాతీయ నగరాలకు ధీటుగా అండర్ పాస్‌లు, ఫ్లైఓవర్లు, లింక్ రోడ్లతో హైదరాబాద్ అభివద్ధి చెందుతున్నది. నగరం నలుదిక్కులా సూపర్ స్పెషాలిటీ హాస్పిటళ్లు నిర్మిస్తున్నాం. యాదాద్రి ఆలయ పున:నిర్మాణం ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తుంది. ప్రపంచంలో అభివద్ధిని, పున:నిర్మాణానికి కొలమానంగా తీసుకునే సూచికలు రెండే రెండు ఒకటి తలసరి ఆదాయం. రెండో ది తలసరి విద్యుత్ వినియోగం. ఇవి నిజమైన అభివద్ధి సంకేతాలు. తలసరి ఆదాయంలో ముందున్నాం. విద్యుత్ వినియోగంలో 2,140 యూనిట్లతో దేశంలోనే అగ్రభాగాన ఉన్నాం. ఆసరా పెన్షన్లతో పేదల ముఖాల్లో చిరునవ్వులు చూస్తున్నాం. సచివాలయం నిర్మాణంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి హృదయపూర్వకంగా అభినందనలు తెలియజేస్తున్నాను' అన్నారు.

కూలగొట్టి కడతారా అని హేళన చేశారు..

పెద్ద పోరాటం తర్వాత తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. సమైక్య పాలనలో తెలంగాణలో చాలా విధ్వంసం జరిగిందనీ, నీళ్లు రానే రావు.. సాధ్యమే కాదు.. తెలంగాణ వెనుకబడిన ప్రాంతం. భారత ప్లానింగ్ కమిషన్‌లో కూడా హైదరాబాద్ మినహా అన్ని జిల్లాలను వెనుకబడిన జిల్లాల్లో చేర్చారు. ఈ రోజు తెలంగాణ సాధించిన ప్రగతిలో ప్రతి ఒక్కరి కషి ఇమిడి ఉంది. అనేక విభాగాలు కలిసి పని చేయడం వల్లే ప్రగతి సాధ్యమైంది. అద్భుతమైన రాష్ట్రాన్ని నిర్మించుకున్నాం. మంత్రుల నుంచి సర్పంచ్ వరకు, సీఎస్ నుంచి గ్రూప్-4 ఉద్యోగుల వరకు అందరికీ నమస్కరిస్తున్నా. సమాన హక్కుల కోసం ఉద్యమించాలనీ, సమీకరించు, బోధించు పోరాడు అని సందేశం ఇచ్చిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని, వారి సందేశంతోనే గాంధీజీ మార్గంలో శాంతియుత పోరాటం చేసి తెలంగాణ సాధించుకున్నాం. అంబేద్కర్ చూపిన మార్గంలోనే మన ప్రయాణం కొనసాగుతున్నదనీ, ఆ మహనీయుడు రాసిన రాజ్యాంగంలోని ఆర్టికల్ మూడు ప్రకారమే తెలంగాణ రాష్ట్రం సిద్ధించింది. ఆయన అంబేద్కర్ స్ఫూర్తిని అందుకుని 125 అడుగుల ఎత్తులో అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్ఠించుకున్నాం. అనునిత్యం అంబేద్కర్ స్ఫురణకు రావాలనే ఉద్దేశంతో సచివాలయానికి ఆ మహనీయుడి పేరు పెట్టుకున్నాం. ఆయన అడుగుజాడల్లోనే నడుస్తామని హామీ ఇస్తున్నాం' అన్నారు.

సచివాలయంలో కొలువుదీరిన మంత్రులు..

తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్మాత్మకంగా నిర్మించిన సచివాలయాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించారు. ఆరో అంతస్తులోని సీఎం కార్యాలయానికి వెళ్లిన ముఖ్యమంత్రి సుముహూర్త సమయంలో కుర్చీలో ఆసీనులయ్యారు. ఒప్పంద ఉద్యోగుల క్రమబద్ధీకరణ సహా ఆరు ఫైళ్లపై సంతకాలు చేశారు. అనంతరం స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రికి శుభాకాంక్షలు తెలిపారు.

తర్వాత మంత్రులు తమ చాంబర్లలో ఆసీనులయ్యారు. సంబంధిత ఫైళ్లపై తొలి సంతకాలు చేశారు. మంత్రి కేటీఆర్.. పేదల ఆత్మగౌరవ ప్రతీక అయిన డబుల్ బెడ్‌రూం ఇండ్లకు సంబంధించిన ఫైలుపై సంతకం చేయగా, మంత్రి హరీశ్ రావు రెండు దస్త్రాలపై సంతకం చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తన చాంబర్‌లో ప్రత్యేక పూజలు చేశారు. ఒకటో అంతస్తులోని తన ఛాంబర్‌లో ఆసీనులైన మంత్రి సబితా ఇంద్రారెడ్డి.. రాష్ట్రంలోని ప్రాథమిక పాఠశాలల్లో పని చేస్తున్న 19,800 మంది ఉపాధ్యాయులకు రూ.34.25 కోట్లతో ట్యాబ్‌లను, 5 వేల ప్రాథమిక పాఠశాలల్లో లైబ్రరీ కార్నర్‌లను రూ. 7.53 కోట్లతో ఏర్పాటు చేసే దస్త్రాలపై తొలి సంతకం చేశారు. ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమానికి సంబంధించిన ఫైల్‌పై మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తొలి సంతకం చేశారు. పౌరసరఫరాల శాఖలో ఐసీడీఎస్ అంగన్వాడీలకు పోషకాల సన్నబియ్యం పంపిణీ ఫైలుపై, బీసీ, ఎంబీసీ కార్పోరేషన్ల ఆక్షన్ ప్లాన్ ఫైల్‌పై మంత్రి గంగుల కమలాకర్ తొలిసంతకం చేశారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని నాలుగు జిల్లాలోని 100 ఆలయాలకు ధూప దీప నైవేద్య పథకం వర్తింపజేస్తు ఫైల్ పై మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి తొలి సంతకం చేశారు. భక్తుల ఆరోగ్యాన్ని దష్టిలో పెట్టుకొని ప్రధాన దేవాలయాల్లో మిల్లెట్ ప్రసాదాన్ని అందుబాటులోకి తెచ్చే దస్త్రంపై ఆయన సంతకం చేశారు. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తన ఛాంబర్‌లో ఆసీనులై పలు దస్త్రాలపై సంతకాలు చేశారు. అనంతరం శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆశీర్వాదం తీసుకున్నారు.

తెలంగాణ మీడియాకు 'నో' ఎంట్రీ

కొత్త సచివాలయం ప్రారంభోత్సవానికి తెలంగాణ మీడియాకు పూర్తిస్థాయిలో ఆహ్వానాలు అందలేదు. దీంతో జర్నలిస్టు సంఘాలు నిరసన తెలిపాయి. మీడియా పట్ల వివక్ష చూపడాన్ని ఖండించాయి. స్థానిక మీడియాను పక్కనపెట్టడం సరికాదని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య, హెచ్‌యూజే అధ్యక్ష, కార్యదర్శులు ఎం. అరుణ్‌కుమార్, బి. జగదీశ్వర్ వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో పత్రికల పాత్ర కీలకమని చెప్పారు. ప్రభుత్వ కార్యక్రమంలోనూ వివక్షను ప్రదర్శించడాన్ని ఖండించారు. పత్రికలు, ఛానెళ్ల వార్తలు, ప్రసారాల పట్ల ఏవైనా అభ్యంతరాలు ఉంటే జాతీయ ప్రెస్‌కౌన్సిల్‌కు ఫిర్యాదు చేసుకోవచ్చని సూచించారు. భవిష్యత్‌లోనైనా మీడియా పట్ల వివక్ష ప్రదర్శించరాదని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

భోజనాల దగ్గర రసాభాస

ప్రారంభోత్సవ కార్యక్రమం ముగిసాక అందరూ భోజనాలు చేసి వెళ్లాలని రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆహ్వానించారు. అయితే ఆమేరకు ఏర్పాట్లు చేయడంలో అధికార యంత్రాంగం విఫలమైంది. భోజనాల దగ్గర రసాభాస చోటుచేసుకుంది. ఏర్పాట్లు పూర్తిస్థాయిలో లేకపోవడంతో ఉద్యోగులు, సిబ్బంది ఇబ్బంది పడ్డారు. అలాగే జాతీయ మీడియాకు, రాష్ట్ర మీడియాకు అసలు భోజనమే లేకుండాపోయింది. చివరకు జాతీయ మీడియాకు వాళ్లకు బసకేటాయించిన హోటళ్లల్లో ఏర్పాటు చేశారు. రాష్ట్ర మీడీయాను మాత్రం పట్టించుకోలేదు.

రగులుతున్న ఇథనాల్ చిచ్చు..

- పరిశ్రమ నిర్మించవద్దని స్తంభంపల్లి గ్రామస్తుల నిరసన

నవతెలంగాణ- వెల్గటూర్

జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలంలో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటయ్యే పరిసర గ్రామాల్లో రోజురోజుకూ ఫ్యాక్టరీ ఏర్పాటుకు వ్యతిరేకంగా చిచ్చు రగులుతూనే ఉంది. ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా ప్రజలు చేస్తున్న ఆందోళనను పోలీసులు అన్నివిధాల అణచివేసే ప్రయత్నం చేస్తున్నారు. పోలీసుల ఒత్తిడి పెరిగినకొద్దీ ఆందోళన మరింత ఉధృతంగా మారుతోంది. కాగా, ఆదివారం తాజాగా స్తంభంపల్లిలో ఇథనాల్ మంటలు చెలరేగాయి. స్తంభపల్లి గ్రామంలో ఇథనాల్ పరిశ్రమ వద్దంటే వద్దంటూ గ్రామస్తులు మైసమ్మతల్లికి బోనాలతో మొక్కులు చెల్లించేందుకు వెళ్తుండగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. దాంతో పోలీసులు, గ్రామస్తులకు మధ్య తోపులాట జరగగా గ్రామస్తులకు స్వల్పం గా గాయాలయ్యాయి. సీఐ కోటేశ్వర్, ఎస్ఐ నరేష్, నచ్చ చెప్పే ప్రయత్నం చేసినా గ్రామస్తులు వినిపించుకోకుండా నెత్తిన బోనం ఎత్తుకుని వెళ్లి బోనం సమర్పించి మొక్కులు చెల్లించారు.

శ్రీశ్రీ చిరంజీవి

- ఆయన సాహిత్యానికి మరణం లేదు
- ఆ సాహిత్యంపై అధ్యయనం పెరగాలి : 'శ్రామిక కవిసమ్మేళనం'లో వక్తలు



నవతెలంగాణ-హైదరాబాద్ బ్యూరో

శ్రమనుంచే సాహిత్యం, సంగీతం, నాట్యం ఆవిర్భవిస్తాయనే వాస్తవాన్ని విశ్వవ్యాప్తం చేసిన మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ) ఎప్పటికీ చిరంజీవే అనీ, ఆయన సాహిత్యానికి మరణం లేదని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ వైస్‌ఛాన్సలర్ ఎస్వీ సత్య నారాయణ అన్నారు. తెలంగాణ సాహితి, అభ్యుదయ రచయితల సంఘం సంయుక్తాధ్వర్యంలో ఆదివారంనాడిక్కడి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శ్రీశ్రీ జయంతి, మేడే సందర్భంగా 'శ్రామిక కవి సమ్మేళనం' నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ఎస్వీ సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. మహాకవి శ్రీశ్రీ ఆధునిక సాహిత్యాన్ని భూమార్గం పట్టించి, భూకంపం సృష్టించారని చెప్పారు. అప్పటివరకు భావుకతలో కొట్టుకుపో తున్న కవిత్వాన్ని అభ్యుదయ, విప్లవ మార్గం పట్టించి, సాహిత్యంలో సామా న్యుడికి చోటు కల్పించారని కొనియాడారు. పోరాడి సాధించుకున్న 8 గంట ల పనిదినాలు ఇప్పుడు ప్రమాదంలో పడ్డాయనీ, సెజ్‌ల పేరుతో పనిని 12 గంటలు తప్పనిసరి చేస్తూ, శ్రమదోపిడీకి పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో ప్రయివేటీకరణ, ప్రపంచీకరణ, సరళీకరణ, అదా నీ, అంబానీకరణలు వచ్చేసి, ప్రజా జీవితాలను ప్రభావితం చేస్తున్నాయని చెప్పారు. ఈ దశలో శ్రీశ్రీ కవిత్వంపై యువరచయితలు, కవుల అధ్యయ నం మరింత పెరగాలని ఆకాంక్షించారు. 'అడ్డంగా రాస్తే వ్యాసం... నిలు వుగా రాస్తే కవిత్వం' కాదనీ, కలకాలం జనం నాలుకలపై నాట్యంచేస్తూ, సమాజాన్ని చైతన్యవంతం చేస్తూ తట్టిలేపే రచనలు రావాలని చెప్పారు. మార్క్సిజం, లెనినిజం దార్శనికతతో కవిత్వం గోడలపై నినాదంగా మారాలని దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో విశిష్ట అతిథిగా పాల్గొన్న తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాళేశ్వరం శంకరం మాట్లాడుతూ ప్రపంచంలో వర్గ దృష్టి, పేద, ధనిక తారతమ్యం ఉన్నన్నాళ్లు శ్రీశ్రీ జీవించేఉంటాడని అన్నారు. ఓంకారార్థాన్ని విప్లవానికి అన్వయించి, సంస్కృత భాషకు ప్రత్యామ్నాయాన్ని తన కవిత్వం ద్వారా చూపారన్నారు. కార్యక్రమానికి తెలంగాణ సాహితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ఆనందాచారి, తెలంగాణ అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాపో లు సుదర్శన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత కందిమళ్ల ప్రతాపరెడ్డి, అభ్యుదయ పాటల రచయిత బండి సత్తన్నకు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలు మాట్లా డుతూ శ్రీశ్రీ కవిత్వం ఎందర్నో ప్రభావితం చేసిందనీ, బాధ నుంచి పుట్టే కవిత్వం శాశ్వతమవుతుందని అన్నారు. ప్రముఖ రచయిత తంగిరాల చక్రవర్తి ఆహూతులను వేదికపైకి ఆహ్వానించగా, శరత్ సుదర్శి వందన సమర్పణ చేశారు. అంతకుముందు కేవీఎల్, సలీమ 'శ్రామిక కవి సమ్మేళనం' నిర్వహించారు.

ఐక్యంగా పోరాడుదాం.. సమస్యలు పరిష్కరించుకుందాం..

రజక వృత్తిదారుల సంఘం మహాసభలో పైళ్ళ ఆశయ్య



నవతెలంగాణ-జనగామ

ఐక్యంగా పోరాటాలు నిర్వహించి రజకుల సమస్యలు పరిష్కరించుకుందామని రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ళ ఆశయ్య పిలుపు నిచ్చారు. జనగామ జిల్లా కేంద్రంలోని వైష్ణవి గార్డెన్స్‌లో రెండు రోజుల పాటు జరిగిన రాష్ట్ర మహాసభలకు రాష్ట్ర అధ్యక్షులు గుమ్మడిరాజు నరేష్, రాష్ట్ర నాయకులు ఎదునూరి మధర్, సుభద్ర, బాలకృష్ణ అధ్యక్ష వర్గంగా వహించారు. చివరి రోజైన ఆదివారం రజకుల సమస్యలపై 12 తీర్మానాలు ప్రవేశపెట్టగా, రాష్ట్ర మహాసభ ప్రతినిధులు చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా ఆశయ్య మాట్లాడుతూ.. గీత, బీడీ కార్మికులకు ఇచ్చినట్టుగానే 50 ఏండ్లు నిండిన వారికి వృద్ధాప్య పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రజకులకు రక్షణ చట్టాలు కల్పించి ఇండ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. రజక వృత్తిదారులకు రూ.10 లక్షల రుణాలు అందించాలని కోరారు. ఉచితంగా విద్యుత్ అందించి రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో, లాండ్రీలు, పోలీసు, రైల్వే, విమానయాన విద్యా రంగ, దోబీ పోస్టులను రజకులకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే బీసీ కులగణన చేపట్టి జస్టిస్ రోహిణి కమీషన్ సిఫారస్సులు అమలు చేయాలన్నారు. పాలకుర్తిలో వీరనారి ఐలమ్మ స్మారక స్మృతి వనం కోసం 6 ఎకరాల భూమి కేటాయించాలని, అలాగే ట్యాంక్ బండ్‌పై ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ప్రతి గ్రామంలో మోడ్రన్ దోభీఘాట్లు, కమ్యూనిటీ భవనాలకు 2 ఎకరాలు కేటాయించాలన్నారు. రైతులకు ఈనాం భూములకు పట్టాలివ్వాలని, చాకి రేవు స్థలాలకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ డిమాండ్ల సాధన కోసం రజకులు ఐక్యంగా పోరాడాలని పిలుపు నిచ్చారు. మహాసభలో సంఘం నాయకులు ఎం.వెంకటేశ్వర్లు, రాక్రే, ఏదునూరి మదర్, ఉల్లెంగుల వెంకటేశ్వర్లు, ఈదునూరి గట్టేశం, కొలిపాక నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో.. ముగిసిన 24వ జాతీయ విద్యా చలనచిత్రోత్సవాలు



విజేతలకు ట్రోఫీలు అందజేత

నవతెలంగాణ-ఓయూ

మూడు రోజుల పాటు హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో ఉత్సాహంగా సాగిన 24వ జాతీయ విద్యా చలనచిత్ర ఉత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. కన్సార్షియం ఫర్ ఎడ్యుకేషనల్ కమ్యూనికేషన్, యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో ఆయా విభాగాల్లో విజేతలైన డాక్యుమెంటరీ డైరెక్టర్లు, ప్రొడ్యూసర్లు, సాంకేతిక నిపుణులకు ట్రోఫీలను అందజేశారు. ఈ ముగింపు కార్యక్రమనికి ముఖ్య అతిథిగా ఓయూ రిజిస్ట్రార్ ప్రొ.పప్పుల లక్ష్మీనారాయణ, గౌరవ అతిథిగా యూజీసీ వ్యవహారాల డీన్ ప్రొ.జి.మల్లేశం హాజరయ్యారు. సీఈసీ డైరెక్టర్ ప్రొ.జేబీ.నడ్డా మూడు రోజుల పాటు ఇక్కడే ఉండి డాక్యుమెంటరీ చిత్రోత్సవాన్ని తిలకించారు.ఈ సందర్భంగా రిజిస్ట్రార్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. ఓయూలో తొలిసారి ఇలాంటి కార్యక్రమం జరిగినా విజయవంతం చేసినందుకు నిర్వాహకులను అభినందించారు. భవిష్యత్తులోనూ విద్యాసంబంధ కార్యక్రమాలు ఓయూకు కేటాయించాలని సీఈసీ డైరెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. దృశ్య మాధ్యమానికి సమాజంలోని అన్ని అడ్డంకులను ఛేదించే సత్తా ఉందని, ఇంట్లో అమ్మ చేసే పని మీదా డాక్యుమెంటరీలు రావాలని యువ డైరెక్టర్లు, ప్రొడ్యూసర్లు, విద్యార్థులకు పిలుపునిచ్చారు.

ఫీజు వాపసు మార్గదర్శకాల్లో అస్పష్టత

ఇంటర్ బోర్డు నిర్లక్ష్యానికి పరాకాష్ట

- కార్పొరేట్ విద్యా సంస్థలు, అకాడమీల ఫీజు దోపిడీ : ఎస్ఎఫ్ఐ డిమాండ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

విద్యా సంవత్సరం మధ్యలో చదువు మానేసే ఇంటర్ విద్యార్థులకు ఫీజు వాపసు ఇవ్వాలంటూ ఇంటర్‌బోర్డు విడుదల చేసిన మార్గదర్శకాల్లో అస్పష్టత నెలకొందని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) పేర్కొంది. కార్పొరేట్ కళాశాల్లో చదువుల కోసం విద్యార్థులను తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్న వాటిపై చర్చ లేదనీ, రెసిడెన్షియల్ పద్ధతిలో అపార్టుమెంట్లలో నడిపిస్తున్న కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకుంటామనే ప్రస్తావనే వాటిలో లేదని తెలిపింది. ఈమేరకు ఆదివారం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎస్ మూర్తి, టి నాగరాజు ఒక ప్రకటన విడుదల చేశారు. జాతీయ ర్యాంకుల పేరుతో విద్యార్థులను ఒత్తిడికి గురి చేయడం, కోచింగ్ పేరుతో లక్షల రూపాయల వసూలు చేయడంపై మార్గదర్శకాల్లో అసలు పేర్కొనలేదని విమర్శించారు. ఫీజు వాపసు ఇవ్వని కళాశాలలపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వివరించలేదని తెలిపారు. పరోక్షంగా వారికే మద్దతు ఇచ్చినట్టుగా ప్రభుత్వ మార్గదర్శకాలున్నాయని పేర్కొంది.

గ్రామీణ ఉపాధి సమస్యలపై దశలవారీ పోరాటాలు

18న రాష్ట్ర సదస్సు

- మే 22 నుంచి 31 వరకు ఇందిరాపార్క్ వద్ద రిలే దీక్షలు
- పట్టణ ప్రాంతాలకు ఉపాధి పనిని విస్తరించాలి: గ్రామీణ ఉపాధి హామీ పరిరక్షణ కమిటీ పిలుపు



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పేదలకు దూరం చేస్తున్నదనీ, ఇలాంటి విధానాలను వెనక్కి తీసుకోవాలని గ్రామీణ ఉపాధి హామీ పరిరక్షణ కమిటీ డిమాండ్ చేసింది. పట్టణ ప్రాంతాలకు ఉపాధిని విస్తరించాలని కోరింది. దశల వారీ ఆందోళన పోరాటాలను నిర్వహించాలని నిర్ణయించింది. అందులో భాగంగా ఈనెల 18న రాష్ట్ర సదస్సు నిర్వహించాలనీ, మే 22 నుంచి 31 వరకు ఇందిరాపార్కు వద్ద రిలేదీక్షలు చేపట్టాలని పిలుపునిచ్చింది. ఈమేరకు ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం(వ్యకాస) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రాములు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్, దళిత బహుజన ఫ్రంట్ జాతీయ అధ్యక్షులు పి. శంకర్, కార్యదర్శి పులి కల్పన, పీపుల్స్ మానిటర్ రింగ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ పి. శివలింగం, దళిత బహుజన శ్రామిక యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. నరసింహ తదితరులు సమావేశమై, పలు నిర్ణయాలు తీసుకున్నారు. గ్రామీణ ఉపాధి సమస్యలపై చర్చించారు. అనంతరం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గ్రామీణ ఉపాధి చట్టాన్ని గొంతు నులిపి చంపాలని చూస్తున్నదని విమర్శించారు. అందులో భాగంగానే నిధులను భారీగా తగ్గించారనీ, ఉపాధి జాబ్ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్, మొబైల్ నెంబర్ లింకు పేరుతో కూలీల సంఖ్యను కుదించేందుకు సీరియస్ ప్రయత్నం చేస్తున్నదని చెప్పారు. ఉదయం ఏడు గంటలకు, సాయంత్రం ఐదు గంటలకు పని ప్రదేశంలో కూలీలు ఫోటోలు దిగి వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేస్తేనే వేతనాలు ఇవ్వాలని సర్క్యులర్‌ను జారీ చేయడం సరైందికాదని పేర్కొన్నారు.

మేడే పాఠం పోరాటం

ప్రైవేటీకరణ కార్పొరేటీకరణ
సరళీకృత ఆర్థిక విధానాలతో
ప్రభుత్వ రంగం క్షీణించి
శాశ్వత ఉద్యోగాలు లేక
పొరుగు సేవలంటూ
కాంట్రాక్టు ఉద్యోగులంటూ
వాలంటీర్ వ్యవస్థ అంటూ
స్కీం వర్కర్స్ అంటూ
యాజమాన్య దయా దాక్షిణ్యాలతో
ప్రైవేట్ రంగ ఉద్యోగులు
భద్రతా భరోసా లేక
కనీస వేతనాలు లేక
ఆర్థిక స్థిరత్వం లేక
పగలనకా రాత్రనకా
నిర్ణీత పని గంటలు లేక
ప్రమాదకర పరిస్థితులలో
పనిచేయుచు కార్మికులు
శ్రమ దోపిడీకి గురవుతున్న వేళ
ఉపాధి లేని నిరుద్యోగ యువతకు
మేడే నేర్పిన పాఠం
శ్రమదోపిడి నివారణకు
కార్మికుల హక్కుల రక్షణకు
కార్మిక చట్టాల అమలుకు
పోరాటాలు ఉద్యమాలు చేస్తున్న
ప్రజా సంఘాలతో ఐక్యమయ్యే
సమయం వచ్చిందని
రాజ్యాంగం కల్పించిన
సంక్షేమ రాజ్య స్థాపన
సాకారమవ్వాలంటే
జాతిసంపదలో అందరు
భాగస్వాములవ్వాలంటే
సామాజిక న్యాయం జరగాలంటే
బడుగు బలహీన వర్గాలకు
రిజర్వేషన్లు అమలు కావాలంటే
ఉత్పత్తి సాధనాలను
సహజ వనరులను
ప్రభుత్వ రంగ సంస్థలను
పరిరక్షించుకోవడమే మార్గం
దానికి ఐక్య ఉద్యమాలే శరణ్యం
అదే మే డే నేర్పిన పాఠం
(మే డే కార్మికుల దినోత్సవం సందర్భంగా)

- పి. రామనాథం



మేడే గీతం

నింగిలోంచి తొలి సూర్యుడు తొంగి చూసినట్టు
నేల మీది చెట్టు చివర పిట్ట కూసినట్టు
అలల జడికి కలల గీతమాలపించినట్టు
శ్రమల తోట మందారం ఎగసిపూసినట్టు

పల్లవి : ఎర్రెర్రని బావుటా ఎగిరింది నేడు
శ్రామికుల తోడుగా నిలిచింది చూడు
అనుపల్లవి : రేపు గెలుపు నాదేనని రెపరెపరెప మెరిసింది
మేడే దారులలోనే పీడిత విముక్తి అంది!

పని గంటను తన ఇంటికి నింపుకొనేవాని
తరతరాల దోపిడికి తెరను లేపినోన్ని
చెమట చుక్క దుర్బలమని చెరపట్టిన వాన్ని
నిగ్గదీసి నిలువరించి నినదించిన రోజు

కష్టజీవి కన్నీళ్లను తుడిచి ధైర్యమిచ్చింది
కడు బాధల కారణాలు విడమరచి చెప్పింది
పిడికిళ్లు బిగపడితే తెగిపడును సంకెళ్లని
పోరులోనే శ్రమఫలాలు చేరుననీ తెలిపింది

సంపద రాశులు నింపిన సాధకులే శ్రామికులని
పంపకాల మోసాలూ ఇంకా ఇక సాగవనీ
పీడన, దౌర్జన్యాలూ ఇక సహించబోమనీ
గర్జించిన సమూహాల సంకేతమే నేననీ

మానవతను హతమార్చే మతతత్వం మనకొద్దనీ
మనిషిని మనిషిగ నిలిపే ఆశయాన్ని నింపుకొని
పెట్టుబడికి పుట్టిన అసమానత తరిమేయగ
కట్టుబడిన జన చేతన కదన శంఖారావమయి

- కె.ఆనందాచారి

బాలల చైతన్య గేయాలు.. చిటికెలు

వేల ఏండ్లుగా తెలుగు సాహితీ స్రవంతి అనేక పాయలతో ప్రవహిస్తూనే ఉంది. జానపద సాహిత్యం, పద్య సాహిత్యం, గద్య సాహిత్యం, బాల సాహిత్యం ఈ పాయలలో కొన్ని. ఇతర ప్రక్రియలతో పోల్చినప్పుడు బాల సాహిత్యం రాయడం చాలా తేలిక అనే అపోహ సాహితీవేత్తలలో ఉంది. నిజానికి బాల సాహిత్య సృజన అత్యంత కష్టమైన పని. గత రెండు దశాబ్దాలుగా తాను పనిచేస్తున్న పాఠశాలల్లో పిల్లలలో సృజనకారులను వెలికితీస్తూ నిరంతరం శ్రమిస్తున్న ఉత్తమ ఉపాధ్యాయుడు కన్నెగంటి వెంకటయ్య. పిల్లల నుంచి సృజనాత్మక రచనలు రాబట్టే క్రమంలో వారికి మార్గదర్శిగా ఉంటూ బాలసాహిత్యం రాస్తున్నాడు. పిల్లల కోసం అనేక గేయాలు, కవితలు, కథలు రాశారు. తన సాహిత్యాన్ని ప్రచురించడం కంటే పిల్లల సాహిత్యాన్ని ప్రచురించడంలోనే ఎక్కువ ఆనందాన్ని పొందే కన్నెగంటి ఇప్పుడు తన బాలగేయాలను 'చిటికెలు' పేరుతో వెలువరించారు.

బాల సాహిత్యంలో మేలుబంతి లాంటి గ్రంథం చిటికెలు. అలతి అలతి పదాలతో సరళ సుందరంగా పిల్లల మనసు దోచే గేయాలు ఇవి. చెట్టు తల్లి వంటి కథా గేయంతో పాటు పిల్లలకు ఉల్లాసాన్ని కలిగించేవి. విజ్ఞానదాయకమైన గేయాలు ముఖ్యంగా విజయమా, చెట్టు గజల్, జమిలి కన్నులు వంటి గజల్స్ పిల్లలు పాడుకునే స్థాయిలో రాయడం అభినందించదగ్గ విషయం. ఈ గేయాలలో శాస్త్రీయ దృక్పథం ఉంది. పర్యావరణ స్పృహ ఉంది. దేశభక్తి, గురు భక్తి, మాతృ భక్తీ కనిపిస్తాయి. చిన్నపిల్లల్లోనే సామాజిక స్పృహను రగిలించే గొప్ప గేయాలు ఇవి.

"రైతన్నల మేలును కోరు / మిత్రమా! నీ బ్రతుకు తీరు / నీ పాదపు ధూళి తగిలితే / పూలన్నీ పండ్లవుతాయి / పంట చేల నాశించే / పురుగులను అంతం చేసే / విషపూరిత రసాయనాలు / కసిరి కాటు వేశాయా!"


(సీతాకోకచిలుకమ్మా)

సీతాకోకచిలుక గేయం గొంగళి పురుగు నుంచి సీతాకోక చిలుక పరిణతి చెందే వైనం, సీతాకోకచిలుకలు రైతులకు చేసే మేలు, నేడు సీతాకోకలు చిలుకలు అంతరించి పోతున్న దుస్థితికి కారణం మొదలైన అంశాలు అత్యంత సరళంగా పిల్లలు తేలికగా అవగాహన చేసుకునే స్థాయిలో వివరించారు. కాలుష్యం బారి నుంచి మానవాళిని కాపాడుకోవాల్సిన అవసరాన్ని, పర్యావరణం పట్ల అవగాహనను కలిగించే మరొక గేయం 'అన్నా పుల్లన్నా'.

చెట్టు పరోపకార గుణాన్ని తెలియజేసే మరొక గేయ కథ 'చెట్టుతల్లి'

పొరుగుపక్షి చీదరించె /ఆదరించలేదు మనిషి /చెట్టుతల్లి చేర దీసి /పిల్లకాకులను పెంచె అనాధలైన పక్షి పిల్లలను చేరదీసి ఆదరించే గొప్ప గుణం చెట్టుకు ఉంటుందని తెలుపుతూ పరోక్షంగా చెట్టును కాపాడుకోవాల్సిన అవసరాన్ని చెప్పకనే చెప్పారు. చెట్టు గజల్ కూడా చెట్టు గొప్పదనాన్ని చాటి చెప్పింది. 'చిట్టి గేయాలు' 'ముద్దుల చిన్నారి' ప్రకృతి సౌందర్యాన్ని ఆవిష్కరించాయి.

పాఠశాల స్థాయిలో పిల్లల తరగతి గదిలో కాస్త నిరాసక్తంగా ఉండే అంశం చందస్సు బోధన. దీనిని అధిగమించడానికి చందస్సును అలవోకగా నేర్పించే వృత్త పద్య లక్షణాల గేయం రాశారు. పిల్లల మనసులో ఇవి నాటుకు పోతాయి.



బల్లి మిడతలు మింగినా, గుడ్లగూబ ఉడత కోసం చూసినా, నక్క కుందేలు కోసం చూసినా, పాము కప్ప కోసం వెతికినా, మృగం లేడీ కోసం వెతికినా, గద్ద కోడి పిల్ల కోసం చూసినా అది తన ఆకలి తీర్చుకోవడం కోసం మాత్రమే. అంతేగాని మనిషి సాటి మనిషిని చంపడం అన్యాయం అంటారు ఒక గేయంలో. మనిషిని మనిషి చంపే ఆటవిక న్యాయాన్ని నిరసిస్తూ ఇతర జీవులు కూడా కేవలం ఆకలి కోసం మాత్రమే పొరుగు జీవులను చంపుతాయని సోదాహరణంగా వివరించే గేయం శాంతి సందేశం.

ముత్యాల సరాలు చందస్సులో గురుబోధ గొప్పదనాన్ని చాటే మరొక గేయం విశ్వమంత గురువు. విద్యార్థులను విజయం వైపు అడుగులు వేయించే స్ఫూర్తివంతమైన గేయం 'విజయమా'. మహనీయుల స్మరించుకునే గేయాలు కూడా ఈ సంపుటిలో కనిపిస్తాయి

అంబేద్కర్ అంటే వొక /దళిత జనుడు కాదు/ పీడిత తాడిత సరాన/ ప్రవహించే జవజీవం/ భారత రాజ్యాంగ రూపం /దారి చూపు జ్ఞాన దీపం అంటూ అంబేద్కర్ ఈ జాతికి చేసిన సేవను ఆవిష్కరిస్తుంది.

విద్యార్థులలో దేశభక్తిని ప్రోదిచేసే గేయం 'గమనదేవుళ్ళు'. బానిస బతుకుల విముక్తి కోసం తనువును సమిధగ అర్పించి వురికొయ్యలను విరిమాలలుగా చిరునవ్వులతో ధరించిరి.

దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను స్మరించుకోవలసిన అవసరాన్ని 'వందేమాతరం.. వందేమాతరం...' తెలిపింది. ఇటువంటి మరొక గేయమే స్వాతంత్ర్యం కోసం జాతీయ గీతం గొప్పదనాన్ని, గాంధీ, భగత్ సింగ్, అల్లూరి సీతారామరాజు, తిలక్ మొదలైన స్వాతంత్ర సమరయోధులను కీర్తించినది.

గోరుముద్దలతో పాటు పురాణేతిహాసాలను నూరిపోసిన అమ్మకు నమస్కరించే పాట 'అమ్మా వందనం'. అమ్మతో పాటు అమ్మ భాషను గౌరవించాలని తెలుగు ఔన్నత్యాన్ని చాటుతూ కన్నెగంటి రాసిన గేయం తెలుగు భాష. జీవనది గంగానది వంటి తెలుగు భాషలో ఎన్ని పరాయి భాషలు అయినా అలవోకగా ఇమిడిపోతాయని, తెలుగు భాష మాత్రం నిత్యం ప్రవహిస్తూనే ఉంటుందని తెలియజెప్పారు.

"కన్నెగంటి వెంకటయ్య చిటికెవేస్తే చాలు పాటవుతుంది. గేయమవుతుంది. గజల్ అవుతుంది. గాన ప్రవాహమవు తుంది. కొన్ని చిటికెలు వేసి పిల్లలతో రాయించారు. కొన్ని చిటికెలతో శతకం చేయించారు. తాను పనిచేసిన పాఠశాలల పిల్లల్లో ఇంద్రధనస్సులు పూయించారు. ఆయన ఏ పనైనా చిటికెలో చేస్తారు." డాక్టర్ సీతారాం అభిప్రాయపడ్డట్లు నిజంగానే ఇటువంటి సృజనకారులైన ఉపాధ్యాయుల అవసరం నేటి సమాజానికి ఎంతో ఉంది.

పాఠశాలలో జరిగే ఏ కార్యక్రమంలోనైనా పాడుకోవడానికి స్వాగత గీతాన్ని అందించారు. కాళోజీ, జాషువాలపై రాసిన స్మృతి గీతాలు ఆయా కవులపై పిల్లలకు లోతైన అవగాహన కలిగిస్తాయి అనడంలో సందేహం లేదు.

ఆడపిల్లలపైన, స్త్రీలపైన జరుగుతున్న అఘాయిత్యాల పట్ల చైతన్య స్పృహను కలిగించే గేయం 'చెల్లెలా ఊర్మిళ..' ఇందులో స్త్రీల పట్ల జరిగే ఘోరాలకు కారణాలను తమను తాము రక్షించు కోవలసిన అవసరాన్ని చైతన్యాన్ని కవి అందించగలిగాడు. మన సంస్కృతి వైభవాన్ని చాటే బతుకమ్మ పాట, గ్రంథాలయ అవసరాన్ని చెప్పే గేయం ఈ సంపుటిలో కనిపిస్తాయి.

"కన్నెగంటి వెంకటయ్య చిటికెవేస్తే చాలు పాటవుతుంది. గేయమవుతుంది. గజల్ అవుతుంది. గాన ప్రవాహమవు తుంది. కొన్ని చిటికెలు వేసి పిల్లలతో రాయించారు. కొన్ని చిటికెలతో శతకం చేయించారు. తాను పనిచేసిన పాఠశాలల పిల్లల్లో ఇంద్రధనస్సులు పూయించారు. ఆయన ఏ పనైనా చిటికెలో చేస్తారు." డాక్టర్ సీతారాం అభిప్రాయపడ్డట్లు నిజంగానే ఇటువంటి సృజనకారులైన ఉపాధ్యాయుల అవసరం నేటి సమాజానికి ఎంతో ఉంది.

"కన్నెగంటి వెంకటయ్య ఖమ్మం కేంద్రంగా సాగుతున్న బాల వికాస యజ్ఞానికి రెండు దశాబ్దాలుగా ముందు నిలిచి నడుస్తున్న బాలవికాస కార్యకర్త. తన నేతృత్వంలో నిర్వహించిన కార్యశాల్లో వందలాది మంది చిన్నారి కవి గాయకులు అక్షరారంగేట్రం చేశారు". అన్న కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పత్తిపాక మోహన్ మాటలు బాల సాహిత్యం లో కన్నెగంటి కృషిని ప్రస్ఫుటం చేస్తున్నాయి. కన్నెగంటి కేవలం ఖమ్మం బాలవికాస యజ్ఞానికి కార్యకర్త మాత్రమే కాదు, ఉభయ తెలుగు రాష్ట్రాల బాలవికాసానికి మార్గదర్శి కూడా. రెండు దశాబ్దాలకు పూర్వమే ఈ ప్రయత్నం మొదలు పెట్టింది కన్నెగంటి వెంకటయ్య కావడం గమనార్హం.

"విద్యార్థులను సాహిత్య సృజన శీలురుగా మలచడంలో పడే శ్రమ, తపన చూసినప్పుడు ముచ్చటేస్తుంది. ఈర్ష్య కూడా కలుగుతుంది. మొత్తం ఇరవై నాలుగు గేయాలతో వెలువడిన ఈ పుస్తకంలోని గేయా లన్నీ ప్రతి పాఠశాలలో పిల్లలు విధిగా నేర్చుకో దగినవి. వీటి వల్ల జ్ఞానంతో పాటు సమాజం పట్ల అవగాహన ప్రకృతి పట్ల ఆరాధన దేశభక్తిని పిల్లల్లో రగిలించ గలం. విద్యార్థులకు కావలసిన విలువలను అందించడంలో రచయిత కృతకృత్యులయ్యారు.

- సాగర్ల సత్తయ్య, 7989117415

5న 'హార్ట్ బీట్' ఆవిష్కరణ

ఎం.విప్లవకుమార్ వ్యాస సంకలనం 'హార్ట్ బీట్' పుస్తకావిష్కరణ ఈ నెల 5న సాయంత్రం 6 గం॥లకు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నారు. భూపతి వెంకటేశ్వర్లు సభాధ్యక్షతన నిర్వహించే ఈ కార్యక్రమంలో కంచ ఐలయ్య పుస్తకావిష్కరణ చేయనున్నారు. ముఖ్య అతిధులుగా విమలక్క, అతిధులుగా జాన్ వెస్లీ, మల్లు లక్ష్మి, కంబాలపల్లి కృష్ణ, చలకాని వెంకట్ యాదవ్, కొండూరి వీరయ్య, కలుకూరి రాజు తదితరులు హాజరు కానున్నారు. వివరాలకు 9573715656 నంబరు నందు సంప్రదించవచ్చు.

సాహితీ వార్తలు

బాలచెలిమి పర్యావరణ కథల పోటీలు

బాల చెలిమి ఆధ్వర్యంలో పర్యావరణంపై కథల పోటీలు నిర్వహించనున్నారు. పర్యావరణ పరిరక్షణ అంశంగా పిల్లల నుంచి, పెద్దల నుంచి కథలను ఆహ్వానిస్తున్నారు. ఎంపికైన కథలతో వేర్వేరు సంకలనాలు తీసుకువస్తారు. ఆసక్తి కలిగిన వారు మే 10 లోగా 9793059793 వాట్సాప్‌కు లేదా desk.chelimi@gmail.com మెయిల్ ఐడీ లేదా భూపతి సదన్, 3-6-716, స్ట్రీట్ నెం. 12, హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029, తెలంగాణ చిరునామాకు పంపవచ్చు. వివరాలకు 9030626288 నంబరు నందు సంప్రదించవచ్చు.

కవిగా,
కథకునిగా, పరిశోధకునిగా, వాగ్గేయకారునిగా, జర్నలిస్టుగా,
దళిత, తెలంగాణ ఉద్యమాల నాయకుడిగా ఎన్ని పాత్రల్లోకి ఒదిగినా అతడిది అంబేద్కర్ తాత్విక దృక్పథమే. పసునూరి పల్లె నుంచి పట్టణాల వరకు ఆధునిక సామాజిక అంతరాల సమాజంలో వివక్ష ఎలా రూపాంతరం చెందుతున్నా, అనేక విషయాలను స్వీయ అనుభవ పూర్వకంగా రాసిన యదార్థ బతుకు కథలే ఈ 'కండీషన్స్ అప్లయ్' కథలు.

కాలాన్ని పట్టించే 'కండీషన్స్ కథలు'

దళిత జీవితాల్లోని ఒక్కో పార్శ్వాన్ని ఒక్కో కథలో క్షుణ్ణంగా రాయడమే కాకుండా, దేశ సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక అంశాలను ధిక్కార స్వరంతో నొక్కి చెప్పడం మనకు స్పష్టంగా కన్పిస్తుంది. దేశం అభివృద్ధి పథంలో వెలిగిపోతోంది. డిజిటల్ ఇండియాగా మారిపోతోంది. ప్రపంచ దేశాలకు ధీటుగా ఆర్థిక స్వావలంబన సాధించి ధనిక దేశాల సరసన నిలబడి వున్నదని చెప్పే అసత్య ప్రచారాలను తిప్పికొడుతూ... తినేందుకు తిండిలేక ఆకలిని తట్టుకోలేక ఆకులుతినే ఒక వ్యక్తి రోదన చుట్టూ జరిగే వాస్తవిక జీవితాన్ని ఈ ప్రపంచం ముందుంచాడు. ఇందులోని 'లీఫ్ మ్యాన్' కథ చదువుతున్నంతసేపు ఈ దేశ ఆకలి నిజస్వరూప తిప్పలెన్నో కళ్ల ముందే కన్పిస్తుంటాయి. ఒక సర్వే సంస్థ 122 దేశాలలో చేపట్టిన సర్వేలో ఆహార సూచిలో నూటయేడవ స్థానంలో నిలిచింది మన దేశం. ఈ దౌర్భాగ్యాన్ని చెప్పుకోలేని పాలకుల దాపరిక పాలన మనది. ఆకలి కోసం రొట్టె ముక్కను దొంగిలించిన మధు అనే కేరళ యువకుడు ఈ దేశంలో ఆకలికి ఈ పాలకులు తెగేసి నరికిన శిల్పంలా కన్పిస్తాడు. ఇదే కోవలో 'లీఫ్ మ్యాన్' కథలో ఆకలి తట్టుకోలేక ఆకులు తినే పేదవాడికి పట్టెడన్నం పెట్టలేని సమాజం మాత్రం అలమటించే వాడిని దేవుణ్ణి చేస్తుంది. ఇది ఈ దేశ వైవిధ్య తనానికి సంకేతం.



కులాంతర ప్రేమ ఈ దేశంలో దళిత యువతీ యువకుల పట్ల పెనుభూత సవాలే. ప్రేమించినందుకే ఎంతో భవిష్యత్తు ఉన్న దళిత బిడ్డలు నడిరోడ్ల పైన నరకబడ్డారు. ఇవి కనిపించినవే. ఇంకా కనిపించని, బయటపడని దారుణాలెన్నో "పులి అడుగు దెబ్బ" కథలో అద్భుతంగా చిత్రించాడు రచయిత. ఎందరో కులపిచ్చి విటులకు పడక సుఖంలో కనిపించని కులం, పెళ్ళి వద్దకు రాగానే కుల కంపు వాసనలు గుప్పుమంటాయి. ఇలాంటి కులోన్మాదుల ప్రేమ పైశాచికంపై తాను కోల్పోయిన ఆత్మ గౌరవాన్ని, తన అస్థిత్వానికి కేంద్రమైన సూర్యుని వంటి తోలు డప్పుపైన పునీతురాలై, ఈ కథలో ఆత్మగౌరవ పులి అడుగు దరువులను కొడుతుంది రాజవ్వ.

ఈ దేశం నలుమూలల్లో పిల్లులను పొడుసుక తినేటోళ్లు, ఎలుకల్నీ, పాములని తినేటోళ్ళు, తాబేలు మొదలు చేపలను తినేటోళ్ళు ఉన్నారు. అలాగే పందులను నుంచి గాడిదల వరకు స్వేచ్ఛగా తినేటోళ్ళు ఉన్నారు. మరి ఎవ్వరి తిండిలో లేని మహత్యం ఈ దేశ దేవుళ్ళంతా కొలువై వున్నదల్లా దళితులు తింటున్న గొడ్డులోనే అంటా. ఇదెక్కడి చిత్రమో ఏమో అనిపిస్తుంది గానీ, ఇదే అతిపెద్ద కుట్ర! వేదకాలంలో యజ్ఞంలో బలిచ్చిన పశువుల సంగతే ఇప్పుడు అప్రస్తుతం, కానీ దేశం నలుమూలల రోజుకోక వార్త అత్యధిక జన సమూహం ఆరగించే బలిష్టమైన ఆహారం పైననే. ఇంగ్లీష్ చదువులు చదువుకుంటున్నా సరే ఆధునీకరణకు అలవాటు పడినా సరే మతం ఉచ్చులో పడినోడు పశువుల ఉచ్చనే పరమతీర్థంలా భావించి ఎదుటోడి తిండిపైన దాడులకు తెగబడినపుడు ఈ దేశంలో ఒక్కో దళితుడు నాన్-వెజిటేరియన్ కథలోని ఏకాంబ్రం అవతారమెత్తుతాడు.



నూట-నలభై కోట్ల జనాభా ఉన్న భారతావనిలో అడుగడుగున వెక్కిరిస్తున్న అతిపెద్ద జాతీయ సమస్య నిరుద్యోగం. ఎన్నో ఉన్నత చదువులు చదువుకున్న యువత ఫ్యాక్టరీలలో కార్మికులుగా అడ్డాలపై రోజువారీ కూలీలుగా దర్శనమిస్తున్న వైనం మనకు కన్పిస్తుంది. అధికారంలోకి రావడానికి ముందు ఎన్నికల్లో గొంతులు చించుకొని లక్షల ఉద్యోగాల కల్పనకు కట్టుబడతామనే మాటలన్ని నీటిమూటలే అన్నట్లుగా వ్యవహరించే ఈ దేశ పాలకుల అలసత్వ పరాకాష్టకు "జెజ్జనక...జెన్" అనే కథ. ఒక సవాలుగా నిలబడి నిరుద్యోగ సమస్యకు కారకులైన పాలకుల అధికారాన్ని కూలదోసే ప్రక్రియను రగిలే గుండె గోసను డప్పు దరువుల్లో విన్పిస్తాడు.

ఈ దేశం అంటరానోడని ముద్రవేసి అనేకమైన చిత్రహింసలకు గురిచేసినా సరే, మరొక వందేళ్ల వరకు ఈ దేశంలో ఎటువంటి రాజకీయ, సామాజిక, ఆర్థిక, సమస్యలు తలెత్తినా సరే, ఏకైక పరిష్కారమై కనిపించే మహోన్నత శిఖరం డా.బి.ఆర్.అంబేద్కర్. ఆయనకు ఇదంతా కూడా చదువు వల్ల కల్గిన జ్ఞాన సంపద. నేటి ఆధునిక సమాజంలో కూడా పరిశ్రమలు, భూములు, అధికారాన్ని, సంపదనంతా తమ వద్దే ఉంచుకున్న ఆధిపత్య కులాలకు ధీటుగా ఎదిగి వారిని, ఎదిరించి నిలవా లంటే మనకున్న ఏకైక ఆయుధం చదువు అని తద్వారా వచ్చే జ్ఞానమే సాధనమని ఈ పుస్తకంలోని "తలదన్నినోడు" కథలో సవివరంగా చెప్తాడు పసునూరి.

"మీరు ఏ దిక్కుకు తిరిగినా సరే దారికి అడ్డంగా పెనుభూతంలా నిలబడ్తుంది కుల వ్యవస్థ. ఈ భూతాన్ని చంపి పాతరేయకుండా మీరు రాజకీయ సంస్కరణలుగానీ, ఆర్థిక సంస్కరణలు గానీ సాధించలేరనీ" అంటారు డా.బి.ఆర్.అంబేద్కర్. అమెరికా పోయి అక్కడ ఉన్నత చదువులు చదివి ఉన్నతమైన ఉద్యోగం చేస్తున్నా సరే అక్కడకు అంతకు ముందే చేరినా తిరోగమనవాదులు మన పేరు చివర ఉన్న తోకను కూడ గుచ్చి-గుచ్చి అడగడంలో ఎంతటి సిద్ధహస్తులో "తోకల లోకం" అనే కథలో మనకు సవివరంగా చెప్తాడు. ఈ దేశ పట్టణాల్లో ఎత్తైన కట్టడాలలో ఉన్నతమైన జీవితాన్ని అనుభవిస్తున్న ఆధిపత్య కులాలు తమతో నివసించే శూద్ర, అతి శూద్ర కులాలను తెల్సుకొనుటకు ఆరాటపడే విధానాన్ని అతి స్పష్టంగా తెలియ జేయటంలో రచయిత కులపీడినానికి గురైన జీవితం అనుభవం కన్పిస్తుందీ ఆధునిక దళిత కథల్లో. ఇదే విధంగా అట్టడుగు బడుగు బలహీన వర్గాలు ఎప్పటికీ ఏకతాటిపైకి రాకుండా నిచ్చెనమెట్ల కుల వ్యవస్థను సృష్టించిన మనువాదులు నేటికీ సఫలీకృతులుగానే ఉన్నారంటే కారణాలు దళిత అనైక్యత కూడ కారణమే. దీనికి ఆధిపత్య వర్గాల కుట్రలే ఆధారమని ఋజువు చేస్తూ "ధమ్కీ" కథ. ఇందులో మాల మాదిగల ఐక్యతను దెబ్బ తీయాలని శతవిధాల ప్రయత్నించిన పెత్తందారులు మనకు కన్పిస్తారు.

ఫైవ్‌జీ టెక్నాలజీ కాలం నడుస్తున్నా సరే, కులం దీనికి పదుల రెట్ల వేగంతో తన రూపాన్ని మార్చుకుని మన చుట్టూరా వైఫై లాగే అంటిపెట్టుకుని ఉంటుందని "వాట్సప్ స్టేటస్" కథ ద్వారా బోధపడ్తుంది.

కులం వేసే ప్రతీ అడుగును నిత్యం గమనిస్తూ కులపీడన విధానాన్ని దాని స్వభావాన్ని తన కలంతో చిత్రీకరిస్తూ కథల రూపంలో మనముందు ఉంచాడు. స్వేచ్ఛ-సమానత్వం-సౌభ్రాతృత్వ సాధించడమే ఇతని రచనల ప్రధాన ఎజెండాగా, "బ్రాహ్మణ భావజాలానికే తప్పా, బ్రాహ్మణులకు వ్యతిరేకిని కాదనీ" ప్రకటించిన అంబేద్కర్ వారసుడిగా తన రచనలతో దేశ నలుమూలలకు (పలు భాషల్లోకి తన కథలు అనువదించబడడం ద్వారా) విస్తరిస్తున్నాడు కథకుడు డా. పసునూరి రవీందర్.

పట్టణాల్లో ఎత్తైన కట్టడాలలో ఉన్నతమైన జీవితాన్ని అనుభవిస్తున్న ఆధిపత్యకులాలు తమతో నివసించే శూద్ర, అతి శూద్రకులాలను తెల్సుకొనుటకు ఆరాటపడే విధానాన్ని అతిస్పష్టంగా తెలియజేయటంలో రచయిత కులపీడినానికి గురైన జీవితం అనుభవం కన్పిస్తుందీ ఆధునిక దళిత కథల్లో. ఇదే విధంగా అట్టడుగు బడుగు బలహీన వర్గాలు ఎప్పటికీ ఏకతాటిపైకి రాకుండా నిచ్చెనమెట్ల కులవ్యవస్థను సృష్టించిన మనువాదులు నేటికీ సఫలీకృతులు గానే ఉన్నారంటే కారణాలు దళిత అనైక్యత కూడ కారణమే.

- వరకుమార్ గుండెపంగు, 99485 41711

ఆమె..నేను..రాత్రి...

ఒకానొక కన్నీటి వర్షపు రాత్రి..
పూడుకు పోయిన గొంతుతో ఆమె అన్నది

గుండె తడి ఇంకింది కదా..
పెదాలు పెలుసెక్కి నెర్రెలు తీశాయి కదా
పెనవేసుకోవడానికి...పెనగులాడుకోడానికి
చేతులు లేవలెత్తలేను గదా
ఇక.. ఈ స్వరపేటికను మూసి ఈ తిత్తిలోని గాలిని
బయటకు పారద్రోలనా...

ఇన్నాళ్ళూ నా అణువణువూ తాకి
ఆపాద మస్తకం అనుభవాల జరీ కుచ్చిళ్ళు తొడిగి
అక్షర అక్షరానికి నీ అద్వితీయ అంతరంగ
వీణా గానాన్ని సింగారించావు గదా..

పదాలకు పచ్చిక బైళ్ళ పావడా చుట్టి
నీ కలల సుతిమెత్తని ఉలితో శిల్పాన్ని పట్టి
శిలల కాఠిన్యపు ఒంటికి సైతం
అనుభూతుల అత్తరులను అద్దావు కదా..

అనువును అనంతం చేసి
అనంతాన్ని అనువులోకి దిగేసి
పత్రికల ఒంటికి అనుభూతుల్ని నేర్పి
ఉద్యమాల ఉద్యాన వనాల్ని నా కంటి
పఠాలంపై ఆవిష్కరించి
ఖాళీ అయిన ప్రాణవాయువు
భాండాగారాలకెత్తావు కదా

నిద్ర పట్టని నీ రాత్రి కోసం
నేను నీ కన్నుల్లోకి ఒదిగి నీ గుండె
కవాటాలని
ముద్దు పెట్టుకున్నదీ నీ కోసమే
నీ కోసమే... అచ్చంగా నీ కోసమే
వెన్నెల మైదానాల అంచుల మీదుగా
ఇసుక తిన్నెలా పరుచుకొని మన
పాదాలను
కరుచుకునే మంచు పరదాల మీదుగా
మౌన బురుజుల మీదుగా..
కలల నిచ్చెనల మీదుగా
నీ కోసమే... నీ వేలు పట్టుకొని ...
ఊరు నిద్రపోతున్న వేళ
నువు మేలుకొని... నన్ను మేలుకొలిపి
మనిద్దరం కలిసి ఆ నిశబ్ద రాత్రిని గిల్లి
నిద్రపోనివ్వక

నువ్వూ ....
నేను...
రాత్రి....
బాధ పడి.. భయపడి.. ఒకరినొకరు పట్టుకొని
వాగ్దానాలేవి లేని
నమ్మకాల నావ మీద కాసింత నవ్వుకుని ...
కాసింత ఏడ్చుకుని ఒకరినొకరు విలీనం చేసుకొని
ఓ శీర్షికను తగిలించుకొని ఒడ్డున పడే వాళ్ళం

ఎందరని! ఎందరు మనల్ని ఆప్యాయంగా
ఆలింగనం చేసుకునే వాళ్ళు
కొందరైతే వాళ్ళ హృదయాల్లోకి
లాక్కొని బంధించుకునే వాళ్ళు
మరి కొందరు మస్తిష్కాలపై మనల్ని
శిలా ఫలకాల్లా తగిలించుకొనే వాళ్ళు
ఎన్నాళ్ళయిందని నువు నన్ను తాకక
ఎన్నాళ్ళయిందని
నువు నా కురులనూ కుచ్చిళ్ళను సరిచేయక

ఏవి ఆ రాత్రులు?
కలల కోలాహలంతో మనం
ఊరేగింపైన కాలి జాడలెక్కడ?
శీతల రాత్రుళ్ళో ఒంటరి నక్షత్రాన్ని వెంటేసుకుని
వేకువ వరకూ పెనవేసుకున్న నమ్మకాలెక్కడ?
నీ కోసం ఏడ్చి...
నీ కోసం చేయి చాపి...
నిన్ను విడువలేక... వీడలేక
వదిలెయ్యనా ... ఈ కాస్త ఊపిరిని
చెప్పు ఒదిలెయ్యనా...
ఆర్తిగా దీనంగా అడుగుతుందామె

ఒక నిశ్శబ్ద దీర్ఘ శ్వాస తర్వాత నేనన్నాను

వద్దు ఇక్కడే ఉండిపో..
ఈ క్షణమే నేను ఓ ఊటల చెలిమెను తోడుతాను
తోడుగా నువ్వుంటావు

ఆమె నన్ను పెనవేసుకొని
నా ఊపిరి ఆమె లోకి ప్రవహిస్తుండగా..మళ్ళీ
ఆమె...
నేను...
రాత్రి ....

- చెమన్, 9440385563







మేడే స్ఫూర్తితో ఉద్యమిద్దాం

మేడే అంతర్జాతీయ కార్మిక వర్గ ఐక్యతకు సంకేతం. కార్మికవర్గ చైతన్యానికి ప్రతీక. శ్రమదోపిడికి వ్యతిరేకంగా వేలాది గొంతుకలు ఒక్కటైన చరిత్రకు సాక్ష్యం. ఎనిమిది గంటల పనిదినం, కార్మిక హక్కుల కోసం నినదించిన మహోజ్వల ఘట్టం. 137 ఏండ్ల కిందట కార్మికులు సాగించిన వీరోచిత పోరాటాలు ఫలితంగానే ప్రపంచ కార్మిక వర్గానికి కొన్ని హక్కులు దక్కాయి. అందులో మహిళల పాత్ర కూడా ఎంతో గొప్పది. ఆ స్ఫూర్తితో ప్రపంచ దేశాలతో కార్మికవర్గం సంఘటితమైతే తమ హక్కులు సాధించుకోవచ్చనే నమ్మకంతో ముందుకు కదిలారు. అనేక చట్టాలు రూపొందించు కోగలిగారు. ఆ వివరాలు నేడు మేడే సందర్భంగా మానవిలో...

భారతదేశంలో 1923లో ఆనాటి మద్రాసు నగరంలోని మెరినా బీచ్‌లో కా॥ సింగావేలు జెండాను ఎగురవేసి మేడేకు నాంది పలికారు. ఈ సుదీర్ఘ కాలంలో కార్మికవర్గంలో భాగంగా మహిళలకు కూడా అనేక చట్టాలు చేయబడ్డాయి. 8 గంటల పని, సమాన వేతన చట్టం, ప్రసూతి సెలవుల చట్టం, పసిపిల్లల తల్లులకు క్రెచ్ సౌకర్యం మొదలైన చట్టబద్ధ హక్కులు కల్పించబడ్డాయి. వీటి అమలు నామమాత్రంగా ఉన్నప్పటికీ మహిళా కార్మికులకు కొంత స్థైర్యాన్ని ఇచ్చింది.

కార్మికులుగా గుర్తించడం లేదు

గతంలో మహిళలు టీచర్లు, నర్సులు, డాక్టర్లు, ఇంటిపని వారు, భవన నిర్మాణ కార్మికులు లేదా ఇన్సూరెన్స్, బ్యాంక్స్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగాలలో మాత్రమే ఉండేవారు. అయితే వీరిలో కూడా చట్టబద్ధమైన హక్కులు, సౌకర్యాలు అమలయ్యే సంఘటిత రంగంలో కేవలం 6శాతం మాత్రమే ఉన్నారు. మిగిలిన 95శాతం మందికి ఎటువంటి చట్టాలు వర్తించడం లేదు. నూతన ఆర్థిక విధానాలు అమలు జోరందుకున్న నేపథ్యం లో మన దేశానికి ఉత్పత్తి రంగం ప్రాముఖ్యత తగ్గి సేవారంగం విస్తరించింది. దాని వల్ల అనేక కొత్త రంగాలు, కొత్త తరహా కార్మికులు పుట్టుకొచ్చారు. మరీ విచారకరమైన, విచిత్రమైన పరిస్థితి ఏంటంటే గతంలో భవన నిర్మాణ, మున్సిపల్ వంటి అసంఘటిత రంగాలలో పని చేసే వారు కూడా కార్మికులుగా గుర్తింపబడ్డారు. వారికంటూ కొన్ని ప్రత్యేక విధానాలు చేయబడ్డాయి. కానీ నేడు స్కీం వర్కర్లు, జొమాటో, స్విగ్గీ, అర్బన్ క్లాస్ వంటి ఆన్‌లైన్ బేస్డ్ సర్వీసుల్లో పని చేసే కార్మికుల (గిగ్ వర్కర్లు)ను ప్రభుత్వం కనీసం కార్మికులుగా గుర్తించడానికి కూడా సుముఖంగా లేదు.

పెనం మీద నుండి పొయ్యిలోకి

కరోనా అనంతరం ప్రపంచ వ్యాప్తంగా కార్మికవర్గ పరిస్థితి మారిపోయింది. దీనికి ప్రత్యక్ష ఉదాహరణ 'వర్క్ ఫ్రం హెూమ్'. దీన్ని ప్రవేశ పెట్టిన తర్వాత అనేక రంగాలలో 8 గంటల పని విధానం అటకెక్కింది. ముఖ్యంగా అమెజాన్, డెలాయిట్, గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి చిన్నా, పెద్దా సాఫ్ట్‌వేర్ కంపెనీలలో పనిచేసేవారిలో మహిళలు గణనీయంగా ఉన్నారు. వర్క్ ఫ్రం హెూం మొదట్లో కొంత వెసులుబాటుగా అనిపించినప్పటికీ క్రమంగా పనిభారం పెరగటాన్ని ప్రత్యక్షంగా చూశాం. అనేక సర్వేలు కూడా వెల్లడించాయి. దీని వల్ల తీవ్ర శారీరక, మానసిక అనారోగ్యాలకు కూడా గుర య్యారు. పెనం మీద నుండి పొయ్యి మీద పడ్డ చందంగా గత ఏడాది సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగుల తొలగింపు ఊపందు కుంది. దీనిలో కూడా మహిళలు టార్గెట్ చేయబడ్డారు. అలాగే కరోనా కాలంలో వలస కార్మికులు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. అందులో కూడా మహిళల శాతం గణనీయంగా వుంది. అన్ని రంగాలలో ఉద్యోగాలు కోల్పోయిన వారి సంఖ్య చూస్తే ఇందులో కూడా మహిళలే ఎక్కువగా ఉన్నారు.

కట్టు బానిసత్వం...

ఏ 8 గంటల పని కోసం జరిగిన పోరాటాల ఫలితంగా 'మేడే' ఆవిర్భవించిందో ఆ మౌలిక హక్కు నేడు కాలరాయ బడుతుంది. ఆర్టీసీ, బ్యాంకులు వంటి ప్రభుత్వ రంగ సంస్థలతో పని చేసే మహిళలతో పాటు వైద్య, ఆరోగ్య రంగాల్లో పని చేస్తున్న నర్సులు, పారామెడికల్ సిబ్బంది, హౌస్‌కీపింగ్ కార్మికులు, విద్యా రంగంలో పని చేస్తున్న టీచర్లు, లెక్చరర్లు, నాన్ టీచింగ్ స్టాఫ్ వీరందరూ ఈ సమస్యలను ఎదుర్కొంటు న్నారు. మన రాష్ట్రంలో విద్యాశాఖ పరిధిలోని కస్తూర్బా, గిరిజన, మోడల్ సంక్షేమ స్కూళ్ళు, హాస్టళ్ళలో లక్షలాది మంది మహిళలు పని చేస్తున్నారు. వారు 24 గంటలు విధులు నిర్వర్తించాలి. కనీస వేతనం లేదు. ఉద్యోగ భద్రత, సెలవులు ఏమీ లేవు. కట్టు బానిస బతుకులకు గురవుతున్నారు. వీరి పని పరిస్థితుల వల్ల లైంగిక వేధింపులతో పాటు కుటుంబం నుండి కూడా సమస్యలు ఎదుర్కోవలసి వస్తోంది. వీరికి కనీసం ప్రసూతి సెలవులు కూడా వర్తించవు.

> **మహిళా కార్మికులపై ప్రభావం**
>
> దేశం నూరు వసంతాల మేడే జరుపుకుంటున్న వేళ కార్మిక వర్గంపై కార్పొరేట్లు, మతోన్మాదులు ప్రభుత్వ అండదండలతో దాడులు జరుపుతున్నారు. పోరాటాల ఫలితంగా సాధించుకున్న హక్కులను కాలరాసి, కార్మికవర్గాన్ని తిరిగి బానిసలుగా చేసేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ హక్కులతో పాటు చారిత్రాత్మకమైన 8 గంటల పని విధానాన్ని కూడా తుంగలో తొక్కుతున్నారు. ఈ దాడుల ఫలితం మొత్తం కార్మికవర్గంపై ప్రభావం చూపుతున్నప్పటికీ, మహిళా కార్మికులపై మరింత ఎక్కువగా ఉంటుంది.

రియల్ ఎస్టేట్ రంగంలో మహిళలు

నిర్మాణ, రియల్ ఎస్టేట్ రంగంలో మహిళలపై వివక్ష తీవ్రస్థాయిలో ఉంది. ఈ రంగంకి పురుషుల కన్నా మహిళలకు సుమారు 30 నుండి 40 శాతం తక్కువగా వేతనాలు ఇస్తున్నారు. పరిశ్రమల్లో పని చేస్తున్న మొత్తం ఉద్యోగుల్లో మహిళల సంఖ్య కేవలం 12 శాతానికి పరిమితమైంది. నిర్మాణ, రియలెస్టేట్ రంగంలో దేశ వ్యాప్తంగా 5.7 కోట్ల మంది కార్మికులు పని చేస్తుండగా, ఇందులో పురుషులు 5 కోట్లకు పైగా ఉన్నారు. మహిళలు కేవలం 70 లక్షల మంది మాత్రమే. అత్యధిక మంది మహిళా కార్మికులు, ఉద్యోగులు ఎక్కువగా అసంఘటిత రంగంలో ఉన్నారు. వేతన వ్యత్యాసంతో పాటు లైంగిక అసమానతలు, వివక్ష పెద్ద ఎత్తున ఉన్నాయి. నిర్మాణ రంగంలో ఉపాధి పొందిన మహిళల్లో 84 శాతం మంది దినసరి కూలీలు.

సేల్స్ గర్ల్స్ సమస్యలు

దేశంలో కోట్లాది మంది మహిళలు సేల్స్ గర్ల్స్‌గా, షాప్ ఎంప్లాయిస్‌గా పని చేస్తున్నారు. మన రాష్ట్రంలో లక్షల సంఖ్యలో ఉంటారు. వీరి జీవితాలు, జీతాలు అత్యంత దుర్భరంగా ఉంటాయి. ఉదయం 8 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు 12 గంటల పని చేయాలి. దీనికి తోడు పని ప్రదేశానికి వచ్చేటపుడు, వెళ్ళేటపుడు, బస్సుల్లో, రైళ్ళలో నించుని గంటల కొద్దీ ప్రయాణం చెయ్యాలి. ఫలితంగా వారి ఆరోగ్యం బాగా దెబ్బతింటోంది. అరికాళ్ళు, మోకాళ్ళు, నడుం నొప్పి వంటి సమస్యలతో బాధపడుతున్నారు. రుతుస్రావ సమయంలో అయితే మరింత కష్టం. మధ్యాహ్నం భోజనం చేసే సమయంలో మాత్రమే కూర్చునే అవకాశం దొరుకుతుంది. మిగిలిన సమయమంతా నిల్చొనే ఉండాలి. అయితే ఈ పద్ధతికి కేరళ, తమిళనాడు రాష్ట్రాలు స్వస్తి పలికాయి. కేరళలో 2018లో రైట్ టు సిట్ అనే నినాదంతో కూర్చొనే హక్కు కోసం కొంత మంది సేల్స్ గర్ల్స్ నిరసన వ్యక్తం చేశారు. వీరి న్యాయమైన డిమాండును అర్థం చేసుకున్న కేరళ ప్రభుత్వం 2019 జనవరిలో కమర్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్‌లోని ఉద్యోగులందరూ కూర్చునే ఏర్పాటు తప్పనిసరి చేస్తూ 'కమర్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్'ను సవరించింది. 2022 సెప్టెంబర్ 13న తమిళనాడు కూడా ఇదే నిర్ణయం చేసింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆ దిశగా చర్యలు తీసుకోవాలి.

స్కీం వర్కర్లు...

అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, ఎన్‌హెచ్‌ఎం, గ్రామీణ ఉపాధి హామీ, ఐకేపీ, వీఓఏలు, సర్వశిక్షా అభియాన్ తదితర 72 స్కీంలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. ఇందులో దేశంలో కోటి మంది, మన రాష్ట్రంలో మూడున్నర లక్షల మంది స్కీం వర్కర్లు గత 40 ఏండ్లకు పైగా పని చేస్తున్నారు. వీరికి 90శాతం మంది మహిళలు, బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు ప్రజలకి చేరవేయటానికి స్కీం వర్కర్లు కీలకపాత్ర పోషిస్తున్నారు. కరోనా సమయానికి ప్రజలకు సేవలందించి, కరోనాను కట్టడి చేయటంలో స్కీం వర్కర్లు ముఖ్య పాత్ర పోషించారు. అయినా వీరికి ఎలాంటి చట్టబద్ధ సౌకర్యాలు కల్పించకుండా ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయి. పని భారం, చాలీచాలని వేతనాలతో అవస్థలు పడుతున్నారు. ఆశా, మధ్యాహ్నభోజనం తదితర స్కీం వర్కర్లకు నేటికీ ప్రసూతి సెలవులు కూడా లేవంటే వీరి పట్ల ప్రభుత్వం ఎంత నిర్లక్ష్య వైఖరితో ఉందో అర్థం చేసుకోవచ్చు. దేశవ్యాప్తంగా స్కీం వర్కర్లు తమ సమస్యలు పరిష్కారం కోసం చేసిన అనేక పోరాటాల ఫలితంగా 2013 మేనెలకి 45 ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని, కనీస వేతనాం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని తీర్మానించింది. ఈ నిర్ణయం జరిగి ఎనిమిదేండ్లు దాటినా కేంద్ర ప్రభుత్వం వీటిని అమలు చేయడం లేదు.

> **కనీస వేతనం అమలు చేయాలి**
>
> మేడే ఎన్నో ఏండ్ల నుండి జరుపుకుంటున్నాం. కానీ ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. 2018 అక్టోబర్‌లో మా జీతం 1500 పెంచుతున్నట్టు కేంద్రం ప్రకటించింది. కానీ ఇప్పటి వరకు అది అమలు కాలేదు. కనీస వేతనం 18 నుండి 26 వేలన్నా ఉండాలని మా డిమాండ్. ప్రస్తుతం మాకు 13650, హెల్పర్‌కి 7800 రూపాయలు వస్తున్నాయి. ఇంత తక్కువ వేతనంతో ఎలా బతకాలి? టీఏ, డీఏలు లేవు. వచ్చిన జీతంలో సంగం వాటికే సరిపోతాయి. కార్మికులుగా మాకు గుర్తింపే లేదు. అద్దెలు రాక మూడు నెలలు అవుతుంది. అవి కట్టడానికి అప్పులు చేయాల్సి వస్తుంది. కనీస వేతనం అమలు చేసే వరకు పోరాడతాం.
>
> **- అంగన్‌వాడీ టీచర్**
> చాంద్రాయణగుట్ట



హక్కుల పరిరక్షణకు కదలాలి

ప్రసూతి సెలవు చట్టం ఉన్నప్పటికీ 10శాతం మందికి కూడా అమలు కావడం లేదు. కార్మిక సంఘాలు, మహిళా సంఘాలు కలిసి అనేక ఏండ్లు ఉద్యమాలు నిర్వహించిన ఫలితంగా పని ప్రదేశంలో లైంగిక వేధింపుల నిరోధక చట్టం చేయబడింది. కానీ దాని అమలు కూడా నామ మాత్రమే. గత కొద్ది రోజులుగా ఢిల్లీ నగర వీధుల్లో మహిళా రెజ్లర్లు చేస్తున్న పోరాటం దీనికి ప్రత్యక్ష ఉదా హరణ. అందుకే నేడు జరుగుతున్న మేడేకి మన దేశం లో అత్యంత ప్రాధాన్యం వుంది. రాష్ట్ర వ్యాప్తంగా మేడే ఉత్సవాల్లో మహిళా కార్మికులు అత్యధిక సంఖ్యలో పాల్గొని తమ హక్కుల పరిరక్షణకు కదలాలి. రాజ్యాంగం కల్పించిన గౌరవ ప్రదమైన పని పరిస్థితులు సాధించుకునే దిశగా ఉద్యమించాలి.

- పద్మశ్రీ

పని గంటల చక్రబంధంలో కార్మికులు

- కంపెనీల ప్రయోజనాల కోసం రాష్ట్రాల వెంపర్లాట
- రోజుకు 8 పని గంటల కోసం పెరుగుతున్న డిమాండ్

రోజుకు 12 పని గంటలను అనుమతిస్తూ దక్షిణాది రాష్ట్రాలైన కర్నాటక, తమిళనాడు చట్టసభలు ఫ్యాక్టరీల చట్టానికి సవరణలు ఆమోదించాయి.ఆ తర్వాత తమిళనాడు వెనక్కి తగ్గినా..అంతర్జాతీయ ఐఫోన్ సంస్థ ఫాక్స్‌కాన్ వంటి కంపెనీలకు ప్రయోజనం కలిగించేందుకు కర్నాటక ముందుకు వెళుతోంది. ఇబ్బడిముబ్బడిగా ఉత్పత్తిని పెంచుకునేందుకు వీలుగా బీజేపీ ప్రభుత్వం అడుగులు వేస్తుంది. కార్మిక చట్టాలలో ఈ మార్పుల పై కార్మిక సంఘాలు మండి పడుతున్నాయి.

న్యూఢిల్లీ : చైనాతో పోటీ పడి ఉత్పత్తి రంగంలో ప్రపంచంలోనే మేటిగా నిలవాలంటే పని గంటలు పెంచకతప్పదని చెబుతున్నాయి. అంతేకాదు...వారానికి 48 పని గంటల విధానంలో ఎలాంటి మార్పులు ఉండవని నమ్మబలుకుతున్నాయి. వారానికి నాలుగైదు రోజులు పని చేస్తే చాలునని కార్మికులు, ఉద్యోగులను మభ్యపెడుతున్నాయి.వాస్తవానికి ఈ నూతన చట్టాలు కార్మికులను చక్రబంధంలో ఇరికిస్తున్నాయి. తమిళనాడు ప్రభుత్వం విమర్శలకు తలొగ్గి చట్ట సవరణను వెనక్కి తీసుకుంది. కర్ణాటక మాత్రం తాను ఫాక్స్‌కాన్ సంస్థ ప్రయోజనాల కోసమే చట్ట సవరణ తెచ్చానని నిస్సిగ్గుగా చెబుతోంది. చైనా, వియత్నాం, తైవాన్‌తో పోటీ పడాలంటే ఈ మార్పులు తప్పవని అంటోంది. రోజుకు ఎనిమిది గంటల పని విధానాన్ని ఈ రెండు రాష్ట్రాల ప్రజా ప్రతినిధులు సరిగా అంచనా వేయడం లేదు. బ్రిటన్‌లో 18వ శతాబ్దపు పారిశ్రామిక విప్లవం నూతన పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థను సృష్టించింది. దీని ప్రకారం కార్మికులు కట్టుబానిసలుగా యంత్రాలపై రోజుకు 12 నుండి 16 గంటలు పని చేయాల్సి వచ్చేది. చిన్నారులు కూడా పనికి వెళ్లక తప్పని పరిస్థితి. ఈ ఆటవిక చట్టాన్ని నిరసిస్తూ సోషలిస్టు నాయకుడు రాబర్ట్ ఒవెన్ 1810లో తొలిసారిగా గళం విప్పారు. రోజుకు 10 పని గంటలు మాత్రమే ఉండాలని డిమాండ్ చేశారు. 'ఎనిమిది గంటల పని...ఎనిమిది గంటల వినోదం...ఎనిమిది గంటల విశ్రాంతి' అనే నినాదంతో కార్మిక సంఘాలు ముందుకు సాగాయి. 1869లో బ్రిటన్‌లో బెక్టన్ ఈస్ట్ లండన్ గ్యాస్ కంపెనీ కార్మికులు సుదీర్ఘ కాలం సమ్మె చేసి 18 పని గంటలకు బదులుగా షిఫ్టుకు 8 పని గంటలు మాత్రమే ఉండేలా యాజమాన్యాన్ని ఒప్పించడంలో విజయం సాధించారు. 1917 అక్టోబర్ విప్లవం తర్వాత సోవియట్ యూనియన్ మొదటిసారిగా 8 పని గంటల విధానాన్ని అమలు చేసింది. భారత్‌లో బ్రిటన్ పాలకులు కూడా ఇదే డిమాండ్‌ను ఎదుర్కోవాల్సి వచ్చింది. 1942లో వైస్రాయ్ కౌన్సిల్‌లో సామాజిక సంస్కరణవాది బీఆర్ అంబేద్కర్ 8 పని గంటల డిమాండ్‌ను ముందుకు తెచ్చారు. చివరికి అది చట్టరూపం దాల్చింది. 1948వ సంవత్సరపు పరిశ్రమల చట్టంలోని సెక్షన్ 54 తొమ్మిది పని గంటలను చట్టబద్ధం చేసింది. మధ్యలో కార్మికుల విశ్రాంతి కోసం అరగంట సమయం కేటాయించారు. చట్టంలోని సెక్షన్ 51 వారానికి 48 పని గంటలను నిర్దేశించింది. అయితే ఈ చట్టం పలు సందర్భాలలో ఉల్లంఘనలకు దారితీస్తోంది. నిర్దేశిత సమయం కంటే పని గంటలు ఎక్కువగానే ఉంటున్నాయి. దశాబ్దాల తరబడి పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులు నీరుకారిపోతున్నాయి. కార్మిక చట్టాలకు రక్షణ లేకుండా పోతోంది. ఫాక్స్‌కాన్ వంటి సంస్థలు అధిక ఉత్పత్తి, సుదీర్ఘ పనిగంటలు, తప్పనిసరి ఓవర్‌టైమ్ వంటి డిమాండ్లను ముందుకు తెస్తున్నాయి. మన దేశంలో కార్మికులు గౌరవప్రదమైన జీవనం సాగించాలంటే వారికి రోజుకు 8 పని గంటలు మాత్రమే కల్పించాల్సిన అవసరం ఉంది. విశ్రాంతి, వినోదం కూడా అందించాలి. ప్రభుత్వాలు ఆ దిశగా చట్టాలు రూపొందించాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఫాక్స్‌కాన్ కథ ఇది...

చైనాకు చెందిన ఫాక్స్‌కాన్ సంస్థ చరిత్ర ఘనమైనదేమీ కాదు. 2010లో షెంఝెన్ నగరంలోని ఫాక్స్‌కాన్ సిటీ పారిశ్రామిక పార్కులో ఆటవికమైన పని పరిస్థితులు, అరకొర వేతనాల కారణంగా కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. మరికొందరు మానసిక అనారోగ్యానికి గురయ్యారు. కిక్కిరిసిన డార్మిటరీలలో ఉండే కార్మికులు ఊపిరాడక స్పృహ కోల్పోయిన సందర్భాలూ ఉన్నాయి. చివరికి ప్రజాగ్రహంతో కంపెనీ దిగివచ్చింది. వేతనాలను కొంతమేర పెంచింది. అయితే కోవిడ్ మహమ్మారి సమయంలో ఐఫోన్ 14 ప్రో ఉత్పత్తిని పెంచే పేరుతో కంపెనీ మరోసారి అరాచక పరిస్థితులను ముందుకు తెచ్చింది. కార్మికులకు వేధింపులు పెరిగాయి. హెనన్, హుబై, సిచువన్ రాష్ట్రాలలో ఏర్పాటు చేసిన కంపెనీ యూనిట్లలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. కార్మికులకు ఎలాంటి విశ్రాంతి, విరామం ఇవ్వకుండా లక్ష్యాలు నిర్దేశించారు. కనీసం మరుగుదొడ్డికి వెళ్లే అవకాశం కూడా ఇవ్వలేదు. ఉత్పత్తిని పెంచడమే ప్రధాన లక్ష్యంగా మారింది. కోవిడ్ సమయంలో కార్మికులు కంపెనీ క్యాంపస్‌లలోనే ఉండాల్సి వచ్చింది. పలువురు కార్మికులు వేధింపులు తాళలేక కాపలా వారి కన్నుగప్పి, ఫెన్సింగ్ దూకి పారిపోయారు. 'ఐఫోన్లు నరకంలో తయారయ్యాయి' అని ఓ కార్మికుడు చెప్పిన మాట అక్కడి దుర్భర పరిస్థితిని కళ్లకు కట్టింది.

కలిసికట్టుగా బీజేపీని ఓడిద్దాం

న్యూఢిల్లీ : బీజేపీని ఒంటరి చేసి, ఓడించడమే దేశం ముందు, ప్రజల ముందు ఉన్న ప్రధాన కర్తవ్యమని, ఈ లక్ష్యాన్ని సాధించేందుకు లౌకిక , ప్రతిపక్ష పార్టీలతో సీపీఐ(ఎం) కలసి పనిచేస్తుందని, సహకరిస్తుందని పార్టీ కేంద్రకమిటీ పునరుద్ఘాటించింది. అలాగే జమ్మూ కాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు వెంటనే నిర్వహించాలని డిమాండ్ చేసింది. అదానీ అవినీతి బాగోతంపై జేపీసీని వెంటనే ఏర్పాటు చేయాలని కోరింది. ఈ నెల 27-29 తేదీల్లో ఇక్కడ జరిగిన సీపీఐ(ఎ కేంద్ర కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆదివారం నాడు ఒక ప్రకటన రూపంలో పార్టీ విడుదలజేసింది. ఆ ప్రకటన ఇలా పేర్కొంది.

ఆర్థిక పరిస్థితి గడ్డుగానే ఉంది

ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలతో పోలిస్తే భారతదేశ జీడిపి వృద్ధి అత్యంత వేగంగా జరుగుతోందని అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) పేర్కొంది. మోడీ ప్రభుత్వం దీనినే మరింత అతిశయంగా ప్రచారం చేస్తూ ఆర్థిక వ్యవస్థ వాస్తవ పరిస్థితిని కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తోంది. 2021 ఆర్థిక సంవత్సరంలో వృద్ధిరేటు 9.1శాతం వుండగా, 2020లో అది -5.8గా వుందన్న వాస్తవాన్ని ప్రభుత్వం కావాలనే విస్మరిస్తోంది. సాధారణ, కోవిడ్ ముందు సంవత్సరమైన 2019లో సమ్మిళిత వార్షిక వృద్ధిరేటును పరిగణనలోకి తీసుకుంటే, భారతదేశ వార్షిక వృద్ధి రేటు 3.8శాతం మాత్రమే. 2022, 2023 ఆర్థిక సంవత్సరాల్లో భారత్ 350బిలియన్ల డాలర్లను తన ఆర్థిక వ్యవస్థకు జోడించింది. అదే సమయంలో అమెరికా 1390 డాలర్లను, చైనా 1274 డాలర్లను వాటి ఆర్థిక వ్యవస్థకు జోడించాయి. పెద్ద ఆర్థిక వ్యవస్థలు కలిగిన దేశాలతో పోలిస్తే భారత్ తలసరి ఆదాయం చాలా తక్కువ. తలసరి ఆదాయం దృష్ట్యా చూసినట్లైతే, అమెరికా మన కన్నా 31రెట్లు , చైనా ఐదు రెట్లు, బ్రెజిల్ 4 రెట్లు, బ్రిటన్ 18రెట్లు, జర్మనీ 20రెట్లు అధికంగా కలిగి వున్నాయి. ఆ రకంగా చూసినట్లైతే, ప్రపంచంలోని ఐదవ అతిపెద్ద జీడిపితో వున్నప్పటికీ మన తలసరి ఆదాయం అంగోలా, ఐవరీ కోస్టుల కన్నా తక్కువగా వుంది.తయారీ రంగం, పారిశ్రామిక రంగాలు క్షీణించకపోయినా, స్తంభించిపోయాయి. 8 కోట్ల మౌలిక సదుపాయాల రంగాల వృద్ధి ఫిబ్రవరిలో 7.2శాతం వుండగా, మార్చిలో సగానికి సగం అంటే 3.6శాతానికి పడిపోయింది. దీని పర్యవసానంగా నిరుద్యోగిత రేటు రికార్డు స్థాయిలో పెరిగి 8శాతం వద్ద కొనసాగుతోంది. ఉద్యోగుల సంఖ్య దాదాపు స్తంభించిపోయింది. కరోనా మహమ్మారి తలెత్తడానికి ముందు 2020 జనవరిలో ఉద్యోగుల సంఖ్య 41.1కోట్లుగా వుండగా, 2023 జనవరిలో 40.9కోట్లుగా వుంది. గత ఎనిమిదేళ్ళుగా గ్రామీణ వేతనాలు పూర్తిగా స్తంభించిపోయాయి. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్‌ఆర్‌ఇజిఎస్) అత్యంత అవసరంగా వున్న సమయంలో, బడ్జెట్ కేటాయింపుల్లో మూడో వంతు కోత విధించారు. చెల్లించాల్సిన వేతనాలు దీర్ఘకాలంగా పెండింగ్‌లో వున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో, కేంద్ర ప్రభుత్వం ఉపాధి కల్పన పథకాలపై మరింతగా ఖర్చు పెట్టాలని కేంద్ర కమిటీ డిమాండ్ చేస్తోంది. దీనివల్ల ఉపాధి అవకాశాలు పెరుగుతాయి, ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుంది, ఆర్థిక వ్యవస్థలో డిమాండ్ కూడా పెరుగుతుంది.

అదానీ అవినీతిపై జేపీసీని వెంటనే వేయాలి

అదానీ గ్రూపుపై వచ్చిన అవినీతి ఆరోపణలపై దర్యాప్తు చేపట్టడానికి ప్రభుత్వం మొండిగా తిరస్కరించడం, దర్యాప్తుపై స్టేటస్ రిపోర్టు ఇవ్వడానికి మే 2తో పూర్తవుతున్న గడువును, మరో ఆరు మాసాల పాటు పొడిగించాలని కోరుతూ సెబి పిటిషన్ వేసింది. ఈ అవినీతి ఆరోపణలపై నిజాలు నిగ్గు తేలాలంటే సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)ని వెంటనే ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

రెజ్లర్ల నిరసన

లైంగిక వేధింపుల ఆరోపణలకు వ్యతిరేకంగా న్యాయం చేయాలని కోరుతూ పతక విజేతలైన రెజ్లర్లు చేస్తున్న ఆందోళనకు కేంద్ర కమిటీ పూర్తి మద్దతు ఇస్తున్నది. తొలుత విముఖత చూపినప్పటికీ భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యుఎఫ్ఐ) అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సి వచ్చింది. డబ్ల్యుఎఫ్ఐ అధ్యక్షుడిని ఆ పదవి నుండి తొలగించాల్సిందేనని కేంద్ర కమిటీ డిమాండ్ చేసింది. ఆ ఎఫ్ఐఆర్‌పై పోలీసులు తదుపరి చర్యలు చేపట్టి, కఠినంగా శిక్షించాలని కోరింది.

జమ్మూ కాశ్మీర్

2018 నుండి జమ్మూ కాశ్మీర్‌కు ఎన్నికైన అసెంబ్లీ లేదు. ఎన్నికలు నిర్వహించడానికి కేంద్ర ప్రభుత్వం మూడు షరతులను విధించింది. పునర్విభజనా క్రమాన్ని పూర్తి చేయడం, ఓటర్ల జాబితాను ఆధునీకరించడం, ఎన్నికల నిర్వహణకు శాంతియుత వాతావరణాన్ని ఏర్పాటు చేయడం - ఈ మూడు షరతులు నెరవేరాలని పేర్కొంది. ఆ మూడు నెరవేరాయని ప్రభుత్వమే అంగీకరించింది. అయినప్పటికీ ఎన్నికల నిర్వహణకు తిరస్కరించడం చూస్తుంటే, అక్కడ తనకు నచ్చిన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలననే నమ్మకం పాలక పక్షానికి లేదని ఇది స్పష్టంగా రుజువుచేస్తోంది. ప్రజల మౌలిక రాజ్యాంగబద్ధమైన, ప్రజాస్వామ్య హక్కులను ఇది దారుణంగా ఉల్లంఘించడమే. జమ్మూ కాశ్మీర్‌లో వెంటనే ఎన్నికలను నిర్వహించాలని కేంద్ర కమిటీ డిమాండ్ చేస్తోంది.

అటవీ సంరక్షణ చట్ట సవరణ

వృధా అయిన పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో గందరగోళ పరిస్థితుల మధ్య ప్రవేశపెట్టిన అటవీ సంరక్షణ చట్టం సవరణ ఓ వినాశకరమైన చర్య. వాతావరణ మార్పుల సవాళ్ళను మరింత అధ్వానంగా మార్చే చర్య. ఇప్పటికే వాతావరణ మార్పుల ప్రభావం దేశంలో వివిధ ప్రాంతాలపై చూపుతోంది. తమ ప్రాంతాల్లో ఏ ప్రాజెక్టు అయినా చేపట్టడానికి ముందు అనుమతినివ్వడానికి లేదా నిలుపుచేయడానికి గ్రామ సభలకు గల రాజ్యాంగబద్ధమైన, చట్టబద్ధమైన హక్కులను ఈ సవరణలు తొలగిస్తున్నాయి. అలాగే అటవీ భూముల మళ్లింపునకు సంబంధించిన నిబంధనల సరళీకరణ, అడవుల ప్రైవేటీకరణను ప్రోత్సహించడం, అటవీ పాలనపై రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను నీరుగార్చేందుకు కేంద్ర ప్రభుత్వానికి మరిన్ని అధికారాలను ఇవ్వడం వంటి చర్యలు ఆదివాసీల, సాంప్రదాయ అటవీవాసుల హక్కులపై మరింతగా దాడిచేయడమే, ప్రస్తుతమున్న అటవీ హక్కుల చట్టాన్ని ప్రత్యక్షంగా ఉల్లంఘించడమే. ఈ సవరణను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేస్తున్నది.

త్రిపుర

త్రిపురలో అసెంబ్లీ ఎన్నికల అనంతరం పాలక బీజేపీ చేపట్టిన హింస కొనసాగడాన్ని కేంద్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. భౌతిక దాడులతో పాటూ పెద్ద ఎత్తున బలవంతపు వసూళ్ళకు పాల్పడడం కూడా జరుగుతోంది. డిమాండ్ చేసిన డబ్బు గనక చెల్లించకపోతే వారి ఆస్తులను, దుకాణాలను, ఆటో రిక్షాలు వంటి జీవనోపాధులను ధ్వంసం చేస్తామంటూ ప్రజలను బెదిరిస్తున్నారు. ఇది లక్షలాదిమంది ప్రజల జీవితాలను, వారి జీవనోపాధులను దెబ్బతీస్తోంది. తక్షణమే ఈ హింసను ఆపాలని కేంద్ర కమిటీ డిమాండ్ చేస్తోంది. రాజ్యాంగ నిబంధనలకు గట్టిగా కట్టుబడాలని కోరుతోంది. దోషులను గుర్తించి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతోంది.

ప్రతిపక్షాల ఎత్తుగడలు

బిజెపిని ఏకాకిని చేసి, ఓడించాలన్నదే దేశం ముందు, ప్రజల ముందున్న ప్రధాన కర్తవ్యమని కేంద్ర కమిటీ పునరుద్ఘాటించింది. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు, సీపీఐ(ఎం), ఇతర లౌకిక ప్రతిపక్ష పార్టీలకు సహకరిస్తూ, వాటితో కలిసి పనిచేస్తుంది. మత విభజన రాజకీయాలకు మరింత పదును పెట్టడం, ద్వేషం, హింస వంటి వాటితో కూడిన విషపూరిత ప్రచారం, ఆదానీ కుంభకోణం, కేంద్ర సంస్థల దుర్వినియోగం, కులాలవారీ జనగణనకు తిరస్కరించడం, సమాఖ్యవాదంపై దాడి వంటి జాతీయ ప్రాముఖ్యత కలిగిన అంశాలను ప్రముఖంగా ఎత్తిచూపడానికి లౌకిక ప్రతిపక్ష పార్టీల మధ్య గరిష్ట ఐక్యత వుండాలి. అలాగే ప్రజల జీవనోపాధులపై దాడులకు వ్యతిరేకంగా నిరసన చర్యలు చేపట్టేందుకు అన్ని లౌకిక ప్రతిపక్ష శక్తుల మధ్య ఐక్యత అవసరం, ప్రతి రాష్ట్రంలోనూ అక్కడ వున్న నిర్దిష్ట పరిస్థితుల ఆధారంగా ఎన్నికల్లో బిజెపి వ్యతిరేక ఓట్లను గరిష్టంగా సమీకరించేందుకు లౌకిక ప్రతిపక్షం ఎత్తుగడలను రూపొందించేందుకు కసరత్తు చేయాలి. రాష్ట్రం నుండి రాష్ట్రానికి పరిస్థితులు మారుతుండడంతో ఈ ఏర్పాట్లన్నీ కచ్చితంగా రాష్ట్ర అవసరాలు, పరిస్థితులకు తగ్గట్లుగా వుండాలి.

కేంద్ర కమిటీ పిలుపు

దేశం, ప్రజల జీవనోపాధులపై తక్షణం ప్రభావం చూపే అంశాలపై దేశవ్యాప్తంగా సమైక్య కార్యాచరణ చేపట్టేందుకు వామపక్షాలను సంప్రదించాలని కేంద్ర కమిటీ నిర్ణయించింది. ప్రజా కార్యాచరణ, వ్యక్తీకరణల ద్వారా జాతీయ ప్రాముఖ్యత కలిగిన అంశాలను లేవనెత్తడానికి ఇతర లౌకిక ప్రతిపక్ష పార్టీలతో సంప్రదింపులు జరపాలి.

నిర్మాణపరమైన అంశం

వ్యవసాయ కార్మికోద్యమ నేత విక్రమ సింగ్‌ను కేంద్ర కమిటీ సభ్యులుగా తీసుకోవడం ద్వారా కేంద్ర కమిటీలో ఖాళీని భర్తీ చేయాలని కేంద్ర కమిటీ నిర్ణయించింది.

ప్రజల సేవా నిరతి గొప్పది : మోడి

నవతెలంగాణ -న్యూఢిల్లీ బ్యూరో

దేశ ప్రజల సేవానిరతి గొప్పది అని ప్రధాని మోడీ అన్నారు. ఇతరుల్లో ఉన్న మంచి లక్షణాలను ఆరాధించడమే 'మన్ కీ బాత్' ఉద్దేశమని చెప్పారు. 2014 అక్టోబరు 3న ప్రారంభమైన నెలవారీ కార్యక్రమం ఈ ఆదివారంతో వందవ ఎపిసోడ్ పూర్తి చేసుకున్న సందర్భంగా తనకు ప్రజల నుంచి వేలాది ఉత్తరాలు, లక్షలాది సందేశాలు వచ్చాయన్నారు. సాధ్యమైనన్ని ఉత్తరాలను చదివి, సందేశాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించానని తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన ఈ ఉత్తరాలను చదివేటపుడు ఎంతో భావోద్వేగానికి గురయ్యానని అన్నారు. 'మన్ కీ బాత్' కోట్లాది భారతీయుల మనసులో మాట, వారి మనోభావాల వ్యక్తీకరణ అని అన్నారు. మునుపటి ఎపిసోడ్లలో తాను ప్రస్తావించిన అంశాలతో ప్రభావితమైన వ్యక్తులతో ఆయన నేరుగా సంభాషించారు. ఈ సందర్భంగా విశాఖపట్నానికి చెందిన వెంకటేశ్ ప్రసాద్‌ను ప్రధాని గుర్తు చేసుకున్నారు. ప్రసాద్ దేశీయ వస్తువులను మాత్రమే వినియోగించేలా చార్ట్‌ను రూపొందించి, స్వదేశీ వస్తువుల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. గత కాలపు స్మృతులకు, భావోద్వేగాలకు, సూక్తి ముక్తావళికి ఈ వందవ ఎపిసోడ్‌ను వేదికగా ఆయన మార్చారు. మనం అమృత కాలంలో ఉన్నామని, ఈ ఏడాది జీ-20 సదస్సుకు అధ్యక్షత వహిస్తున్నామని చెప్పారు. స్వదేశీ ఆట బొమ్మల పరిశ్రమల పునరుద్ధరణ వంటి ఉద్యమాలు వేగం పుంజుకోవడానికి ఈ కార్యక్రమం దోహదపడిందన్నారు. స్వదేశీ జాతి కుక్కల పట్ల చైతన్యానికి ఈ కార్యక్రమం నాంది పలికిందన్నారు. ఇంటింటా జాతీయ జెండా కార్యక్రమం ప్రారంభమైనపుడు కూడా మన్ కీ బాత్ గొప్ప పాత్ర పోషించిందని గుర్తు చేశారు.

నిరుద్యోగులకు కుచ్చుటోపీ

నవ తెలంగాణ - మహబూబ్ నగర్

రాష్ట్రంలో 125 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహంతో పాటు తెలంగాణ సచివాలయానికి ఆయన పేరు పెట్టి రాజ్యాంగం సాక్షిగా 30 లక్షల నిరుద్యోగులకి రాష్ట్ర ముఖ్యమంత్రి కే చంద్రశేఖర రావు కుచ్చుటోపి పెడుతున్నారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రేవంత్ రెడ్డి ఆరోపించారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని గడియారం చౌరస్తాలో ఆదివారం నిర్వహించిన నిరుద్యోగ నిరసన సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అంతకుముందు మెట్టుగడ్డ నుంచి గడియారం చౌరస్తా వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. కేసీఆర్ వలస వచ్చి పాలమూరు జిల్లాలో పార్లమెంట్ సభ్యుడయినా ఈ జిల్లాకు నీళ్ల ఇవ్వడంలో ఘోరంగా విఫలమయ్యారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఎత్తిపోతల పథకాలు తప్ప ఎనిమిదేండ్లలో టీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క ప్రాజెక్టు కూడా చేపట్టలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన పాలమూరు విశ్వవిద్యాలయంలో ఇప్పటికీ 80 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయంటే టీఆర్ఎస్ ప్రభుత్వానికి ఉద్యోగాల పట్ల ఎంత ఆసక్తి ఉందో తెలుస్తుందన్నారు. ఆనాటి నుంచి నేటి వరకు తెలంగాణ పోరాటాన్ని నడిపించింది ఒక్క కాంగ్రెస్ పార్టీ తప్ప కేసీఆర్ ఏనాడు కూడా తెలంగాణ కోసం పోరాటం చేయలేదన్నారు. మొట్టమొదటి సారిగా చిన్నారెడ్డి నాయకత్వంలో తెలంగాణ సభ వనపర్తి జిల్లాలో జరిగిన దృశ్యాన్ని చూసిన కేసీఆర్ 2001లో టీఆర్ఎస్ పార్టీ పెట్టి రాజకీయ దోపిడికి తెర లేపారని గుర్తు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు తర్వాత తిరిగి 80 ఏండ్లకు ఈ ప్రాంతవాసినయిన తనకు రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా అవకాశం లభించిందన్నారు. ఈ జిల్లాలో 14 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగిరితే మళ్లీ మనకు ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం వస్తుందని తెలిపారు. నిరుద్యోగులు ఎవరు ఆందోళన చెందొద్దని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత అందరికీ న్యాయం చేస్తామని తెలిపారు. సభలో మాజీ ఎమ్మెల్యేలు చిన్నారెడ్డి, నాగం జనార్దన్ రెడ్డి, సంపత్ కుమార్, మల్లురవి, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షులు జై మధుసూదన్ రెడ్డి, మాజీ రాష్ట్ర అధ్యక్షులు వి హనుమంతరావు, ప్రసంగించారు.

హనుమకొండ జిల్లాలో సామూహిక లైంగికదాడి

నవతెలంగాణ- హనుమకొండ

హనుమకొండ జిల్లాలో శనివారం అర్ధరాత్రి ఓ వివాహితను ఇద్దరు యువకులు ఆటోలో కిడ్నాప్ చేసి లైంగికదాడికి పాల్పడిన ఉదంతం ఆలస్యంగా వెలుగుచూసింది. హనుమకొండ పోలీసులు, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండలోని రాంనగర్‌కు చెందిన ఓ వివాహిత(40) కిషన్‌పురలోని ఓ కర్రీ పాయింట్‌లో కుకింగ్ మాస్టర్‌గా పనిచేస్తున్నది. భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా శుక్రవారం రాత్రి భర్తతో గొడవపడి రాత్రి సుమారు 12 గంటల సమయంలో తాను పనిచేస్తున్న కర్రీ పాయింట్ వద్దకు వచ్చి పడుకోవాలనుకుంది.

తాటి చెట్టు పై నుంచి పడి వ్యక్తికి తీవ్రగాయాలు



నవతెలంగాణ-తుర్కయాంజల్

తాటి చెట్టుపై నుండి పడి వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన తుర్కయాంజల్ మున్సిపాలిటీ ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి అందజా 8 గంటలకు చోటు చేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం తుర్కయాంజల్‌కు చెందిన దాసుగారి యాదగిరి (తండ్రి లక్ష్మయ్య) వృత్తి గీతకార్మికుడు. రోజులగానే శనివారం సాయంత్రం గీత వృత్తి పనిమీద తాటి చెట్టు ఎక్కాడు కొంచెం పైకి వెళ్ళగానే తాను వేసుకునే మోఖు జారీ కింద పడ్డాడు. తోటి కార్మికులు గమనించి దగ్గరలోని హాస్పిటల్‌కు తరలించారు.పరీక్షించిన డాక్టర్లు 24 గంటలు గడిస్తే కానీ చెప్పలేమని చెప్పారు. ప్రభుత్వం ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

కాలనీ నూతన కార్యవర్గ సభ్యులకు కార్పొరేటర్ శుభాకాంక్షలు



నవతెలంగాణ-హయత్ నగర్

హయత్‌నగర్ డివిజన్ లోని డిఫెన్స్ కాలనీ నూతన కార్యవర్గం ఎన్నికకాగా కాలనీ వాసులు కాలనీ దేవాలయ ప్రాంగణంలో ఆదివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నూతన కాలనీ కార్యవర్గ సభ్యులకు స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపి మిఠాయిలు తినిపించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ కాలనీ అభివృద్ధి పనులకు ఎల్లవేళలా సహాయ సహకారాలు ఉండాలని కార్పొరేటర్ ను కోరారు. డిఫెన్స్ కాలనీ నూతన అధ్యక్షులు వెంకట్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రవణ్ రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు శ్రీనివాస్ రావు, సాంబా శివ, సురేష్, కోటేశ్వర్ రావు, బీజేపీ డివిజన్ ప్రధాన కార్యదర్శి సంఘీ అశోక్, నాయకులు ఎర్రవెలి సత్యనారాయణ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ మెట్రో సౌకర్యాల సందర్శన

- హెచ్ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి బృందం..
- మెట్రో కార్యకలాపాలతో పాటు పలు అంశాలపై అధ్యయనం : హెచ్ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎయిర్ పోర్ట్ మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, ఆయన బృందం శనివారం ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ మెట్రో సౌకర్యాలు, కార్యకలాపాలను అధ్యయనం చేశారు. ఢిల్లీ విమానాశ్రయం మెట్రో 23కి.మీ లైన్(16కి.మీ భూగర్భ, 7కి.మీ ఎలివేటెడ్) ఢిల్లీ విమానాశ్రయాన్ని న్యూఢిల్లీ రైల్వే, మెట్రో స్టేషన్‌లతో కలుపుతూ ఎనిమిది స్టేషన్‌లు ఉన్నాయి. గరిష్టంగా 95 కెఎంపీహెచ్ వేగంతో సగటున 65 కెఎంపీహెచ్ వేగంతో ఈ దూరాన్ని ఎయిర్‌పోర్ట్ మెట్రో రైలు 19 నిమిషాల్లో ప్రయాణాన్ని పూర్తి చేస్తుంది. తొలుత ఎన్వీఎస్ రెడ్డి బృందాన్ని టీ-3 ఎయిర్‌పోర్ట్ టెర్మినల్‌లో సీనియర్ డీఎంఆర్‌సీ అధికారులు రిసీవ్ చేసుకుని ఎయిర్‌పోర్ట్ ప్రాంగణంలో ఉన్న భూగర్భ మెట్రో స్టేషన్‌కు తీసుకెళ్లారు. రెండు సిటీ మెట్రో స్టేషన్లలో చెక్-ఇన్ చేయబడి, విమానాశ్రయానికి బదిలీ చేయబడిన సామాను ఎయిర్‌పోర్టు వైపు బదిలీకి సంబంధించిన సౌకర్యాలను, ఇతర కార్యకలాపాలను ఎండీ తనిఖీ చేశారు.

ఆ తర్వాత ఎన్వీఎస్ రెడ్డి బృందం మెట్రో రైలులో న్యూఢిల్లీ స్టేషన్‌కు ప్రయాణించారు. న్యూఢిల్లీ స్టేషన్‌లో నగరం వైపు చెక్ ఇన్ సౌకర్యాన్ని పరిశీలించారు. ఎయిర్‌లైన్స్ కౌంటర్ల నుంచి విమాన ప్రయాణికుల చెక్-ఇన్ బ్యాగ్‌లు రోలర్‌లపై ఉన్న కంటైనర్‌లలోకి బదిలీ చేయబడతాయి. కంటైనర్లు సీలు చేయబడి, రోలర్లపై ఆటోమేటిక్‌గా మెట్రో కోచ్‌లోని లగేజ్ కంపార్ట్‌మెంట్‌లోకి తరలిస్తారు.

ప్రతీ కంటైనర్‌పై ప్రత్యేకమైన ఆర్ఎఫ్ఐడీ ట్యాగ్ అతికించబడుతుంది. దీని ద్వారా సిటీ మెట్రో స్టేషన్ నుంచి విమానాశ్రయానికి కంటైనర్‌ల కదలిక స్కాడా సిస్టమ్ ద్వారా ట్రాక్ చేయబడుతుంది. ప్రయాణీకుల బ్యాగ్‌లు సురక్షితంగా, సమయానికి మెట్రో స్టేషన్ నుంచి ఎయిర్‌పోర్టుకు బదిలీ చేయబడతాయి. అక్కడ వీటిని సంబంధిత విమానాలకు తరలిస్తారు.

ఈ సిటీ చెక్-ఇన్ సౌకర్యాలు ప్రస్తుతం శివాజీ పార్క్ స్టేషన్, న్యూఢిల్లీ మెట్రో స్టేషన్లలో ఉన్నాయి. విమాన ప్రయాణికులు తమ బ్యాగేజీని ఈ రెండు స్టేషన్లలో ఏదైనా ఒకదానిలో వారి విమానం బయలుదేరే సమయానికి కనీసం రెండు గంటల ముందు చెక్ ఇన్ చేయాలి. చెక్-ఇన్ చేసిన తర్వాత, ప్రయాణికులు మెట్రో రైలులో సౌకర్యవంతంగా విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడవారు తమ సంబంధిత విమానాల్లో ఎక్కడానికి తమను తాము భద్రతా తనిఖీని మాత్రమే చేయించుకోవాలి.

ఢిల్లీ చుట్టుపక్కల ఉన్న వివిధ పట్టణాలు, నగరాలకు హై స్పీడ్ రైలు కనెక్టివిటీని అభివృద్ధి చేస్తున్న రీజనల్ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ కొనసాగుతున్న పనులతో పాటు ఎయిర్‌పోర్ట్ మెట్రో నిర్వహణ డిపో, ఇతర సౌకర్యాలనూ ఈ బృందం సందర్శించింది. డిపోలు, స్టేషన్ల లేఅవుట్లు, మెట్రో కోచ్‌ల నిర్వహణ సౌకర్యాలు, డిపోలు, స్టేషన్లలో ప్రాపర్టీ డెవలప్‌మెంట్ తదితర అంశాలపై అధ్యయనం చేశారు. ఆ తర్వాత ఎన్వీఎస్ రెడ్డి, ఆయన బృందం డీఎంఆర్‌సీ ఎండీ వికాస్ కుమార్, నేషనల్ క్యాపిటల్ రీజియన్ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ ఎండీ వి.కె. సింగ్, వారి సీనియర్ ఇంజనీర్ల బృందాలతో పరస్పర అనుభవాలను పంచుకోవడానికి చర్చలు జరిపారు.

ప్రధాని.. ముందు ప్రజల కష్టాలు తెలుసుకో..

- ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



నవతెలంగాణ -ఎల్బీనగర్

ప్రధాని మోడీ తన మన్‌కీ బాత్ తెలియజేయడం కాదని, ప్రజల మనస్సులో ఏమి ఉందో వినాలని ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సూచించారు. ఆదివారం ఎల్బీనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని మోడీ మన్‌కి బాత్ పేరుతో బీజేపీ శ్రేణులు పెద్ద ఎత్తున ప్రచారం చేసుకుంటున్నాయని ఎమ్మెల్యే ఎద్దేవా చేశారు. అయితే ప్రధానమంత్రి మోడీ తన మన్ కి బాత్‌ను తెలియజేస్తూ ప్రజల మన్ కి బాత్ మర్చిపోతున్నాడని అన్నారు. ప్రధాని పీజీ డిగ్రీలపై ఉన్న సందేహాలను మన్ కి బాత్‌లో తెలియజేయాలని ఎమ్మెల్యే సుదీర్‌రెడ్డి డిమాండ్ చేశారు. రెజ్లింగ్ ఫెడరేషన్‌లో బిజెపి ఎంపీ బ్రిడ్జిభూషణ్ సింగ్‌పై వచ్చిన ఆరోపణలపై స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. దేశంలోని మహిళా రేజర్లలపై జరుగుతున్న అకృత్యాలను అడ్డుకోవడంలో విఫలమవుతున్న మోడీ మరోవైపు బేటి పడావో బేటి బచావో అంటూ స్లోగన్ ఇస్తు పబ్బం కడుకుంటున్నారన్నారని ఎమ్మెల్యే విమర్శించారు. రెజ్లర్లు సాక్షి మాలిక్ వివేక్ పట్ల జరుగుతున్న సంఘటనలను చూస్తే మోడీ ఎంపీ బచావో బేటికో మారో అనే నినాదంతో ముందుకు వెళ్తున్నట్లుగా స్పష్టం అవుతుందని అన్నారు. జపాన్ ప్రధానమంత్రితో ప్రధాని మోడీ గప్ చుప్ లు తింటూ గప్ చుప్‌గా తన అదానీకి ప్రాజెక్టులు ఏమేమి ఇవ్వాలనే విషయాలపై చర్చించుకుంటున్నాడని ఆయన పేర్కొన్నారు. దేశంలో రైతులందరికీ మీటర్లు పెట్టాలని యోచిస్తున్న మోడీ ఆ మీటర్లు తయారు చేసేందుకు కూడా ఆదానికి అప్పగించాలనే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో కార్పొరేటర్ సుజాత నాయక్, మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్, రఘు రెడ్డి, కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటి హాల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే కిషన్ రెడ్డి



నవతెలంగాణ-తుర్కయాంజల్

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం తుర్కయంజాల్ మున్సిపాల్టీ మునగనూర్ శ్రీ జయసూర్య నగర్ కాలనీలో నూతన కమ్యూనిటీ హల్‌ను ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో ఎమ్మెల్యే ప్రసంగిస్తూ కమ్యూనిటి హాల్‌ను కాలనీ వాసులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు, కమ్యూనిటి హాల్ ప్రహరి గోడ కోసం 5లక్షల రూపాయలు, 10 కరెంటు స్తంభాలు మంజూరు చేశారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు వేముల స్వాతి అమరేంధర్ రెడ్డి, తాళ్లపల్లి సంగీత మోహన్ గుప్తా, బొక్క రవీందర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మున్సిపాల్టీ అధ్యక్షుడు వేముల అమరేంధర్ రెడ్డి, నాయకులు బొక్క మురళీధర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో ఎస్ఆర్ విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-చైతన్యపురి



జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ఎస్ అర్(శ్రీ గాయత్రి) కళాశాల దిల్‌సుఖ్‌నగర్ జోన్ విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించి తమ సత్తా చాటారు. దిల్‌సుఖ్‌నగర్, కొత్తపేట, ఆర్కే పురం, చంపాపేట శాఖలకు చెందిన విద్యార్థులు ఆలిండియా వివిధ కేటగిరీలలో 100 లోపు ముగ్గురు, వెయ్యిలోపు ర్యాంకులు 8 మంది, 500 పైగా విద్యార్థులు జేఈ అడ్వాన్స్ అర్హత సాధించినట్టు వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఆల్ ఇండియా 22వ ర్యాంక్ సాధించిన సి .అఖిల, 44వ ర్యాంకు సాధించిన కే .కార్తీక్, 48వ ర్యాంకు సాధించిన డి సాయి ధీరజ్, 215 ర్యాంకు సాధించిన ఎండి మొయినుద్దీన్,497 వ ర్యాంకు సాధించిన కే. శ్రవణ్ కుమార్, 522 ర్యాంకు సాధించిన ఏ. అజయ్, 885వ ర్యాంకు సాధించిన అంజన్ కుమార్, 920 ర్యాంకు సాధించిన మణిశంకర్ లను ఎస్సార్(శ్రీ గాయత్రి) విద్యాసంస్థల డైరెక్టర్ ఏ సంతోష్ రెడ్డి, డీజీఎం భగవాన్ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ శ్రీనివాస్, దిల్‌సుఖ్‌నగర్ జోన్ ఇన్‌చార్జ్ బంగారు బాబు, ఏ జీఎం లు సురేష్ ,శ్రీనివాస్, గౌడ్ లు అభినందించారు.

సక్సెస్ స్టార్ స్కూల్‌లో ఘనంగా గ్రాడ్యుయేషన్ వేడుకలు

నవతెలంగాణ-బడంగ్‌పేట్



విద్యార్థుల జీవితంలో గ్రాడ్యుయేషన్ వారి జీవితానికి ఒక మైలురాయి లాంటిదని సక్సెస్ స్కూల్ డైరెక్టర్ మహ్మద్ సుకావుద్దీన్ అన్నారు. జల్ పల్లి మున్సిపల్ పరిధిలో ఉన్న కొత్త పేట్ సలాల కాలనీలో ఉన్న సక్సెస్ స్కూల్ గ్రాడ్యుయేషన్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్న నాటి నుండే క్రమ శిక్షణతో కూడిన విద్యను నేర్చుకోవాలన్నారు. విద్యార్థులకు విద్యతోనే సమాజంలో గౌరవం లభిస్తుందన్నారు. అకడమిక్ గ్రేడ్ ప్రదానం చేయడంతో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు కూడా సాధించిన విజయం గర్వకారణంగా ఉందన్నారు. సక్సెస్ స్కూల్ చైర్‌పర్సన్, కరస్పాండెంట్ అతియా ఫాతిమా మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మద్దతు కోసం అందరితో కూడిన అభ్యాస వాతావరణాన్ని సృష్టించినందుకు ప్రశంసించారు.

హైదరాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కే మురళి మోహన్ బదిలీ

- నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నాల్గవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి జి. కళార్చన



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిటీ సివిల్ కోర్టు కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న కే మురళీమోహన్ భువనగిరి జిల్లా ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ కావడంతో ఆదివారం వారి నుంచి నాలుగో అదనపు సీనియర్ సివిల్ జడ్జి జీ కళార్చన డీఎల్ఎస్ఏ నూతన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. రెండున్నర సంవత్సరాల పాటు న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శిగా పనిచేసి పలు అవగాహన సదస్సులు, న్యాయసేవ కార్యక్ర మాలు చేపట్టి బదిలీపై వెళ్తున్న కే మురళీమోహన్ ను హైదరాబాద్ సిటీ సివిల్ కోర్ట్ చీఫ్ జడ్జి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్‌పర్సన్ రేణుకయారా, సిటీ సివిల్ కోర్టు న్యాయమూర్తులు కే ప్రభాకర్ రావు, కే పట్టాభి రామారావు, సరిత, వినోద్ కుమార్, తదితరులు సన్మానించారు. న్యాయ సేవాధికార సిబ్బంది, డి.ఎల్. యస్.ఏ పారా లీగల్ వాలంటీర్లు కార్యదర్శి కే మురళి మోహన్ ను సత్కరించి జ్ఞాపిక బహూకరించారు. నూతన కార్యద్శి గా భాద్యతలు చేపట్టిన కళార్చన కు చీఫ్ జడ్జ్ రేణుక యారా, పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.

తన విధి నిర్వహణలో సహకరించిన ఉన్నతాధికారులకు, సిబ్బందికి, పారా లీగల్ వాలంటీర్లకు వివిధ ప్రభుత్వ అధికారులకు, ఎన్జీవోలకు, పాత్రికేయులకు , ప్రతి ఒక్కరికీ న్యాయమూర్తి కే మురళీమోహన్ కృతజ్ఞతలు తెలియజేశారు.

మే డే ఉత్సవ కమిటీ కన్వీనర్‌గా పెంటయ్య



నవతెలంగాణ-బడంగ్‌పేట్

సీఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న సీఐటియు కార్యాలయంలో ఆదివారం నాయకులు ప్రత్యేక సమా వేశం నిర్వహించి మేడే ఉత్సవ కమిటీని ఏకగ్రవంగా ఎన్నుకున్నట్టు కన్వీనర్ పెంటయ్య తెలిపారు. 137వ ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా మే డే ను రంగారెడ్డి జిల్లాలో అన్ని మండల, పారిశ్రామిక,గ్రామీణ ప్రాంతాలతో ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు .శ్రామిక జన వారోత్సవ పోరాటాలను మే 1నుండి 7వరకు వారోత్సవాలను నిర్వహిస్తామన్నారు .మే డే ఉత్సవ కమిటీ కన్వీనర్ గా జే.పెంటయ్య, సలహాదారులుగా దాసరి బాబు, సుకోని యాదగిరి చారి, శ్యాం, ఎం.యాదయ్య, ప్రకాష్, కమిటీ సభ్యులుగా ఎంకయ్య, చిన్నబాయి, నిరంజన్, దనంజయ్య, యాదగిరి, ధనలక్ష్మి, జ్యోతి, యశోద, భారతమ్మ, నర్సిహ్మ, బండి మల్లేష్, కలమ్మ, బి.కమలమ్మ, శ్రీను, మల్లిఖార్జున్, డి.భుపేష్ తదితరులు ఉన్నారు.

దళిత బంధులో అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యేల పేర్లు బయట పెట్టాలి

- ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు బొర్ర రవి మాదిగ



నవతెలంగాణ - మీర్‌పేట్

దళిత బంధు పథకంలో అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యేల పేర్లను బయటపెట్టాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు బబొర్ర రవి మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం బాలాపూర్ చౌర స్తాలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో దళిత బంధు పథకంలో అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్దిదారుల నుండి రూ 2లక్షలు నుండి రూ 3లక్షలు తీసుకున్న ఎమ్మెల్యేలు 30మంది వరకు ఉన్నారని స్వయానా ముఖ్యమంత్రి కేసీఆర్ మీడియా సాక్షిగా చెప్పారని తెలిపారు. స్వయానా ముఖ్యమంత్రి చెప్పిన మాటలను హైకోర్టు సుమోటోగా తీసుకోవాలని చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ గ్యార సురేష్ మాదిగ, బాలాపూర్ మండల ఇంచార్జి తోట్ల శ్రీనివాస్ మాదిగ, మండల కో కన్వీనర్ చిన్నతుల్లా చిన్న మాదిగ, మహిళా నాయకురాలు జె ఇంద్రక మాదిగ, మహేశ్వరం మండలం మాజీ అధ్యక్షులు జంగయ్య మాదిగ, సోషల్ మీడియా ఇన్‌చార్జి ముచ్చర్ల ఆనంద్ మాదిగ, బాలాపూర్ మండల్ కో కన్వీనర్ చిర్ర కృష్ణ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ యూత్ విభాగం ఎల్బీనగర్ అధ్యక్షులుగా కళ్యాణ్



నవతెలంగాణ - ఎల్బీనగర్

ఎల్‌బినగర్ నియోజకవర్గ నూతన బిఆర్ఎస్ పార్టీ యువజన అధ్యక్షులుగా ముద్ద కళ్యాణ్‌ను నియమిస్తూ నియామక పత్రాన్ని ఆదివారం ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా కళ్యాణ్ మాట్లాడుతూ నాపై ఎంతో నమ్మకం ఉంచి ఇంత పెద్ద బాధ్యతలు అప్పగించిన సుధీర్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో సుధీర్‌రెడ్డిని ఎల్‌బినగర్ నియోజవర్గం నుంచి భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్ళి పార్టీ యొక్క ప్రతిష్ఠతను పెంపొందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చంపాపేట డివిజన్ సీనియర్ బారాస నాయకులు నల్ల రఘుమారెడ్డి, మరియు పలువురు నాయకులు,కార్యకర్తలు భారీ ఎత్తున హాజరయ్యారు.

కాంగ్రెస్ అవుషాపూర్ గ్రామ శాఖ అధ్యక్షులుగా షేక్ సల్మాన్ ఖాన్

నవతెలంగాణ - ఘట్కేసర్



ఘట్‌కేసర్ మండలం అవుషాపూర్ గ్రామ కాంగ్రెస్‌లో కీలక మార్పు చోటు చేసుకుంది. గ్రామ శాఖ అధ్యక్షుడిగా ఉన్న మేడబోయిన జంగయ్య ముదిరాజ్‌ను కాంగ్రెస్ అధిష్టానం తొలగించింది. ఆయన స్థానంలో కొత్త అధ్యక్షుడిగా సీనియర్ నాయకులు షేక్ సల్మాన్ ఖాన్‌ను నియమించారు. ఈ మేరకు మండల పార్టీ అధ్యక్షుడు కర్రె రాజేష్ ఉత్తర్వులు జారీ చేసి, ఆ గ్రామ కాంగ్రెస్ సీనియర్ నాయకుల సమక్షంలో సల్మాన్‌కు నియామక పత్రం అందజేశారు. షేక్ సల్మాన్ నియామకంతో పార్టీ పట్టు సాధిస్తుందని కేడర్ భావిస్తుంది. ఈ సందర్భంగా షేక్ సల్మాన్ ఖాన్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన పదవిని సమర్ధవంతంగా నిర్వర్తిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ సీనియర్ నాయకులు కంచర్ల వెంకటరెడ్డి, మదార్, కాసుల వెంకటేష్ గౌడ్, భాను గౌడ్, బడేసాబ్, చిన్న యాదవ్, మహేష్ యాదవ్, ఎస్. కే ఇమామ్, యూసుఫ్, అక్బర్, సాయి గౌడ్, రాజు నాయక్, ఎస్. కే జాంగిర్, సైదు, మున్నా తదితరులు పాల్గొన్నారు.

అల్మాస్‌గూడ బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-బడంగ్‌పేట్



మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న అల్మాస్‌గూడలోని తిరుమల్‌నగర్ కాలనీలో బంజార వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం రామిడి కళావతి స్మారక భవనంలో బంజార నాయకులు, పెద్దలు సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు నూతన కమిటీ అధ్యక్షులు ధన్సింగ్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంజార వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బంజార సంఘం సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. నూతన కార్యవర్గంలో గౌరవ అధ్యక్షులు వి.లాలునాయక్, అధ్యక్షులు జే. ధన్సింగ్ నాయక్, ప్రధాన కార్యదర్శి ఏ. మోహన్ నాయక్, కోశాధికారి జే.రాంచందర్ నాయక్, మరి కొందరిని కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రవంగా ఎన్నుకున్నట్టు తెలిపారు.

'శ్రీ సత్య సాయి సొసైటీ ప్లాట్ల యజమానులకు న్యాయం చేయాలి'

నవతెలంగాణ-సిటీబ్యూరో

శ్రీ సత్య సాయి సొసైటీ ప్లాట్ల యజమానులకు న్యాయం చేయాలని సొసైటీ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె పార్థసారథి, వర్కింగ్ ప్రసిడెంట్ మెట్టు సూర్య ప్రకాష్ ఒక ప్రకటనలో కోరారు. 'హైదరాబాద్‌లోని మియాపూర్ పరిధిలోని హైదర్ నగర్ గ్రామ పంచాయతీ సర్వే నం.172/2 నుండి 9, 18,19 సుమారుగా 98 ఎకరాలు పట్టా భూమిని రైతుల నుంచి శ్రీ సత్య సాయి కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ వారు కొని, స్వయంగా ప్లాట్లు చేసి దాదాపుగా 1100 మంది సభ్యులకు 1981-1985 మధ్య కాలంలో అమ్మడం జరిగింది. ఈ ప్లాట్లు కొన్న వారందరూ పరిసర ప్రాంతాలలోని వివిధ ప్రభుత్వ, ప్రయివేటు కంపెనీలలోను మరియు ఇతరత్రా చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తూ నగరంలోనీ అనేక ప్రాంతాలలో ఉన్నారు. దీనిని గమనించిన "గోల్డ్ స్టోన్ ప్రసాద్" అనే వ్యక్తి ఈ స్థలం పై కన్సెసి అసైన్మెంట్ భూమి గా తప్పుడు పత్రాలు సృష్టించి 1996లో జిల్లా కోర్టులో కేసు వేశారు. దీనికి ప్రతిగా శ్రీ సత్య సాయి సొసైటీ వారు రాష్ట్ర హైకోర్టులో పోరాడగా, ఈ స్థలమంతా రైతుల పట్టా భూమి అని, దీనిని కొన్న సొసైటీ సభ్యులకే చెందుతుందని 20.12.2019న తీర్పునిచ్చింది. ఈ తీర్పుని సవాలు చేస్తూ "గోల్డ్ స్టోన్ ప్రసాద్" సుప్రీం కోర్టును ఏడాది క్రితం ఆశ్రయించగా కోర్టు వారు "స్టేటస్ ఖో" విధిస్తూ, విచారణ చేపట్టారు. ప్రస్తుతానికి రాబోవు 2.05.2023 న తదుపరి విచారణ జరగనున్నది. ఈ పరిస్థితిని గమనించిన స్థానికులు కొందరు, ఈ స్థలంలో దాదాపుగా ఒక నెల రోజులుగా రాత్రి వేళల్లో మట్టి నింపి చదును చేసి గుడిసెలు, పాకలు, షెడ్లు వేస్తున్నారు. ఈ విషయమై జీహెచ్ఎంసీ, పోలీస్ వారికి కంప్లైంట్ చేయడం జరిగింది. జీహెచ్ఎంసీ వారు పోలీస్ వారు విచారించగా శ్రీ భాస్కర్ రావు తదితరులు రాజకీయ అండతో ఇలా చేస్తున్నారని తెలియజేశారు. ఆ తర్వాత మరి కొంత చెలరేగి యధేచ్ఛగా మట్టి నింపుతున్నారు. గత మూడు రోజుల క్రితం కూడాను పోలీస్ వారిని సంప్రదించాము. తగు చర్యలు తీసుకొని శ్రీ సత్య సాయి సొసైటీ ప్లాట్లు యజమానులను కాపాడవలసిందిగా కోరుతున్నాము' అని ప్రకటనలో పేర్కొన్నారు.

కన్యకా పరమేశ్వరి జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న ఉప్పల దంపతులు

నవతెలంగాణ-నాగోల్



వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి ఉత్సవాలలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ ఛైర్మెన్, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్తా ,ఆయన సతీమణి ఉప్పల స్వప్నలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం హైదరాబాద్ నగరంలోని వనస్థలిపురం, మీరిపేట, కొత్తపేట నాగోల్ చౌరస్తా లోని శ్రీదేవి ఆలయం, చిల్కానగర్, రామంతపూర్, బోడుప్పల్ ,నాగారం, సికింద్రాబాద్లోని కనకా పరమేశ్వరి, శ్రీదేవి ఆలయాలలో జయంతి ఉత్సవాల సందర్భంగా ఆలయాలను సందర్శించి వాసవి మాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలు సుఖసంతో షాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు ఈ సందర్భంగా శ్రీనివాస గుప్త తెలిపారు. వనస్థలిపురం ఆలయ చైర్మెన్ జయరాములు గుప్తా ,మీరిపేట ఆలయ చైర్మెన్ శ్రీనివాస గుప్తా, కొత్తపేట బాలరాజు గుప్తా చిలుకానగర్ శ్రీనివాస గుప్తా బోడుప్పల్ వెంకటేష్ గుప్తా, నాగారం డివిజనల్ అధ్యక్షుడు రమేష్, ఆధ్యాత్మిక చైర్‌పర్సన్ శాంతి మహిళా విభాగం అధ్యక్షురాలు జ్యోతి, అశోకు, సికింద్రాబాద్ ఆలయ చైర్మెన్ నర్సింగ్ రావులతోపాటు ఆర్యవైశ్య నాయకులు, వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'కళల అభ్యాసానికి దృష్టి, మనస్సు ఐక్యం కావాలి'



నవతెలంగాణ-కల్చరల్

ఏ కళా ప్రక్రియ అభ్యసించాలన్న దృష్టి మనస్సు రెండూ ఏకం కావాలని ప్రముఖులు సూచించారు. శ్రీ త్యాగరాయ గాన సభ ప్రధాన వేదిక పై మయూరి నృత్యాలయ సాంస్కృతిక సేవా సంస్థ నిర్వహణలో ప్రపంచ నాట్య దినోత్సవం సందర్భంగా ఎనిమిది గంటలు నాట్యమహోత్సవం జరిగింది. వైష్ణవి నాట్య లయ గురువు జ్యోతిర్మయి,మయూరి నృత్యాలయ్ గురువు రాజనాల శ్రీదేవి, రమాదేవి డాన్స్ అకాడమీ గురువు రమా దేవి, తాండవ క్రిష్ణ నృత్యాలయ్ గురువు ఉదయ శ్రీ, గురువు ప్రియాంక శిష్య బృందం అన్నమయ్య త్యాగరాజ,రామదాసు దీక్షితార్ తదితర వాగ్గేయకారుల కీర్తనలను నర్తించి ఆకట్టుకున్నారు అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిధులు గా పోలీస్ ఉన్నతాధికారి రామ దాసు, ప్రముఖ నాట్య గురువు పసుమర్తి శేషుబాబు లు నర్తకులను అభినందించి గురువులను సత్కరించారు. రామ దాసు మాట్లాడుతూ కళలు సంస్కారం నేర్పుతాయన్నారు. శేషు బాబు మాట్లాడుతూ పంచమ వేదం నాట్యం ప్రామాణిక శాస్త్రం నాట్య శాస్త్రమని తెలిపారు. నాట్య గురువు ఉదయ శ్రీ మాట్లాడుతూ పాఠ్య గ్రంధాలలో నేడు నీతి శాస్త్రం వంటి గ్రంధాలు లేవని అందుచే కళల అవసరం అన్నారు. పెద్దలు ఉద్యోగాలలో పని గంటలు గురించి పోరాటాలు చేస్తారని కానీ పిల్లలను మాత్రం పన్నెండు గంటలు చదువులో నిలుపుతున్నారని వారికి కళలు ఒత్తిడిని తగ్గిస్తాయని చెప్పారు. నిర్వాహకులు రాం కుమార్ స్వాగతం పలుకగా రాజనాల శ్రీదేవి వందన సమర్పణ చేశారు

నాగోల్‌లో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవం



నవతెలంగాణ -నాగోల్

పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి సమాధి అయిన రోజును పురస్కరించుకొని ఆదివారం నాగోలు డివిజన్లోని జైపూర్ కాలనీలో 330వ ఆరాధన మహోత్సవ కార్యక్రమాన్ని విశ్వకర్మలు ,విశ్వబ్రాహ్మణులు ఘనంగా నిర్వహించారు. ఈ ఆరాధన కార్యక్రమానికి ఎమ్మెల్సీ యెగ్గే మల్లేష్ ,నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్, బి.ఎస్.రెడ్డి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ముద్దాని లక్ష్మీ ప్రసన్నరామోహన్ గౌడ్, రంగారెడ్డి బిజెపి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు గీతారెడ్డి ,విశ్వకర్మ సంఘం నాయకులు గంగాధరాచారి, విష్ణుచారి, సురేంద్రచారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాసవి జయంతి వేడుకలు



నవతెలంగాణ - సంతోష్ నగర్

వాసామాత జయంతి సందర్భంగా ఆర్యవైశ్య సంఘం లాల్ దర్వాజా గౌలిపురా వారిచే కన్యాకాపరమేశ్వరి ట్రస్టు భవనంలో పూజా నిర్వహించారు. ఆదివారం ఉదయం మండపారాధన అమ్మవారికి పంచామృతాభిషేకం అనంతరం సామూహిక కుంకుమార్చనలు, భక్తులకు భోజనప్రసాదం చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. అధ్యక్షులు శ్రీధర మల్లికార్జున్ ఐపిపి ఇరుకుల్ల నర్సింహులు, సలహాదారులు శ్రీరాం కోటయ్య, చీల రాములు గుప్త, సరాబు విశ్వేశ్వరయ్య, గుగ్గిళ్ల అశోక్ కుమార్, సంఘ కార్యదర్శి సరాబు సంతోష్ కుమార్, కోశాధికారి కొల్యారి నర్సిములు, ఆర్గనైజింగ్ సెక్రటరీ బిక్షపతి, స్థానిక పొదుపు సంఘం అధ్యక్షులు దొంతుల శ్రీనివాస్, కార్యదర్శి నాగరాజు గుప్త, ఇతర సంఘ సభ్యులు భక్తులు పాల్గొన్నారు

శ్రీనివాసనగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-నాగోల్

నాగోల్ డివిజన్‌లోని శ్రీనివాస నగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నికల అధికారి ఏ సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. రెండు సంవత్సరాల పాటు కొనసాగే ఈ కార్యవర్గంలో అధ్యక్షులుగా బి థామస్ చౌదరి,ఉపాధ్యక్షులుగా సూర్యనారాయణ, వెంకటేశ్వరరావు,సంజీవరావు, ప్రధాన కార్యదర్శిగా కే జనార్ధన్ రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా రామచంద్ర కత్రావత్, ఎస్ రాజా, బి రవికుమార్,కోశాధికారిగా జి నరోత్తమ రెడ్డి, సాంస్కృతిక కార్యదర్శిగా కే. కల్పన, న్యాయ సలహాదారుగా మల్లారెడ్డిలతో పాటు మరో పదకొండు మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

'వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి'

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ నగరంలో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలకు ఇబ్బంది కలగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధికారులను ఆదేశించారు తన క్యాంపు కార్యాలయం నుంచి జోనల్ కమిషనర్లతో మేయర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు వర్ష ప్రభావం గల ప్రాంతాల్లో లోతట్టు ప్రాంత ప్రజల ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. ట్రాఫిక్ సమస్య లేకుండా రోడ్ల పై నిలిచిన నీరు ఎప్పటికప్పుడు తొలగించాలని అధికారులను మేయర్ ఆదేశించారు

హయత్‌నగర్‌లో చోరీ

నవతెలంగాణ-హయత్‌నగర్

హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెద్ద అంబర్ పేట కుంట్లూర్ జీవీఆర్ కాలనీ లో నివాసం ఉంటున్న శ్రవణ్ కుమార్ అనే వ్యక్తి తన కుటుంబ సభ్యులతో కలిసి గుజరాత్‌లో ఉన్న శ్రీ కృష్ణుడు దేవాలయానికి వెళ్లారు. ఈనెల 29న తన ఇంటికి వచ్చి బీరువాను చూడగా తాళం పగుల గొట్టి ఉంది. అందులో ఉన్న ఒక తులం బంగారం, కొంత వెండి వస్తువులు అపహరణకు గురయ్యాయని పోలీసులుకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

మంత్రి మల్లారెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన రాజశేఖర్ రెడ్డి

నవతెలంగాణ-కంటోన్మెంట్

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయ ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం నూతన చాంబర్‌లో ప్రవేశించిన కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డిని కంటోన్మెంట్ నియోజకవర్గ, మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జ్ మర్రి రాజశేఖర్ రెడ్డి సకుటుంబ సపరివార సమేతంగా వెళ్లి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్చాలు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, కంటోన్మెంట్ మాజీ బోర్డ్ సభ్యులు పాండు యాదవ్, హమాలి రాష్ట్ర నాయకులు శ్రీను, ఈఎస్ఐ బోర్డ్ సభ్యులు రమణ రెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.



మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్ నాగార్జున నగర్ కాలనీ కి చెందిన బీఆర్ఎస్ నాయకురాలు, తెలంగాణ ఉద్యమకారిణి మల్లెబోని గంగమ్మ (52) కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ మరణించింది. వారి కుటుంబ సభ్యులకు బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి ఆదేశానుసారం ట్రస్ట్ ప్రతినిధి నేమూరి మహేష్ గౌడ్ రూ. 10,000 ఆర్థిక సాయం అందజేశారు. ఇంతకు ముందు కూడ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న మహేష్ గౌడ్ ట్రస్ట్ ద్వారా పలుమార్లు ఆర్థిక సహాయం చేశారు.



పసికందుకు సి.పి.ఆర్ చేసి ప్రాణాలు కాపాడిన 108 సిబ్బంది

నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

అప్పుడే పుట్టిన పసికందుకు సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడారు కీసర 108 సిబ్బంది. వివరాల్లోకెళ్తే.. మేడ్చల్ జిల్లా కీసర మండల పరిధిలోని కుందనపల్లీ గ్రామంలో నివసిస్తున్న 20 ఏండ్ల ఆర్తి కుమారి అనే మహిళకు శనివారం అర్ధరాత్రి సుమారు రెండు గంటల సమయంలో మొదటి కాన్పు పురిటి నొప్పులు రావడంతో కీసరలోని లైఫ్ షేవ్ హాస్పిటల్‌కు తీసుకొచ్చారు, అక్కడి వైద్యులు ఆర్తి కుమారిని పరీక్షించి.. నెలలు పూర్తిగా నిండలేదు ,మొదటి కాన్పు కాబట్టి ఆపరేషన్ చేయాలి, పుట్టబోయే బిడ్డ ఎదుగుదల సరిగా లేదు కాబట్టి, బిడ్డను ఐ. సి. యూ లో పెట్టాల్సి వస్తుంది అని చెప్పి దీనికి చాలా ఖర్చు అవుతుందన్నారు. కోళ్ల ఫారంలో పనిచేస్తున్న తాము అంత ఖర్చు పెట్టలేము అని చెప్పడంతో హాస్పిటల్ డాక్టర్లు గాంధీ హాస్పిటల్‌కు వెళ్లాలని సూచించారు, అప్పుడు వారు 108కి కాల్ చేసి వారి పరిస్థితీనీ వివరించగా కీసర 108 సిబ్బంది వెంటనే ఘటన స్థలానికి చేరుకొని, ఆర్తి కుమారిని అంబులెన్స్ లోనికి తీసుకున్నారు. వెంటనే



అత్యవసర వైద్య పరీక్షలు నిర్వహించి, నెలలు పూర్తిగా నిండలేదు అని గమనించి, బ్లడ్ కూడ తక్కువగా ఉందని.. పుట్టబోయే బిడ్డ ఎదుగుదల సరిగా లేదు కాబట్టి ప్రాణ హాని ఉంది అని గమనించిన ఈ. ఎమ్.టి చిత్రం రవి వెంటనే గ్లూకోస్ ద్రవాలు ఎక్కిస్తూ గాంధీ హాస్పిటల్‌కు తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో మార్గ మధ్యలో నాగారం సమీపంలోకి వెళ్ళగానే మహిళకు పురిటి నొప్పుల తీవ్రత ఎక్కువగా అయ్యింది. వెంటనే డెలివరీ చేయాల్సి వస్తుంది అని ఈఎంటీ రవి గ్రహించి అందుకు అవసరమైన పరికరాలు తీసుకోని ఆర్తి కి అంబులెన్స్ లోనే సుఖ ప్రసవం చేసాడు, పుట్టిన బిడ్డ తక్కువ బరువు ఉన్నాడు. అలాగే పల్స్,లేదు బ్రీతింగ్,లేదు హార్ట్ బీట్ కూడా లేకుండా మగ బిడ్డ బయటకు రావడం గమనించిన ఈ ఏమ్. టి. రవి మరొక సారి 108 డాక్టర్ ఈ.ఆర్.సి.పీ డాక్టర్. మహీధ్‌కు ఫోన్‌లో బిడ్డ పరిస్థితీనీ వివరించారు అప్పుడు డాక్టర్ చేసిన సూచనలను సక్రమంగా పాటిస్తూ బిడ్డకు సీపీఆర్ స్టార్ట్ చేసి అంబు బ్యాగ్‌తో బ్రీతింగ్ అందిస్తూ ఆక్సిజన్ కూడ సరఫరా చేస్తూ గాంధీ హాస్పిటల్ వేగాంగా ప్రయనిస్తూ 5 సైకిల్స్ సీ.పి. ఆర్ చేసి బిడ్డకు హార్ట్ బీట్ వచ్చే లాగా చికిత్స ఇచ్చారు. గాంధీ హాస్పిటల్ కి చేరుకునేలోగ బిడ్డకు హార్ట్ బీట్, బ్రీతింగ్ వచ్చెలగా చేశారు. అక్కడి వైద్యులు బిడ్డను పరిశీలించి, పరిస్థితిని అర్థం చేసుకుని 108లో సరైన సమయంలో సి.పి. ఆర్ చేసి బిడ్డ ప్రాణాలు కాపాడారు అని 108 సిబ్బందినీ బెస్ట్ ఫర్ఫమెన్స్ అని అభినందించారు, ఆర్తి కుమారి కుటుంబ సభ్యులు కీసర 108 సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

స్వయం ఉపాధి రంగాల్లో యువకులు రాణించాలి



- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి

నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

స్వయం ఉపాధి రంగాల్లో యువకులు రాణించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు. ఆదివారం నాగారం మున్సిపాలిటీ రాంపల్లి గ్రామంలో కొత్తపట్నం రెస్టారెంట్‌ను మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు నచ్చే విధంగా రెస్టారెంట్ నిర్వాహకులు వంటలు తయారు చేసి ఆకట్టుకోవాలని కోరారు. రెస్టారెంట్ నిర్వాహకులైన సీనియర్ జర్నలిస్ట్ రామరం సుధీర్ గౌడ్ కుటుంబ సభ్యులను మంత్రి అభినందించారు. కార్యక్రమంలో నాగార మున్సిపల్ చైర్మెన్ కౌకుట్ల చంద్రారెడ్డి , వైస్ చైర్మెన్ మల్లేష్ యాదవ్ , కౌన్సిలర్లు ఏలిజాల నగేష్ గౌడ్ గోక కళావతి యాదగిరి ,పంబల్ల సరిత ,టి.లక్ష్మీ వేణుగోపాల్ ,బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



108 బజార్‌లో సమస్యలు తెలుసుకునేందుకు గాను రాష్ట్ర మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ మన్నె క్రిశాంక్ 108 బజారు ఆరో బస్తీ నిద్ర కార్యక్రమం నిర్వహించారు. స్థానికులు మిల్ట్రీ అధికారుల వేధింపుల గురించి ఆరోపించారు. ముఖ్యంగా బస్తీలో సరిహద్దు గోడలు, కంచెలు వేయడం వల్ల అధికారులతో విపరీ తమైన సమస్యలు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు ఉద్యోగాలు చేసుకుని రాత్రి సమయంలో ఇండ్లకు వెళ్లే వారిని ఐడి కార్డు చూపించినా మిల్ట్రీ వారు ఇబ్బం దులకు గురి చేస్తున్నారని మొరపెట్టుకున్నారు. అలాగే ప్రజలు అందరు తమ ఓటు హక్కు పునరుద్ధరించాలని క్రిశాంక్‌కు తెలిపారు. క్రిశాంక్ మాట్లాడుతూ ఓటు హక్కు కోసం కలిసి పోరాడుదామని తెలిపారు. అనంతరం బస్తీ వాసులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. మోతీ దాస్, రాజు, లారెన్స్, విక్రమ్ సింగ్, సుధాకర్, మోని, రఘు, సాయి, రాజులతో తదితరులు పాల్గొన్నారు.నవతెలంగాణ-కంటోన్మెంట్

అస్పష్టంగా ఇంటర్ కాలేజీలకు ఫీజు వాపసు మార్గదర్శకాలు

- కళాశాలలు నడుపుతున్న కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి
- ఇంటర్ బోర్డు నిర్లక్ష్యంపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి
- ఎస్ఎఫ్ఐ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు బ్యాగారి వెంకటేష్

నవతెలంగాణ-మల్కాజిగిరి/కాప్రా/మేడ్చల్

విద్యా వ్యవస్థలో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు బ్యాగారి వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మధ్యలో కాలేజీలు మానేసిన ఇంటర్ విద్యార్థులకు ఫీజు వాపసు, అలాగే కాలేజీలలో తీసుకోవాల్సిన చర్యలపై ఇంటర్ కార్యదర్శి విడుదల చేసిన మార్గదర్శకాలు అస్పష్టంగా ఉన్నాయన్నారు. కార్పొరేట్ కళాశాలలో చదువుల కోసం విద్యార్థులను తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నారని.. వాటిపై చర్చ జరుపలేదన్నారు. కార్పొరేట్ కళాశాలలు రెసిడెన్షియల్ పద్ధతిలో నడిచే వాటికి అపార్ట్మెంట్‌లో నడుస్తున్న వాటిపై చర్యలు గురించి ప్రస్తావన లేదని పేర్కొన్నారు. జాతీయ పరీక్షలు పేరుతో ర్యాంకుల పేరుతో ఒత్తిడిలకు గురి చేయడం, కోచింగ్ పేరుతో లక్షల రూపాయల ఫీజుల దందాపై కూడా కనీసం చర్చలేదని తెలిపారు. ఫీజు వాపసు గురించి 3 పద్ధతులు తీసుకుని వస్తున్నట్లు చెప్పినా ,వాపసు ఫీజులు చెల్లించని కళాశాలలపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వివరించలేదన్నారు. పరోక్షంగా వారికే మద్దతు ఇచ్చినట్లుగా ప్రభుత్వ మార్గదర్శకాలు ఉన్నాయని ఎస్ఎఫ్ఐ భావిస్తున్నదని చెప్పారు. ఇప్పుడు వేసవి సెలవుల్లో శ్రీచైతన్య,నారయణ, ఆకాశ్, ప్రిడ్జ్,రెసోనెన్స్ ,ఆల్ఫోర్స్ ,తదితర సంస్థలు మొదటి సంవత్సరం తరగతులు నిర్వహిస్తున్న కనీసం బోర్డు అధికారులలో చలనం లేదని మండిపడ్డారు. తనిఖీలు లేవు, యధేచ్చగా కోండాపూర్, రావిరాల, ఆదిభట్ల, మాధాపూర్ కూకట్ పల్లి ఉప్పల్ కుత్బుల్లాపూర్ తదితర ప్రాంతాల్లో అపార్ట్మెంట్స్ లో తరగతులు నడుపుతున్నారని తెలిపారు. విద్యార్థులను పంపని తల్లిదండ్రులను వేధిస్తున్నారని.. అకాడమీల పేరుతో దోడికి జరుగుతున్న కనీసం బోర్డు స్పందించడం లేదన్నారు.. తప్పుడు ర్యాంకులను ఇచ్చి తల్లిదండ్రులను బురిడి కోట్టించే ప్రయత్నం కార్పొరేట్ సంస్థలు చేస్తున్నాయని తెలిపారు. వాటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. లేకుంటే విద్యాసంస్థల ఎదుట ప్రత్యక్ష ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. తక్షణమే ఇంటర్ బోర్డును ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు.



ప్రతీ మత సాంప్రదాయాన్ని గౌరవించాలి

- కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి

నవతెలంగాణ-నాచారం

సమాజంలోని ప్రతి ఒక్కరూ అన్నీ మత ఆచారా సాంప్రదాయాలను గౌరవించాలని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం మల్లాపూర్ అం బేద్కర్ భవనంలో ముస్లిం సంక్షేమ సంఘం ఆధ్వర్యం లో ఉచితంగా కథాన క్యాంపు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ హాజరై మాట్లాడుతూ రాష్ట్రం సర్వ మతాల సమ్మేళనమని, ఆయా మతాల ప్రజలు వారి ఆచార వ్యవహారాలను గౌరవిస్తూ జీవించడంలో ఉన్న అనుభూతి జీవితంలో ఎక్కడ దొరకదని అన్నారు. అనంతరం అప్పుడే పుట్టిన పిల్లవాడి నుంచి 10 సంవత్సరాల వయసు గల బాలుర్లలకు ముస్లిం మత పెద్దలు ఆచారం ప్రకారం సున్నతులు చేశారు. ఈ సందర్భంగా మల్లాపూర్ డివిజన్ పరిధిలోని మైనారిటీ సోదరులు ఉచిత కథాన క్యాంపును సద్వినియోగం చేసుకొని మల్లాపూర్ ముస్లిం సంక్షేమ సంఘం ప్రతినిధులకు ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ ముస్లిం సంక్షేమ సంఘం ప్రతినిధులు ఎండి అల్తాఫ్, ఎండి ముజీబ్, అహ్మద్, ఎండి ఇస్మాయిల్, మునిరుద్దీన్, ఒమెస్, జావీద్, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.



శ్రమశక్తి అవార్డుకు ఎంపికైన కార్మిక నాయకులు





నవతెలంగాణ-నాచారం

కాప్రా సర్కిల్, మల్లాపూర్ డివిజన్‌కు చెందిన కార్మిక సంఘాల నాయకులు శ్రమశక్తి అవార్డుకు ఎంపికయ్యారు. గత 15 ఏండ్లగా కార్మిక ఉద్యమంలో కొనసాగుతూ అనేక రంగాలలో కార్మిక యూనియన్‌లను ఏర్పాటు చేసి కార్మిక హక్కుల కోసం పోరాడుతున్న నాయకుడు తెలంగాణ రాష్ట్ర ఇండస్ట్రియల్ ట్రేడ్ యూనియన్ (టీఎస్ఐటీయూ) రాష్ట్ర అధ్యక్షు బూరుగు మారుతీ రావు శ్రమ శక్తి అవార్డుకు ఎంపి కావడం పట్ల కార్మిక వర్గం అభినందనలు తెలిపారు, కాప్రా మున్సిపల్ పరిధిలోని పారిశుధ్య విభాగంలో పనిచేస్తూ నిత్యం మున్సిపల్ కార్మికుల సమస్యలను ఉన్నతాధికారులు , ప్రభుత్వ పెద్దల దష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడంలో కీలక భూమిక పోషిస్తున్న భారత రాష్ట్ర సమితి కార్మిక విభాగం (బీఆర్‌డీకేవీ) కాప్రా సర్కిల్ అధ్యక్షులు జి కురుమన్న శ్రమశక్తి అవార్డుకు ఎంపికైనట్లు లేబర్ డిపార్ట్మెంట్ నుంచి సమాచారం రావడం పట్ల మున్సిపల్ కార్మికులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. మేడే సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం కార్మిక శాఖ సంయుక్తంగా రవీంద్రభారతిలో ముఖ్యమంత్రి కెసిఆర్ చేతుల మీదుగా శ్రమ శక్తి అవార్డులకు ఎంపికైన కార్మిక వర్గం నాయకులను ఘనంగా సత్కరించి అవార్డును ప్రదానం చేస్తారు. ప్రభుత్వం నిర్వహించే మేడే ఉత్సవాలకు కార్మిక వర్గం అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

మంత్రిని కలిసి అభినందనలు తెలిపిన హమాలి శ్రీను



నవతెలంగాణ-నాచారం

నూతన సెక్రటేరియట్ చాంబర్‌లో మంత్రి చామకూర మల్లారెడ్డిని రాష్ట్ర సివిల్ సప్లై హమాలి యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు చిగుళ్ల శ్రీనివాస్ హమాలి శ్రీను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌కు, మంత్రులకు, అధికారులకు అధునాతన అంగులతో ప్రత్యేక చాంబర్లు ఏర్పాటు చేసి ప్రారంభించుకోవడం అభినందనీయమని అన్నారు. తెలంగాణ జాతిపిత కెసిఆర్ రాబోయే కాలంలో దేశాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దే నాయకుడుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హమాలీ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో మహాకవి శ్రీశ్రీ జయంతి

నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో కమలానగర్ ఆఫీసులో మహాకవి శ్రీశ్రీ జయంతి సందర్భంగా ఆయనకు నివాళి కార్యక్రమం నిర్వహించారు. నివాళి కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూప్ సభ్యులు ప్రముఖ కవి వీబీ ఆచార్యులు అధ్యక్షత వహించారు. కార్యక్రమాన్ని స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు నిర్వహించారు. మొదటగా వీబీ ఆచార్యులు , శ్రీమన్నారాయణలు శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం వీబి ఆచార్యులు మాట్లాడుతూ మహాకవి శ్రీశ్రీ ప్రజల భాషలో ప్రజలను చైతన్య పరిచేందుకు ఎనలేని కషి చేశారని చెప్పారు. 1930లలోనే అనేక కవితలు రాశారన్నారు. మహాప్రస్థానంలోని కవితలు ప్రజల నాలుకల్లో నిరంతరం తారాడుతూనే ఉన్నాయన్నారు. శ్రీశ్రీ రచించిన మహాప్రస్థానంతో పాటు ఖడ్గసృష్టి లాంటి రచనలే కాకుండా సినిమా రంగంలో కూడా ప్రవేశించి అనేక గొప్ప గొప్ప ప్రయోజనాత్మకమైన పాటలు రాశారని అన్నారు. సీనియర్ స్ఫూర్తి గ్రూపు బాధ్యులు శ్రీమన్నారాయణ మాట్లాడుతూ.. శ్రీ శ్రీ రచనలు దానికి ఆనాడు ఉన్నటువంటి అంతర్జాతీయ పరిస్థితులు, సామాజిక స్థితిగతులపై ప్రజలకు చైతన్యంతో పోరాడాల్సిన అవసరాన్ని చాలా గొప్పగా చెప్పారన్నారు. రుక్కయ్య దేశభక్తి గీతం, శ్రీశ్రీ రచించిన అభ్యుదయ పాటలు పాడి వినిపించారు. జి శివరామకష్ణ , శారద , ఎర్రం నాగయ్య , వెంకట్ , శివన్నారాయణ తదితరులు ప్రసంగించారు. ప్రముఖ రచయిత వీబీ చారి, చంద్రశేఖర్, ఆర్ఎస్ఆర్ ప్రసాద్, గోపి, ప్రభాకర్ పాల్గొన్నారు.



ఘట్స్(జీయూటీఎస్) యూనియన్ జెండా ఆవిష్కరించిన మాజీ మేయర్ రామ్మోహన్

నవతెలంగాణ-కాప్రా

సైనిక్ పురి జ్యోతిరావు పూలే విగ్రహానికి మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ పూల మాల వేసి తెలంగాణ యూనిటీ ఫర్ తెలంగాణ సంఘం(జీయూటీఎస్) జెండాను ఆవిష్కరించారు. ఇటీవల పరమపదించిన యూనియన్ సభ్యులు బాల్ రాజ్ మతికి నివాళిగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో బీ ఆర్ ఎస్ నాయకులు బండారి లక్ష్మారెడ్డి ,కార్పొరేటర్లు స్వర్ణరాజ్ , బొంతు శ్రీదేవి యాదవ్ , యూనియన్ అధ్యక్షులు మల్లేష్ గౌడ్,గజేంద్ర,రఫీ,మహేందర్, బీఆర్ఎస్ నాయకులు వంశరాజ్ మల్లేష్,బాల్ రెడ్డి,రాజేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.



సివిల్ సప్లై సంస్థ చైర్మెన్ రవీందర్ సింగ్‌కు మే డే శుభాకాంక్షలు



నవతెలంగాణ-నాచారం

తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లై సంస్థ చైర్మెన్ రవీందర్ సింగ్ ను సివిల్ సప్లై హమాలి యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు చిగుళ్లాలి (శ్రీను) కలిసి మే డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు మే డే ఉత్సవాలకు హాజరుకావాలని ఆహ్వానించారు. సివిల్ సప్లై సంస్థలో పనిచేస్తున్న హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో తెలంగాణ ప్రభుత్వం, ముఖ్యమంత్రి కేసీఆర్ ఏనాడు వెనుకకి పోలేదని తెలిపారు. అత్యవసర సేవలోని ప్రధానమైన రంగం పౌరసరఫరాల విభాగంలో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమం కోసం ఎప్పుడూ ముందుంటానని రవీందర్ సింగ్ అన్నారు. మేడే ఉత్సవాలు కార్మికుని జన్మహక్కుని గుర్తు చేశారు. రాష్ట్ర అధ్యక్షులు హమాలీ శ్రీను నాయకత్వంలో హమాలీ కార్మికుల హక్కులను, కోరికలను తీర్చడంలో తెలంగాణ ప్రభుత్వం ముందు వరుసలో ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా గిడ్డంగుల్లో విధులు నిర్వహిస్తున్న హమాలి కార్మికులకు చైర్మెన్ రవీందర్ సింగ్ మేడే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన అసోసియేషన్ కమిటీ సభ్యులు

నవతెలంగాణ-కాప్రా

ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డిని వారి నివాసంలో కుషాయిగూడ వైష్ణవి ఎంక్లేవ్ అసోసియేషన్ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి వారి కాలనీకి తాగునీరు వాటర్ పైప్ లైన్ మంజూరైనందుకుగాను కతజ్ఞతలు తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడు గంప కష్ణ, శ్రీనివాస్, ఈశ్వరయ్య, ఆది విష్ణుమూర్తి, చిన్నారెడ్డి, అంబరీష్ కార్తీక్ ,నారాయణ ,భూపతి వెంకటేష్, వినోద్, శ్యామ్, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.



వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మహోత్సవం



నవతెలంగాణ-కాప్రా

శ్రీమద్ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆరాధన మహోత్సవం సందర్భంగా డాక్టర్ ఏఎస్ రావు నగర్ డివిజన్ భగత్ నగర్ జమ్మిగడ్డ నందు జరిగిన కార్యక్రమంలో బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ట్రస్ట్ ప్రతినిధి గోలి శ్రీనివాస్, పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కమిటీ సభ్యులు ఆనంద్ చారి, రమేశ్ చారి,రాజన్న, శ్రీనివాస్, భార్గవ్ చారి, ఆంజనేయులు చారి, ప్రసాద్ చారి, సంపత్, స్వామి, తిరుమలేయ్యా, భాస్కర్ చారి, పాల్గొన్నారు.

రాజ్యాంగం ద్వారానే సమాజంలో స్వేచ్ఛగా జీవిస్తున్నాం

- బీఆర్ఎస్ కీసర మండల ఉపాధ్యక్షుడు వంగేటి పర్వత్ రెడ్డి

నవతెలంగాణ- మేడ్చల్ కలెక్టరేట్

అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ద్వారానే నేడు సమాజంలో స్వేచ్ఛగా జీవిస్తున్నామని బీఆర్ఎస్ కీసర మండల ఉపాధ్యక్షుడు వంగేటి పర్వత్ రెడ్డి అన్నారు. కీసర మండల అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ప్రతీ ఆదివారం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం కీసర చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి కీసర మండల ఉపాధ్యాయుడు వంగేటి పర్వత్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి జ్ఞానమాల కార్యక్రమంలో పాల్గొని అంబేద్కర్‌కు నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో కులాలు, మతాలు అనే భేదం లేకుండా ప్రతి ఒక్కరూ సమానత్వంతో బతికేలాగా, ప్రతి ఒక్కరికి రాజ్యాంగం ద్వారా ఉద్యోగాలు, పదవులు లభించేలా అంబేద్కర్ కృషి చేశారన్నారు. యువత రాజకీయాల్లోకి వచ్చి నేటి కుల, మత, ధన రాజకీయాలను పారద్రోలాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కీసర మండల అంబేద్కర్ సంఘం అధ్యక్షులు రవీందర్, ప్రధాన కార్యదర్శి దాయర శ్రీనివాస్, గోధుమ కుంట ఎంపీటీసీ మంచాల కిరణ్ జ్యోతి ప్రవీణ్, గంగి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



ఆస్తిపన్ను ఆయిదుశాతం రిబేటు ఆదివారం చివరి రోజు కావడంతో జీహెచ్ఎంసీ బిల్ కలెక్టర్ ఎండీ జహంగీర్ కాప్రా కాలనీ సమైక్య అధ్యక్షులు నాగిరెడ్డి, సంజీవరెడ్డి నుంచి రూ.2 లక్షల 50 వేలు ప్రాపర్టీ టాక్స్ చెక్ తీసుకున్నారు. ఈ సందర్భంగా సంజీవరెడ్డి మాట్లాడుతూ ట్యాక్స్ సకాలంలో చెలించి జీహెచ్ఎంసీ అభివృద్ధికి సహకరించాలని సూచించారు.

నవతెలంగాణ-కాప్రా



వైద్యం సామాన్యులకు అందుబాటులో ఉండాలి

- బీజేపీ జాతీయ నాయకులు మురళీధర్ రావు

నవతెలంగాణ-మల్కాజిగిరి

రాష్ట్రంలో పేదలకు వైద్యం అందుబాటులో ఉండాలని, కార్పొరేట్ స్థాయిలో మెరుగైన వైద్యం అందించాలని బీజేపీ జాతీయ నాయకులు, మదేప్రదేశ్ ఇన్‌చార్జి మురళీధర్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గం మల్కాజిగిరి డివిజన్‌లోని కప కాంప్లెక్స్, ఎల్.బి నగర్ కమ్యూనిటీ హాల్‌లో హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రచార కార్యదర్శి జిల్లెల రవి యాదవ్ సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ మధ్యప్రదేశ్ ఇన్‌చార్జ్ మురళీధర్ రావు హాజరై మాట్లాడారు. రానున్న రోజుల్లో దొరల షడీలకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.



IN THE COURT OF THE HON'BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE, RANGA REDDY DISTRICT : AT : IBRAHIMPATNAM
I.A. No. 1094 of 2022
in
O.S.No. 450 OF 2022

Between:
M/s. Concrete Infra Projects India LLP. And another
....Plaintiffs/Petitioners
AND
K. Maheshwarreddy
.... Respondent

To
Kunduru Maheshwarreddy, S/o. Ramaswamyreddy, Aged about: 42 years, Occ: Business, R/o. Flat No. 1406, Sainath Residency, Ashoka, Liviano, Puppalaguda, Rangareddy Dist., T.S..

NOTICE

The Respondent may please take notice that the above I.A. No. 1094/2022 was filed by the Plaintiffs, through O.S. No. 450/2022 on the file of the Hon'ble Principal Senior Civil Judge, Rangareddy Dist. At: Ibrahimpatnam on **09-06-2023 at 10:30 A.M.** for your appearance. You may appear in person or through pleader or otherwise, the matter will be adjudicated as per the law.

//By the Order of the Hon'ble Court//
M. RAJENDERREDDY
CH. SHANTHA
S. NARASIMHA
Advocates
O/o. G1, 3-6-195/B, Sri Gouri Apartments, Himayat Nagar, Hyderabad.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE, RANGA REDDY DISTRICT : AT : IBRAHIMPATNAM
O.S.No. 450 OF 2022

Between:
M/s. Concrete Infra Projects India LLP. And another
....Plaintiffs/Petitioners
AND
K. Maheshwarreddy
.... Respondent

To
Kunduru Maheshwarreddy, S/o. Ramaswamyreddy, Aged about: 42 years, Occ: Business, R/o. Flat No. 1406, Sainath Residency, Ashoka, Liviano, Puppalaguda, Rangareddy Dist., T.S..

NOTICE

The defendant may please take notice that the above suit was filed by the Plaintiffs, through O.S. No. 450/2022 on the file of the Hon'ble Principal Senior Civil Judge, Rangareddy Dist. At: Ibrahimpatnam on **09-06-2023 at 10:30 A.M.** for your appearance. You may appear in person or through pleader or otherwise, the matter will be adjudicated as per the law.

//By the Order of the Hon'ble Court//
M. RAJENDERREDDY
CH. SHANTHA
S. NARASIMHA
Advocates
O/o. G1, 3-6-195/B, Sri Gouri Apartments, Himayat Nagar, Hyderabad.

IN THE COURT OF HON'BLE X ADDITIONAL CHIEF JUDGE, CITY CIVIL COURTS, AT: HYDERABAD
O.P.NO.426 OF 2022

BETWEEN:
B.SARITHA
And others
....PLAINTIFFS
AND
BANDI SARITHA
And others
.....DEFENDANTS

To
D-4 M.ARUNA, W/o Chandra Shekar, Aged about 55 years, Occ: Housewife, R/o Plot No.48, Tulasi Gardens, Mehrababa Colony, Panchasheel Enclave, Sainikpuri, Secunderabad - 500 087.

The Plaintiffs had filed the above suit for Partition and Separate Possession against the Defendants which includes you in respect of House Property bearing No.4-3-499 to 508, admeasuring 285 sq.yds, situated at Gulbagh, Sultan Bazar, Hyderabad and bounded on **North**: Open Land, **South**: Neighbours House, **East**: Portion of H.no.4-3-499 to 508 allotted to B.Venkaiah, **West**: Neighbours House. The Hon'ble Court was pleased to order for publication of this notice for your appearance in the above suit and the matter is posted to **19.06.2023 at 10.30 a.m.** Therefore you may appear before the Hon'ble Court either personally or through your authorized counsel or otherwise the matter will be adjudicated in due process of Law. Hence, this Notice.

[BY ORDER OF THE COURT]
Sd/-
K.SUNIL CHOWDARY,
B.SAMMESWAR RAO,
B.CHANDRA SHEKAR REDDY,
DIVYA AGRAWAL,
Advocates
H.No.12-2-823/A/38, Santosh Nagar Colony, Mehdipatnam, Hyderabad - 500 028.

IN THE COURT OF HON'BLE X ADDITIONAL CHIEF JUDGE, CITY CIVIL COURTS, AT: HYDERABAD
I.A.NO.1345 OF 2022
IN
O.P.NO.426 OF 2022

BETWEEN:
B.SARITHA
And others
....PETITIONERS/PLAINTIFFS
AND
BANDI SARITHA
And others
.....RESPONDENTS/DEFENDANTS

To
R/D-4 M.ARUNA, W/o Chandra Shekar, Aged about 55 years, Occ: Housewife, R/o Plot No.48, Tulasi Gardens, Mehrababa Colony, Panchasheel Enclave, Sainikpuri, Secunderabad - 500 087.

The Petitioners/Plaintiffs had filed the above suit for Partition and Separate Possession against the Respondents/Defendants which includes you in respect of House Property bearing No.4-3-499 to 508, admeasuring 285 sq.yds, situated at Gulbagh, Sultan Bazar, Hyderabad and bounded on **North**: Open Land, **South**: Neighbours House, **East**: Portion of H.no.4-3-499 to 508 allotted to B.Venkaiah, **West**: Neighbours House. The Petitioners/Plaintiffs had also filed the above I.A.seeking to restrain the Respondents which includes you from alienating, transferring or changing the nature of Petition Schedule Property. The Hon'ble Court was pleased to order for publication of this notice for your appearance in the above I.A and the matter is posted to **19.06.2023 at 10.30 a.m.** Therefore you may appear before the Hon'ble Court either personally or through your authorized counsel or otherwise the matter will be adjudicated in due process of Law.
Hence, this Notice.

[BY ORDER OF THE COURT]
Sd/-
K.SUNIL CHOWDARY,
B.SAMMESWAR RAO,
B.CHANDRA SHEKAR REDDY,
DIVYA AGRAWAL,
Advocates
H.No.12-2-823/A/38, Santosh Nagar Colony, Mehdipatnam, Hyderabad - 500 028.

ముగిసిన ఆర్ట్స్ కళాశాల సాంస్కృతిక లహరి

నవతెలంగాణ-ఓయూ



ఓయూ ఫౌండేషన్ సందర్భంగా ఆర్ట్స్ కళాశాలలో జరిగిన సాంస్కృతిక లహరిలి (కల్చరల్ ఆక్టివిటీస్) కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ.సి.గణేష్ పేర్కొన్నారు. నిరంతరం అకాడమిక్ చదువుల ఒత్తిడితో కాకుండా ఇలాంటి సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాల వల్ల విద్యార్థులకు కొంత ఉపశమనంతో పాటు సృజనాత్మకతను వెలికి తీసే ఆలోచనతో వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అనుపమ, డాక్టర్ బాలు నాయక్, ఫౌండేషన్ కమిటీ చైర్మన్ ప్రొ.కాశీం, ఫౌండేషన్ డే కమిటీ కన్వీనర్ డాక్టర్ కొండా నాగేశ్వర్, డాక్టర్ స్వాతి పాల్గొన్నారు.

'28న శ్యాముల్ విగ్రహావిష్కరణ'

నవతెలంగాణ-హిమాయత్‌నగర్



హెూమియోపతిక్ మెడికల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యాముల్ విగ్రహాన్ని ఈ నెల 28వ తేదీన హిమాయత్‌నగర్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో గల జూపల్లి బాలమ్మ ఆడిటోరియంలో ఆవిష్కరించనున్నట్టు అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ కె.గోపాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి.దుర్గాప్రసాద్ రావు తెలిపారు. ఆదివారం అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన డాక్టర్ ఎన్.రామయ్య స్మారకోపన్యాసంలో వారు మాట్లాడుతూ.. డాక్టర్ శ్యాముల్ హెూమియోపతిక్ వైద్యానికి విశేషమైన సేవలు, ప్రాచుర్యాన్ని కల్పించారని తెలలిపారు. పేదలకు వైద్య సేవలు అందించారని కొనియాడారు. అసోసియేషన్‌ను ఏర్పాటు చేసిన డాక్టర్ శ్యాముల్ అనేక ఉచిత హెూమియో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి పేద ప్రజలకు వైద్య సేవలు అందించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ కో-కన్వీనర్ డాక్టర్ వేణుగోపాల్‌గౌరి, డాక్టర్ సి.వి.స్వామి పాల్గొన్నారు.

బీజేపీని రాకుండా అడ్డుకుంటాం

- సీపీఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి

నవతెలంగాణ-హయత్‌నగర్



భారత కమ్యూనిస్ట్ పార్టీ జాతీయ సమితి పిలుపు మేరకు బీజేపీకి హఠావో దేశ్ కో బచావ్ అనే నినాదంతో ఇంటింటికి సి.పి.ఐ ప్రజాపోరు యాత్ర ముగింపు బహిరంగ సభ హయత్ నగర్‌లో జరిగింది. మండల కార్యదర్శి సామిడి శేఖర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి , రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమకుల జంగయ్య, సి.పి.ఐ. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, ఏఐటీయూసీ జాతియ సమితి సభ్యులు ఉజ్జయిని రత్నాకర్ రావు హాజరయ్యారు. పల్లా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ బిజెపిని అధికారంలోకి రాకుండా అడ్డుకునేందుకు సిపిఐ శాయశక్తిలా కృషి చేస్తుందని అన్నారు. పారిశ్రామిక వ్యవస్థను మరియు వ్యవసాయ రంగాన్ని మోడీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని, అంబేద్కర్ రాజ్యాంగ స్థానంలో మనువాద రాజ్యాంగాన్ని అమలు చేసేందుకు బిజెపి ప్రయత్నాలు చేస్తున్నదని అన్నారు. నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని ధరలను కట్టడి చేయడంలో బిజెపి ప్రభుత్వం వైఫల్యం చెందిందని ఆయన అన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇండ్ల స్థలాలు, డబుల్ బెడ్ రూమ్ ఇల్లు అందించడంలో విఫలమైందని విమర్శించారు. పేద ప్రజలు వేసుకున్న గుడిసెల జోలికి వస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కమ్యూనిస్టులకు సీట్లు ముఖ్యం కాదని ప్రజా పోరాటాలే ముఖ్యం అని మరోసారి ఆయన గుర్తుచేశారు. కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శులు శ్రీదేవి.సత్రు, ఏ.ఐ.ఎస్.ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి సామిడి వంశీ వర్ధన్ రెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు అరుణ్‌కుమార్ గౌడ్ మహిళా సమాఖ్య మండల అధ్యక్ష కార్యదర్శులు సరిత, సుభద్ర, సోమన్న దళితహక్కుల సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు నాగేష్, ప్రజానాట్య మండలి గణేష్, వేణు శాఖా కార్యదర్శులు విమల, సుజాత, కళ్యాణి, అరుణ, పారిజాత, దిపిక, శివజ్యోతి, శ్రీదర్ రెడ్డి, జయంత్,జాని, కృష్ణ, చంటి, సురేందర్, ఆదిలక్ష్మి, రజితతో పాటు పార్టీ శ్రేణులు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

రామకృష్ణమాచార్య బహుముఖ ప్రజ్ఞాశాలి



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

మహాకవి దివంగత డాక్టర్ నందూరి రామకృష్ణమాచార్య బహుముఖ ప్రజ్ఞాశాలి అని ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.వి రమణాచారి అన్నారు. సుల్తాన్ బజార్‌లోని శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయంలో నందూరి రామకృష్ణమాచార్య సాహిత్య పీఠం, నవ్య సాహితీ సమితి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన నందూరి 13వ జయంతి వేడుకలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రముఖ సినీ కవి రసరాజును డాక్టర్ నందూరి రామకృష్ణమాచార్య స్మారక సాహిత్య పురస్కారంతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికార భాషా సంఘం అధ్యక్షులుగా, తెలుగు భాష వికాసానికి వ్యక్తి సాహిత్య ప్రాచుర్యానికి డాక్టర్ నందూరి విశేష సేవలు అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ గౌరీ శంకర్, సాహితీ వేదిక జి.వసుంధర, ఓయూ పూర్వ తెలుగుశాఖ అధ్యక్షులు ఆచార్య మసన చెన్నప్ప, రచయిత్రి చిల్లర భవాని దేవి, కవి ఆచార్య ఫణీంద్ర, ఎం.లక్ష్మి మానస, వేమరాజు, విజయ కుమార్, కె.చక్రపాణి, నందూరి కుటుంబ సభ్యులు గోవిందరాజు, ఆత్మకూరు గాంధీ పాల్గొన్నారు.

శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేత

నవతెలంగాణ-ఓయూ



మాజీ ప్రధాని అటల్ బిహార్ వాజ్‌పేయి ఫౌండేషన్ ద్వారా మేకల కీర్తి హర్ష కిరణ్ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ పొందిన మహిళలు 1200 మందికి రాఘవ గార్డెన్‌లో సర్టిఫికెట్స్‌ను కేంద్ర మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందు ఉన్నారన్నారు. మహిళలకు సహకారం అందిస్తున్న మేకల కీర్తి హర్ష కిరణను అభినందించారు. ఆర్థికంగా, రాజకీయంగా, వ్యాపారంగా మహిళలు ఉండాలని తెలిపారు. నిరుద్యోగుల కోసం మేలో మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని, అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కావ్య కిషన్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు శ్యాంసుందర్ గౌడ్, సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగ పాణి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

'నాదం నాట్యం' యూట్యూబ్ ఛానెల్ ప్రారంభం



నవతెలంగాణ-బంజారాహిల్స్

సుప్రసిద్ధ సంగీతకారులు, స్వరకర్త ఉషాకాంత్‌తో రెండు దశాబ్దాల క్రితం స్థాపించిన ప్రతిష్టాత్మక సంగీత సంస్థ మహతి మ్యూజిక్ అకాడమీ, నూతన యూట్యూబ్ ఛానెల్ "నాదం నాట్యం", అందులో భాగంగా "అన్నార్ వైభవం," పేరుతో తాజా వీడియో ఆల్బమ్‌ను ఆదివారం బంజారా హిల్స్‌లోని పార్క్ హయత్‌లో విడుదల చేసింది. ఈ కార్యక్రమానికి జేఐవీప (జీయర్ ఇంటిగ్రేటెడ్ వేదిక్ అకాడమీ), వరిశోధన, ప్రచురణల డైరెక్టర్ శ్రీమాన్, డాక్టర్ సముద్రాల రంగ రామానుజ చార్యులతోపాటు మై హోమ్ గ్రూప్ చైర్మన్ జె.రామేశ్వరరావు, ఐ ల్యాబ్స్ గ్రూప్ చైర్మన్ సి.శ్రీనిరాజు, హాజరై ప్రారంభించి మాట్లాడారు. సాంప్రదాయ భారతీయ సంగీతాన్ని నృత్య రూపాలను పెద్ద సంఖ్యలో వీక్షకులకు చేరువ చేయడాన్ని దేశ గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని ప్రజల్లో ప్రచారం చేయడాన్ని నాదం నాట్యం యూట్యూబ్ ఛానెల్ లక్ష్యంగా పెట్టుకుందన్నారు. భక్తి సంగీతంతో కూడిన అన్నార్ వైభవం వీడియో ఆల్బమ్‌కు ఉషాకాంత్ స్వరపరచగా మహతి మ్యూజిక్ అకాడమీకి చెందిన విద్యార్థులు అధ్యాపకులు ప్రదర్శించారు.

ఘనంగా అంతర్జాతీయ నృత్య దినోత్సవం

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



అంతర్జాతీయ నృత్య దినోచ్ఛవం సందర్భంగా సిరాజ్ డాన్స్ అండ్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో తెలంగాణ సరస్వత పరిషత్ ఆడిటోరియంలో 200 మంది చిన్నారులు క్లాసికల్ వెస్టన్ డాన్స్‌లతో నృత్యాలు చేశారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా సరస్వతి ఉపాసకులు దైవజ్ఞ శర్మ, తెలంగాణ ఫిలిం ఛాంబర్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ లయన్ వంశీ ప్రతాప్ గౌడ్, శ్రీ వేద ది యూనివర్స్ స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీశ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలు నృత్యంతో పాటు చదువులోనూ ముందుండాలని ఆకాంక్షించారు. చిన్నారులు లక్ష్యం పెట్టుకుని దాని కోసం కష్టపడాలని, గురువులను, తల్లి తండ్రులను గౌరవిస్తూ ముందుకు సాగాలని కోరారు. ఈ సందర్భంగా నృత్య కళాకారులకు మెమెంటో సర్టిఫికెట్ అందించి సన్మానించారు. ఈ వేడుకలకు తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున చిన్నారి కళాకారులు తరలివచ్చి వారి నృత్య ప్రదర్శనను ప్రదర్శించారు. వారి నృత్యాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో చిన్నారి కళాకారుల తల్లిదండ్రులకు సిరాజ్ మాస్టర్ ధన్యవాదాలు తెలిపారు.

బ్యాంకు కాలనీ అభివృద్ధికి పాటుపడుతా



నవతెలంగాణ-సిటీబ్యూరో

బ్యాంకు కాలనీ ప్రజలకు అందుబాటులో ఉంటూ.. కాలనీ అభివృద్ధికి పాటుపడతానని నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు బొద్దు వెంకటేశ్వర రావు తెలిపారు. ఆదివారం మల్లాపూర్‌లోని బ్యాంక్‌కాలనీ కమిటీ హాల్‌లో కాలనీ అసోసియేషన్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కాలనీ సమస్యలు, అభివృద్ధిపై చర్చించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బొద్దు వెంకటేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాస్ నాయుడు, జనరల్ సెక్రెటరీగా బి.అంజయ్య, ట్రెజరర్‌గా శివశంకర్ ఎన్నికయ్యారు. అనంతరం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. నూతన డెవలప్‌మెంట్ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. ఈ సమావేశంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

75 ఏండ్లుగా విద్యాభివృద్ధి

నవతెలంగాణ-ధూల్‌పేట్

ఎంతో మంది పేద, మధ్య తరగతి విద్యార్థులకు 75 ఏండ్లుగా ప్రభోధ్ విద్యా సమితితో విద్యను అందిస్తూ విద్యాభివృద్ధికి కృషి చేస్తుందని ఆ స్కూల్ ప్రధాన కార్యదర్శి వరద జ్ఞానేశ్వర్ గౌడ్ అన్నారు. రహీంపుర కాగజ్ గూడలోని ప్రభోధ్ విద్యా సమితి హైస్కూల్ ఇంగ్లీష్ మీడియంతో నూతనంగా తరగతులను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. పేద, మధ్యతరగతి వెనుకబడిన తరగతుల ప్రజలకు విద్యను అందించడమే ధ్యేయంగా ఈ సమితిని ఏర్పాటు చేశామన్నారు. ఎంతో మంది నిరుపేద కుటుంబాలు, మురికివాడలో ప్రజలను విద్యావంతులను చేశామని తెలిపారు. ఇప్పటివరకు తెలుగు మీడియంతో కొనసాగించామని, ప్రస్తుత కాలానుగుణంగా అన్ని తరగతుల విద్యార్థులు ఇంగ్లీష్‌లో రాణించేలా తీర్చిదిద్దేందుకు నూతనంగా ఇంగ్లీష్ మీడియంతో తరగతులు ప్రారంభించామని వివరించారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షులు జీవన్ ప్రకాష్ రావు, ఉపాధ్యక్షులు గోడిశాల నరేష్‌గౌడ్, ఏ.ప్రతాపరెడ్డి, ప్రదీప్‌కుమార్, కోశాధికారి కె.మోహన్‌గౌడ్, సభ్యులు మాచిపాటి సదానందం గుప్తా, గోవిందరావు, బాలరాజు గౌడ్, బలెన్ గౌడ్, జాన్ దివాకర్ రావు, వరప్రసాద్, తోట శ్రవణ్ కుమార్, జి.ప్రమోద్ కుమార్, రంజిత్ కుమార్, రాజ్ కుమార్ ముదిరాజ్, రామనాథం, పగడాల అశోక్, లక్ష్మీనారాయణ పద్మ పాల్గొన్నారు.



సక్సెస్ కావాలంటే భిన్నంగా ఉండాలి

నవతెలంగాణ-అంబర్‌పేట



మీరు జీవితంలో విజయవంతం కావాలంటే, సక్సెస్ సాధించాలంటే ఇతరుల కంటే భిన్నంగా ఉండాలని చీఫ్ గెస్ట్ డాక్టర్ అజయ్ అగర్వాల్ అన్నారు. నేషనల్ ప్రెసిడెంట్ ఇంటర్నేషనల్ ఛాంబర్ ఆఫ్ పబ్లిక్ రిలేషన్స్ వైస్ చైర్మన్ వరల్డ్ కమ్యూనికేషన్ కౌన్సిల్ అండ్ ఎక్స్ హెడ్ కార్పొరేట్ కమ్యూనికేషన్స్ సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదివారం బేగంపేట టూరిజం ప్లాజా హెూటల్లో జరిగిన వారివి బిజినెస్ గ్రూప్ మీటింగ్‌లో సభ్యులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. మీరు మాత్రమే సంస్థకు భ్రాండింగ్ తీసుకురాగలరని, దాని కంటే సీఎస్ఆర్ చాలా ముఖ్యమైనదన్నారు. వ్యాపారంలో విజయవంతంగా నిర్వించడానికి అనేక విషయ మంత్రిట్కాలను కూడా చెప్పారు. పబ్లిక్ రిలేషన్స్ కొత్త విషయం కాదని, ప్రతి ఒక్కరూ దాని ప్రాముఖ్యతను గుర్తించకుండా పీఆర్ చేస్తారని తెలిపారు. అంతకుముందు సూర్యదేవ్ ప్రసాద్ ముఖ్య అతిథిని సభకు స్వాగతం పలికారు. అనంతరం రాజు, సురేష్, నరేష్‌తో పాటు కొత్త ప్రెసిడెంట్‌గా నియమితులైన మారుతీ గుప్తా, కొత్త టీమ్ సభ్యులు కూడా మాట్లాడారు.

సాలార్జంగ్ మ్యూజియంలో మన్ కీ బాత్

నవతెలంగాణ-ధూల్‌పేట్



సాలార్జంగ్ మ్యూజియంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మన్ కీ బాత్ 100వ ఎపిసోడ్ కార్యక్రమాన్ని మ్యూజియం వెస్ట్రన్ బ్లాక్‌లో నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి ఫిరాసత్ అలీ బాక్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నాదెండ్ల భాస్కరరావు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేసిన పలు కార్యక్రమాలను వివరించారు. ప్రధాన మంత్రి మోడీ ఎపిసోడ్‌ను తిలకించారు. ఈ కార్యక్రమంలో మ్యూజియం డైరెక్టర్ డాక్టర్ నాగేందర్ రెడ్డి, డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సుధారాణి, ఉస్మానియా యూనివర్సిటీ ఉర్దూ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ అంజుమ్ ఉన్నిసా బేగం, డాక్టర్ రైనా జైస్వాల్ పాల్గొన్నారు.

మల్లికార్జున ఖర్గేను కలిసిన గొంటి కుమార్ చౌదరి యాదవ్



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

కర్ణాటక 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తూ బెంగళూరు సౌత్ కె.ఆర్.పురం అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి డి.కె.మోహన్ బాబుకు మద్దతుగా ఎన్నికల ప్రచారంలో ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేను తమ పార్టీ కర్ణాటక ఇన్‌చార్జి లక్ష్మణ్ యాదవ్ తో పాటు మర్యాదపూర్వకంగా కలిసినట్టు సమైక్యాంధ్ర పరిరక్షణ సమితి జాతీయ అధ్యక్షుడు గొంటి కుమార్ చౌదరి యాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీజేపీ నాయకులు చేసిన మంచి పనులు, నిజాయితీ లేదని, కొంత మంది ప్రజలు చేసిన సేవ ఏంటని, బీజేపీ ప్రజలకు వివరించి ఓట్లు అడిగితే బాగుంటుందన్నారు. అలా కాకుండా ఉదయం నిద్ర లేచినప్పటి నుంచి రాత్రి నిద్రపోయే వరకు మోడీ ముఖం చూసి బీజేపీకి ఓట్లు వెయ్యండి అంటూ అడుక్కుంటున్నారని ఎద్దేవ చేశారు. కర్ణాటకలోని ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ వ్యతిరేకంగా ఓటు వేయాలని ఇప్పటికే నిర్ణయించుకున్నారని, ఈ విషయం తెలిసి ప్రధాని మోడీ, అమిత్ షా ముఖాలను అడ్డం పెట్టుకుని లబ్ది పొందాలనికి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో వీరి ఎత్తుగడలు సాగవన్నారు.

'దళితబంధు' కమీషన్‌లు తిరిగి ఇవ్వాలి



నవతెలంగాణ-ఓయూ

దళిత బంధులో కమీషన్లు తీసుకుంటున్న ఎమ్మెల్యేలు, వారి అనుచరులు తిరిగి ఆ దళితులకు అందించాలని, లేదంటే ఈ నెల 16వ తేదిన భవిష్యత్ కార్యాచరణ ప్రకటించి మరో పోరాటానికి పిలుపునిస్తామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్, జాతీయ అధ్యక్షులు మేడి పాపన్న డిమాండ్ చేశారు. ఓయూ గెస్ట్ హౌస్‌లో కోర్ కమిటీ సమావేశం నిర్వహించిన అనంతరం మాట్లాడారు. దళితబంధు మీద పూర్తిస్థాయి అధ్యయనం చేసిన కేసీఆర్ ఆ దళితులకు అండే విధంగా కనీసంగా వ్యవహరించాలని కోరారు. త్వరలో దళితబంధులో నియోజకవర్గానికి 1500 మందికి (యూనిట్లు) అందించాలని డిమాండ్ చేశారు. దళితబంధులో ఎమ్మెల్యేల ప్రమేయాన్ని పూర్తిగా తొలగించి పారదర్శకంగా కలెక్టర్ల ఆధ్వర్యంలో అర్హుల ఎంపిక జరగాలని కోరారు. దళిత బంధు కమీషన్లను తిరిగి ఇవ్వకపోతే కార్యాచరణ ప్రకటించి మరో ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు కొంద్ర శంకర్, గుర్రాల శ్రీనివాస్, బల్లర్ హసన్, రేగుంట నాంపల్లి, పొట్ట పెప్పర రమేష్, చింతలపు, మంచాల యాదగిరి పాల్గొన్నారు.



రాష్ట్ర సచివాలయానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరు పెట్టడం హర్షనీయం అని, ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మౌలిక సదుపాయాల సంస్థ (టీఎస్ఐఐసీ) చైర్మన్ గ్యాదరి బాలమల్లును కలిసి శాలువాతో ఘనంగా సన్మానించిన నరసింహారావు, జి.నరేష్, నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



నూతన సచివాలయంలో ఆదివారం అన్ని శాఖల మంత్రులతో కలిసి ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పుష్పగుచ్ఛం ఇచ్చి వారికి ధన్యవాదాలు తెలిపారు.
నవతెలంగాణ-బంజారాహిల్స్

చక్రిధర్‌గౌడ్ దంపతుల అక్రమ అరెస్ట్ అప్రజాస్వామ్యం

నవతెలంగాణ-అడిక్‌మెట్

చక్రిధర్‌గౌడ్ దంపతుల అక్రమ అరెస్ట్ అప్రజాస్వామ్యం అని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పల్లగొర్ల మోదీరాందేవ్ అన్నారు. ఆదివారం విద్యానగర్ బీసీ భవన్‌లో బీసీ విద్యార్థి సంఘం నాయకుల సమావేశానికి హాజరై ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా రైతులను ఆదుకుంటున్న బీజేపీనేత చక్రధర్‌గౌడ్ దంపతులను అరెస్టు చేయడం అప్రజా స్వామికం అన్నారు. వెయ్యి మంది రైతు కుటుంబాలకు పంట నష్టపోయి చనిపోయిన వారికి రూ.లక్ష చొప్పున పరిహారం అందించి ఆకాల వర్షాలతో రైతులు ఇబ్బంది పడుతున్న దున తాత్కాలిక అందించి తన ట్రస్టు ద్వారా అనేకమంది విద్యార్థులు చదివిస్తూ కార్మికులను కర్షకులను ఆదుకుంటున్న ప్రతి ఒక్కరిని ఆదుకుంటున్న వ్యక్తిని అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్య అని, దీన్ని బీసీ విద్యార్థి సంఘం ఖండిస్తుందని తెలిపారు. బహుజన నేతలు బీసీ నేతలు పై ఇ ఇలా అక్రమ అరెస్టులు చేస్తే రానున్న రోజుల్లో ప్రజలే ఈ ప్రభుత్వానికి బుద్ది చెప్తారన్నారు. ప్రజల్లో ఉండే నేతలను అరెస్ట్ చేస్తే ప్రజలు ప్రభుత్వానికి దిగజారిపోతుందని, వెంటనే చక్రధర్ గౌడ్ దంపతులను విడుదల చేయాలని, లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేస్తాం అన్నారు. సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం నేతలు బెల్లి మంజునాథ్, ప్రభాకర్ రెడ్డి, శ్రీకాంత్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.



దళితబంధులో అవినీతికి పాల్పడ్డ ఎమ్మెల్యేల చిట్టా బహిరంగపర్చాలి

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



దళిత బంధు పథకంలో లబ్దిదారుల వద్ద రూ.2 నుంచి రూ.3 లక్షలు తీసుకున్న ఎమ్మెల్యేల చిట్టాను రాష్ట్ర ప్రజల ముందు బహిరంగపరచాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవింద నరేష్ డిమాండ్ చేశారు. ఆదివారం బషీర్ బాగ్ వద్ద డాక్టర్ బాబు జగ్జీవన్ రాం విగ్రహం ఎదుట నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గోవింద నరేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతిరహిత పాలనను అందిస్తామని, కన్ను కొడుకు తప్పు చేసినా సహించేది లేదని మాట్లాడిన సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అత్యంత పేద వాళ్లు అయిన దళితుల నుంచి లంచం తీసుకుంటుంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. అవినీతి ఎమ్మెల్యేల చిట్టా ఉందని మాట్లాడుతున్న సీఎం ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోకుండా కేవలం హెచ్చరిక చేసి వదిలేయడంతో అవినీతిని ప్రోత్సహిస్తున్నట్లుగానే ఉందని తెలిపారు. తక్షణమే దళిత బంధులో అవినీతి చేసిన ఎమ్మెల్యేలను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేల చిట్టా బయటపెట్టేంత వరకు పోరాటం ఆగదని, ఈ నెల 2 నుంచి 9వ తేదీ వరకు అన్ని నియోజకవర్గాల్లో నిరాహారదీక్షలు చేపడతామని, 10న వేలాది మందితో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కలెక్టరేట్లను దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీ గోషామహల్ ఇన్‌చార్జ్ పి.రవి, ఎమ్మెస్ ఎఫ్ జాతీయ అధ్యక్షుడు సోమశేఖర్, ఎంఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జి పిఎస్ రాజు, ఎంఎస్ఎఫ్ జాతీయ నాయకులు జేపీ లత, ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ బుషిపాక గణేష్, ఎమ్మెస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామారావు శ్రీనివాస్, జిల్లా కో-ఇన్‌చార్జ్ నరసింహారావు పాల్గొన్నారు.

రెసొనెన్స్ జూనియర్ కాలేజీ విద్యార్థుల హవా

నవతెలంగాణ-అంబర్‌పేట



ఆలిండియా జేఈఈ మెయిన్స్ 2023లో రెసొనెన్స్ జూనియర్ కాలేజ్ విద్యార్థులు చరిత్ర సృష్టించారు. కాలేజీకి చెందిన నలుగురు విద్యార్థులు 100శాతం, 46 మంది విద్యార్థులు 99శాతం కంటే ఎక్కువగా మార్కులు సాధించారు. మాదాపూర్‌లోని రెసొనెన్స్ జూనియర్ కాలేజీలో రెసొనెన్స్ హైదరాబాద్ కేంద్రాల డైరెక్టర్ పూర్ణచంద్రరావు అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం నలుమూలల నుంచి 5,700 మంది రెసొనెన్స్ విద్యార్థులు అడ్వాన్స్‌డ్ పరీక్షకు అర్హులు అని, ఒక్క హైదరాబాద్ నుంచి 750 మంది విద్యార్థులు అడ్వాన్స్‌డ్ పరీక్ష రాయడానికి అర్హత సాధించారని తెలిపారు. 45 మంది విద్యార్థులు 99శాతం, అంతకంటే ఎక్కువ సాధించారని చెప్పారు. ఇది రెసొనెన్స్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు అఖండ విజయం అని తెలిపారు.

మ్యాన్ హెూల్స్‌పై దృష్టి సారించండి : గడ్డం సాయికిరణ్



నవతెలంగాణ-అంబర్‌పేట

మ్యాన్ హెూల్స్‌పై అధికారులు దృష్టి సారించాలని తెలంగాణ రైజింగ్ యూత్ ఫోర్స్ రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం సాయికిరణ్ అన్నారు. ఆదివారం హబ్సిగూడ డివిజన్ రాంరెడ్డి నగర్, వెంకటరెడ్డి నగర్, శ్రీనివాసపురం కాలనీల్లో సాయి కిరణ్ స్థానికులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మ్యాన్ హెూల్ గుంతలు, మూతలు 50కి పైగా భయంకర దశలో విరిగిపోయి నోరు తెరచి ఉండటం, పూర్తిగా శిథిలం అవ్వడం పట్ల స్థానికులు భయాందోళనకు గురవుతున్నారన్నారు. గతంలో జీహెచ్ఎంసీ ఎన్నికల ముందు నగరంలో గుంతల కనపడితే రూ.వెయ్యి బహుమతి అని ప్రకటించిన ఇప్పటి వరకు ఇక్కడ మాసినా నగరంలో గుంతలే దర్శనమిస్తున్నాయన్నారు. ఇటీవల జరిగిన దుర్ఘటనలను దృష్టిలో ఉంచుకుని అధికారులు మేల్కొనాలన్నారు. ఈ సమస్యలను వెంటనే కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించి బాధ్యత తీసుకుంటానని స్థానికులకు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో రాంరెడ్డినగర్ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి నాగరాజు, వెంకన్న, వెంకటరెడ్డి నగర్ కమిటీ అధ్యక్షుడు రాగి వెంకట్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, అయిల సుధాకర్, అనిల్ గౌడ్, దారం వెంకటేష్ గుప్తా, నవీన్ రెడ్డి, రఘు రెడ్డి, పరమేష్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గానికి ఎమ్మెల్యే అభినందనలు



నవతెలంగాణ-అంబర్‌పేట

అంబర్‌పేట వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో అంబర్‌పేట వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షులు పుండరి చారి, ప్రధాన కార్యదర్శి ఆకుల శ్యామ్, కోశాధికారి మహేందర్, సంఘం నాయకులు అబ్బాయ్ గౌడ్, లక్ష్మణ్, తిరుమలేష్, రామన్ రాజ్, ప్రవీణ్, రమేష్ పాల్గొన్నారు. సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నారాయణ రెడ్డి అంత్యక్రియలు

నవతెలంగాణ-అంబర్‌పేట



అశ్రునయనాల మధ్య బీఆర్ఎస్ అంబర్ పేట ఇన్‌చార్జి ఎడ్ల సుధాకర్ రెడ్డి తండ్రి నారాయణ రెడ్డి అంత్యక్రియలు ఆదివారం అంబర్ పేట స్మశాన వాటికలో ముగిశాయి. కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి, బాగ్ అంబర్ పేట కార్పొరేటర్ బి.పద్మ వెంకటరెడ్డి నివాళులర్పించారు. అంతిమయాత్రలో వివిధ పార్టీల నాయకులు, కుటుంబ

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



నవతెలంగాణ-మేడ్చల్

షార్ట్ సర్క్యూట్ తో ఇల్లు దగ్ధమైన సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది.స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం మండల పరిధిలోని రావల్ కోల్ గ్రామానికి చెందిన తలారి బిక్షపతి ఆదివారం ఉదయం 6గంటల ప్రాంతంలో తన కూతురు ఇంటికి బయలుదేరి వెళ్ళాడు. కాగా ఉదయం 8గంటల ప్రాంతంలో ఇంట్లో షార్ట్ సర్క్యూట్ జరిగి ఇల్లు పూర్తిగా మంటల్లో దగ్ధమైంది.ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు.లక్ష రూపాయల నగదు మంటల్లో దగ్ధమై, రూ. 3 లక్షల ఆస్తి నష్టం జరిగినట్టుగా ఫైర్ అధికారులు తెలిపారు.

మద్రాస్ ప్రీమియం కాఫీ షాప్ ప్రారంభించిన భరత సింహారెడ్డి



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 132 జీడిమెట్ల డివిజన్ పరిధిలోని జీడిమెట్ల పైప్ లైన్ రోడ్ లో సతీష్ చక్రవర్తి నూతనంగా ఏర్పాటు చేసిన మద్రాస్ ప్రీమియం కాఫీ షాప్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి రిబ్బన్ కట్ చేసి షాప్ ను ప్రారంభించి, సతీష్ కి శుభాకాంక్షలు తెలియజేసిన బిజెపి మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత సింహారెడ్డి.ఈ కార్యక్రమంలోనార్లకంటి దుర్గయ్య , గోపాల్ రెడ్డి, రాజగోపాల్, శంకర్ జయదేవ్, నవీన్ రెడ్డి, వెంకటరమణ, రిషికేష్, రోహిత్ , ప్రణీత్ ,అజయ్, డింగు , వినోద్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డాలపై నిత్యం భవన నిర్మాణ కార్మికుల అవస్థలు..!

- రోజువారీ పనులు లేక దినసరి కూలీల పస్తులు..!!



నవతెలంగాణ - బాలానగర్

రెక్కాడితే గానీ డొక్కాడని అడ్డా కూలీలు, వలస కార్మికుల జీవితాలు వర్షాల కారణంగా ఛిద్రమైపోతున్నాయి. రోజూవారీ కూలిపనులతో పొట్టనింపుకొనే వారి బతుకులు వర్షాల ముసురుతో గంజినీళ్ల కూడా తాగలేని దుస్థితికి చేరుకున్నాయి. ఇంటికే పరిమితం కావడం వల్ల రోజు కూలీ దొరకడమే గగనమైన తరుణంలో ఏ పనులు లేకపోవడంతో మూలిగే నక్కపై తాటికాయ పడిన చందంగా మారింది పరిస్థితి. అటు కూలీ దొరకక, ఇటు కుటుంబాన్ని పోషించుకోలేక కూలీలు అగచాట్లు ఎదుర్కొంటున్నారు. పొద్దంతా కష్టపడితే అంతో ఇంతో వచ్చేదని, గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా అడ్డాల పైన భవన నిర్మాణ కార్మికులు అల్లాడి పోతున్నారు. ఇటీవల నిత్యం వర్షాలు పడుతుండడంతో నిర్మాణ పనులు నిలిచిపోయి ఇతరత్రా పనుల కోసం అడ్డాలపై కూలీలు పడిగాపులు కాస్తున్నారు. సాధారణ రోజుల్లోనే వారి బతుకులు అంతంత మాత్రమే... కండ్లల్లో ఆశలు.. కడుపులో ఆకలితో బతుకు తెరువు కోసం దినసరి కూలీలు రోడ్లపై తాత్కాలిక అడ్డాలలలో ఎండకు ఎండుతూ, వర్షాలకు తడుస్తూ, చలికి వణుకతూ కష్టజీవులు ఆకలికేకలతో అల్లాడుతూ అవస్థలు పడుతున్నారు.ఒడిస్సా,బీహార్, బెంగాల్, మధ్యప్రదేశ్,చత్తీస్ ఘడ్, కర్ణాటక తదితర రాష్ట్రాల నుండేగాక మహబూబ్ నగర్, మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్, నల్లగొండ తదితర జిల్లాల నుంచి హైదరాబాద్ నగరానికి వలస వచ్చి లక్షలాది మంది కూలీలు నగర నలుమూలల్లో తాత్కాలిక నివాసాలు ఏర్పరచుకుని జీవన పోరాటం సాగిస్తున్నారు. అయితే ఈ సంవత్సరం ఎన్నడూ లేనంతగా 43 డిగ్రీలతో ఎండలు విపరీతంగా వడగాలులు వీస్తూ ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. దీంతో ఏ రోజు కారోజు వచ్చే కూలి డబ్బులపై ఆధారపడి బతికే కూలీలకు పనుల్లేక పస్తుండాల్సిన పరిస్థితి నెలకొంది. అలాగే వీరంతా 5 రోజులుగా ఇంకా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిరు వ్యాపారాలు చేస్తూ, కుటుంబాలను పోషించుకునే వారికి గిరాకీ లేక విలవిల్లాడుతున్నారు. గత 20, 30 ఏండ్లలో ఎన్నడూ ఇలా చూడలేదంటున్నారు. అత్యవసరమైతే తప్ప ఎవరూ బయటికి రావడంలేదు. చిన్న పరిశ్రమలు మూతపడటంతో కార్మికులు ఇండ్లకే పరిమితమయ్యారు. నిర్మాణ పనులు నిలిచిపోవడం రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది భవన నిర్మాణ కార్మికులు, కూలీలు ఉపాధికి దూరమయ్యారు. వివిధ రాష్ట్రాలు, జిల్లాల నుంచి హైదరాబాద్‌కు వలస వచ్చిన కూలీలు పనిలేక అల్లాడుతున్నారు. రోడ్ల వెంట పూలు, పండ్లు, టీ, టిఫిన్, జ్యూస్ అమ్ము కునే వ్యాపారులకు గిరాకీ లేకుండా పోయింది. మండుతున్న ఎండల్లో రాజధాని పరిసర ప్రాంతాల్లో లక్షల మందికి ఉపాధి కరవైంది. వివిధ పరిశ్రమలతోపాటు మిగిలిన రంగాల్లో దాదాపు 30 లక్షల కార్మికులు పని చేస్తుంటారని అంచనా. వీరిలో చాలామంది రోజువారీ వేతనం మీదే జీవనం సాగిస్తున్నారు. నిర్మాణ రంగంలో పని చేస్తున్న ఐదు లక్షల మంది కార్మికులకు పనిలేకపోవడంతో గత కొద్దిరోజులుగా మద్య వయసు వారు ఇండ్ల దగ్గరే ఉండాల్సి వస్తోంది. చిన్నపరిశ్రమలు ఇతరత్రా వాటిలో పని చేసే లక్షలమంది కార్మికులపై కూడా ఎండలు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. దీంతో రోడ్లపై చిరు వ్యాపారులను సైతం ఎండలు భయపెడుతున్నాయి. బల్దియా అధికారుల లెక్కల ప్రకారం నాలుగు లక్షల మంది చిరు వ్యాపారులు ఉన్నారు. నాలుగు రోజులుగా పలు ప్రధాన రోడ్లు ఖాళీగా దర్శన మిస్తున్నాయి. అలాగే నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో పేద, మధ్య తరగతి కుటుంబాల వారు అల్లాడుతున్నారు. ఇప్పటికే అప్పుల భారంతో సతమతమవుతున్న పేద కుటుంబాలు విద్య, వైద్యం, అత్యవసర పనులకు అప్పులు చేసిన ప్రజలు ప్రస్తుతం పూటగడవడానికే అప్పులు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడు తున్నాయి. చేతిలో చిల్లిగవ్వ లేక అప్పులు చేస్తూ ఇండ్లు గడుపుకుంటున్నారు. పనులు లేకపోవడంతో జీహెచ్ఎంసీ నిర్వహిస్తున్న రూ.5 ల అన్నపూర్ణ భోజనం తిని మరోపూట పస్తులతో కాలం గడుపుతుండడం గమనార్హం.

కార్మికులను వెల్ఫేర్ బోర్డు నుండి ఆదుకోవాలి..



నగరంలో అకాల వర్షాలు ఒకవైపు మండేఎండలు మరోవైపు దీంతో పనులు లేక భవన నిర్మాణ కార్మికులు అవస్థలు పడుతున్నారు. ఇతరత్రా పనులు కూడా ఎవరూ ఇవ్వకపోవడంతో వారి కుటుంబాలు జీవనోపాధి లేక అర్థాకలితోఅలమటిస్తున్నారు. దిక్కు తోచని దినసరి కూలీల వారి కుటుంబాల్లో పిల్లలను చదివించుకోలేక, ఇంటి కిరాయిలు కట్టుకోలేక నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో పండుగ, పబ్బాలకు ఏంకొనలేక, ఏంతినలేక పచ్చడి మెతుకులతోనే కాలం గడుపుకుంటున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వెల్ఫేర్ బోర్డు నుంచి డబ్బును ఇతరత్రా వాటికి మళ్లించకుండా ఒక రోజు పని దొరికితే మరురోజు పనులు లేక ఇబ్బంది పడుతున్న భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

-ఐలాపురం రాజశేఖర్

ఆర్కే ఆస్పత్రి ఆధ్వర్యంలో డబిల్‌పూర్‌లో ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-మేడ్చల్

గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నదే ఆర్కే హాస్పిటల్ ముఖ్య ఉద్దేశమని ఆర్కే హాస్పిటల్ వైద్యులు తెలిపారు.ఆదివారం మేడ్చల్ మండల పరిధిలోని డబిల్ పూర్ గ్రామంలో ఆస్యప్రాణకిష్ణ ఫౌండేషన్ సౌజన్యంతో కొంపల్లిలోని ఆర్కే హాస్పిటల్ వారు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.ఈ వైద్య శిబిరంలో 100 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు.ఈ సందర్భంగా డాక్టర్ అనుదీప్ మాట్లాడుతూ వైద్య శిబిరానికి మంచి స్పందన వచ్చిందని తెలిపారు.ఈ వైద్య శిబిరానికి సహకరించిన గ్రామ సర్పంచ్ గీత భాగ్యరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.సర్పంచ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో వైద్య పరీక్షలు నిర్వహించాలన్న గొప్ప సంకల్పంతో ముందుకు వచ్చిన ఆర్కే హాస్పిటల్ యాజమాన్యాన్ని,వైద్యులను అభినందించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్లు అనిగ్ధా సౌందర్య,సాయి కృష్ణారావు, పవన్ కుమార్, ఉప సర్పంచ్ సత్యనారాయణ, కో ఆప్షన్ సభ్యులు గౌస్,వార్డు సభ్యులు దామోదర్ రెడ్డి,రేణుక, నాయకులు భాగ్యరెడ్డి,అశోక్, గంగారామ్,రాజశేఖర్ పాల్గొన్నారు.

కూకట్ పల్లి డివిజన్ కాంగ్రెస్ కమిటీ నియామకం



నవతెలంగాణ - కూకట్‌పల్లి

కూకట్ పల్లి నియోజకవర్గ పరిధిలోని కూకట్ పల్లి 121 డివిజన్ కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ మేకల రమేష్, డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ గోవింద్ గౌడ్ ఆధ్వర్యంలో, కూకట్పల్లి డివిజన్ కాంగ్రెస్ కమిటి నియామకం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా గుడేపు నాగ రాజు , జ్యోతి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజే శారు. డివిజన్ జెనరల్ సెక్రెటరీ గా గురుమూర్తి, వైస్ ప్రెసిడెంట్స్ పాపా రావు తలారి భాను చందర్, రమణా, చేగురి నరేందర్, దీపక్ జాయింట్ సెక్రటరీ సింగురి మహేందర్, బొట్టు రాజు ,ఆర్గనైజింగ్ సెక్రటరీ మనోజ్ గౌడ్, జీవన్, సత్యనారాయన, మేఘా ఎస్ సి సెల్ ప్రెసిడెంట్ అనిల్ కిషోర్ ,బి సి సెల్ ప్రెసిడెంట్ దుసకంటి కళ్యాణ్, మైనారిటి సెల్ ప్రెసిడెంట్ ఎండీ. కరీం లకు నియామక పత్రాలు అందజేశారు.

ఓటరు నమోదు, సవరణ సమస్యలను నివృత్తి చేసుకోవాలి

నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి , కుత్బుల్లాపూర్ డిసిలు మున్సిపల్ కార్యాలయంలో వివిధ పార్టీల నేతలతో రాబోయే ఎన్నికల దృష్ట్యా కొత్తగా ఓటరు నమోదు , సవరణల సమస్యలపై శనివారం సమావేశం నిర్వహించారని, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రజలందరూ తమ ఓటు సమస్యలపై నివృత్తి చేసుకోవచ్చని మేయర్ కొలను నీలా గోపాల్ రెడ్డి తెలిపారు. ఓటు సమస్యలపై ఇంటి నంబర్ మార్పు, పేరు సవరణ, వయస్సు తప్పులు మొదలైనవాటిని ఫారమ్ - 8 ద్వారా హార్డ్ కాపీ లేదా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయడం ద్వారా మార్చవచ్చు, ఇందుకు మే 10 2023 చివరి తేదీ అన్నారు. అలాగే కొత్త ఓటర్లు కూడా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కావున ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోగలరని మేయర్ తెలిపారు.



కూర్మ సంఘానికి చెందిన శ్రీ సాయి బాబా మిని ట్రాన్స్ పోర్ట్ అసోసియేషన్ , యూనియన్ సభ్యుల ఆధ్వర్యంలో వాయుపురిలోని అమ్మవారి గుడిలో ఆదివారం కళ్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మీ హాజరయ్యారు. బీజేపీ డివిజన్ అధ్యక్షులు ఓం ప్రకాష్, మహిళా మోర్చా అధ్యక్షురాలు సుశీల డివిజన్ ఉపాధ్యక్షు లు సాయి సురేష్, సూర్యకాంత్, శ్రీ సాయి బాబా మిని ట్రాన్స్ పోర్ట్ అసోసియేషన్ అధ్యక్షులు గవ్వల యాదగిరి, ఉపాధ్యక్షులు, బుగ్గ మల్లేష్, ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి, క్రిష్ణ,సహాయ కార్యదర్శి, వెంకటేష్, కోశాధికారి సిద్దులు పాల్గొన్నారు.

సెక్రటేరియట్‌కు అంబేద్కర్ పేరు పెట్టడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ పాలాభిషేకం



నవతెలంగాణ - కూకట్ పల్లి

తెలంగాణ రాష్ట్రాన్ని అద్భుతమైన ప్రగతి పథంలో నడిపిస్తూ, తెలంగాణ ప్రతిపత్తిని చాటే విధంగా నిర్మితమైన నూతన సచివాలయ భవనానికి, మహనీయులు డా.బి.ఆర్. అంబేద్కర్ పెట్టిన ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు నిర్ణయానికి హర్షం వ్యక్తం చేస్తూ, నేడు వారి చేతుల మీదుగా ప్రారంభం కానున్న నేపథ్యంలో మూసాపేట్ డివిజన్ గూడ్స్ షెడ్ రోడ్డు లో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కర్క రవీందర్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో, మాజీ కార్పోరేటర్ తూము శ్రావణ్ కుమార్ పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.అనంతరం అంబేద్కర్ విగ్రహానికి, కేసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డా.బి.ఆర్. అంబేద్కర్ వ్రాసిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ద్వారా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు అభివద్ధి, సంక్షేమ పాలన చేస్తూ తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీకగా, రాజసం ఉట్టిపడేలా వినూత్న రీతిలో నిర్మించిన పరిపాలన సౌధానికి మహనీయులు డా.బి.ఆర్ అంబేద్కర్ పేరు పెట్టడం పట్ల కతజ్ఞతలు తెలియజేశ ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్, సీనియర్ నాయకులు జిల్లా గోపాల్, మల్లేష్, శ్రీనివాస్, సుందర్, బాలరాజు గౌడ్, కర్క శివ శంకర్, జెల్ల రాము, తుకారాం, విష్ణు, ఇనుగంటి రాజు, రవి సింగ్, వెంకటస్వామి, సత్యనారాయణ, రాము, రమేష్, కష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆల్విన్ కాలనీ డివిజన్ సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శ్రీకారం



నవతెలంగాణ - కూకట్‌పల్లి

కూకట్ పలి పరిధిలోని సాయి నగర్ వెస్ట్, ఆల్విన్ కాలనీ ఫేస్ 1,తులసి నగర్, పాపమ్మ బస్తీ, మహంకాళి నగర్ , పి వి ఆర్ సాయి హిల్స్ కాలనీ లలో రూపాయలు.1.35 ఒక కోటి ముప్పై ఐదు లక్షల అంచనావ్యయం తో చేపట్టబోయే సీసీ రోడ్ల నిర్మాణ పనులకు కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని శంకుస్థాపన చేసిన ప్రభుత్వ విప్ అరికెపూడి గాంధీ.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ , ప్రతి కాలనీ లో అన్ని రకాల మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నాంఅని,సంక్షేమం,అభివద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ముఖ్యమంత్రి కెసిఆర్ మార్గదర్శకం లో, మంత్రి కే టి ఆర్ సహకారం తో శేరిలింగంపల్లి నియోకజకర్గంను అన్ని రంగాలలో అభివద్ధి చేసి ఆదర్శవంతమైన ,అగ్రగామి నియోజకవర్గంగా తీర్చి దిద్దుతానని, ప్రభుత్వ విప్ గాంధీ పేర్కొన్నారు. అదేవిధంగా ఆల్విన్ కాలనీ డివిజన్ అభివద్ధికి బాటలు వేస్తూ, ఈ రోజు సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసుకోవడం చాల సంతోషకరం అని, అదేవిధంగా మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని ,సీసీ రోడ్ల వంటి అభివద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని ,నాణ్యత విషయంలో ఎక్కడ రాజి పడకూడదని, ప్రజలకు ట్రాఫిక్ రహిత ,సుఖవంతమైన ,మెరుగైన రవాణా సౌకర్యం కొరకు శాయ శక్తుల కషి చేస్తానని,అన్ని రంగాలలో అభివద్ధి చేస్తానని, పార్క్ లను అన్ని రకాల మౌలిక వసతుల తో, అన్ని హంగులతో, సకల సౌకర్యాలతో సుందర శోభిత వనాలుగా తీర్చిదిద్దుతామని ప్రభుత్వ విప్ గాంధీ పేర్కొన్నారు, పనుల్లో జాప్యం లేకుండా త్వరిత గతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు, నియోజకవర్గ అభివద్ధికి శాయశక్తులా కషి చేస్తానని ,అన్నివేళలో ప్రజలకు అందుబాటులో ఉంటానని ,మెరుగైన ప్రజా జీవనానికి అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు తనవంతు కషి చేస్తానని ,నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ప్రభుత్వ విప్ గాంధీ పునరుద్ఘాటించారు,ఈ కార్యక్రమంలో ఆల్విన్ కాలనీ డివిజన్ అధ్యక్షులు సమ్మారెడ్డి,బీఆర్ ఎస్ పార్టీ నాయకులు రాజేష్ చంద్ర, కాశినాథ్ యాదవ్, జిల్లా గణేష్, శివరాజ్ గౌడ్, జి.ప్రభాకర్, వెంకటేష్ గౌడ్, సంపత్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, రామకష్ణ (బాబాయ్), చంద్ర శేఖర్ రెడ్డి, రాంచందర్, భాస్కర్, సాంబారెడ్డి, వేలు, రాము, లక్ష్మీ, నిరంజన్, దాతి రమేష్, అంజయ్య యాదవ్, వాసుదేవరావు, పోశెట్టిగౌడ్, సంతోష్ బిరాదర్, శ్రీనివాస్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు ,కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

చదువుకు అంధత్వం అడ్డురాదని నిరూపించిన విద్యార్థి



నవతెలంగాణ - కూకట్ పల్లి

మనసు పెట్టి చదివి,తమ లక్ష్యాలను చేరాలనే తాపత్రయంతో కషి చేస్తే ఎలాంటి వైకల్యాలు అడ్డు రాకుండా ,ఎంత భారీ లక్ష్యమైనప్పటికి మన కషి ముందు చిన్నబోవాల్సిందే అని నిరూపించిన అంధ విద్యార్థి పుట్టుకతో అంధుడైన ఓ విద్యార్థి జే ఈ ఈ మేన్స్ లో 8 వ ర్యాంక్ సాధించి తన ప్రతిభను చాటాడు, తను అందుడైనప్పటికి ప్రతిభకు మాత్రం కొదవలేదని ఆ విద్యార్థి తన చదువులో సత్తాను చాటాడు. ఇటీవల నిర్వహించిన జేఈఈ మెయిన్స్ 2023 పరీక్షల్లో 98.93 శాతం తో, ఆల్ ఇండియన్ ఫిజికల్ హ్యాండీక్యాప్డ్ ఓబీసీ కేటగిరీలో 8వ ర్యాంక్, సాధించాడు పొంగురూ భాను అనే విద్యార్థి. నెల్లూరు జిల్లాకు చెందిన భాను బాచుపల్లి లో నివాసం ఉంటూ, కూకట్ పల్లి లోనీ ఏ ఎస్ రాజు నగర్ లోని శ్రీ భాస్కర భవన్, శ్రీ చైతన్య ఐఐటి కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. తనకు కంప్యూటర్ సైన్స్ అంటే ఎంతో ఇష్టమని, ఆ విభాగంలో సరికొత్త ఆవిష్కరణలు తీసుకొని రావడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నానని స్పష్టం చేసాడు.భాను మొదట కాలేజీలో చేరినప్పుడే తమకు చేరుకోవలసిన లక్ష్యాన్ని వివరించాడని, దానికి అనుగుణంగానే తాము కూడా విద్యార్థిని సిద్ధం చేయడం జరిగిందని కళాశాల డీన్ బి. రవి వెల్లడించారు, ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ హరిబాబు తో పాటు సిబ్బంది పాల్గొన్నారు..

ఘనంగా వీరభద్ర స్వామి 32వ వార్షిక మహోత్సవం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజక వర్గం, సూరారం 129 డివిజన్ న్యూ శివాలయ నగర్ లోని శ్రీ జగద్గురు విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి 32వ వార్షిక మహోత్సవములు ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, స్థానిక డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్ , స్థానిక నాయకులు మహేశ్వర్ రెడ్డి, రిషి పాల్, టాక్ లక్ష్మణ్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే ధ్యేయం : శంభీపూర్ కృష్ణ



నవతెలంగాణ... దుండిగల్

ప్రజల మౌలిక వసతులు కల్పించి కాలనీలా సంక్షేమానికి కషి చేస్తానని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ నేత దుండిగల్ మున్సిపల్ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ తెలిపారు . దుండిగల్ మున్సిపల్ పరిధిలోని పలు కాలనీలలో ఆదివారం పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలు కాలనీలలో మౌళిక వసతులు కల్పించాలని కోరగా సమస్యల పరిష్కారం కోసం కషి చేస్తానన్నారు. అదే విధంగా నియోజకవర్గం పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు, నూతన సంక్షేమ సంఘాల ప్రతినిధులు కష్ణ ని శంభీపూర్ లోని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులను కష్ణ అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారు

• జాతీయ సమితి సభ్యులు ఎండీ యూసుఫ్



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట.

ప్రజల పై అధిక ధరలు పెంచి భారాన్ని మోపుతున్న బిజెపికి రాబోయే రోజుల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని ఏఐటీయూసీ జాతీయ సమితి సభ్యులు ఎండీ యూసుఫ్ విమర్శించారు. రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలో చేపడుతున్న పాదయాత్ర నాలుగవ రోజు ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజక వర్గం రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధి గిరినగర్,గురుమూర్తి నగర్,ఆదర్శ్ నగర్,గుడెన్ మెట్ ,ఐడీపీఎల్ చౌరస్తాలో "ఇంటింటికి సిపిఐ" . ఈ కార్యక్రమాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. సిపిఐ కుత్బుల్లాపూర్ నియోజక వర్గ కార్యదర్శి ఈ .ఉమా మహేష్ అధ్యక్షతన పాదయాత్ర కార్యక్రమం కొనసాగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యల పట్ల నిరంతరం పోరాడేది కమ్యూనిస్టులేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఏఐటీయూసీ అధ్యక్షుడు వి. హరినాథ్ రావు, సీపీఐ మాజీ కౌన్సిలర్ పి .నర్సయ్య సిపిఐ సీనియర్ నాయకులు యాకూబ్, బలనర్సయ్య ,శ్రీనివాస్, సాగర్,యాదన్న,సామెల్,నారాయణ, షాహిద్, ఖాదర్, యూసుఫ్,జహంగీర్,రంజిత్, లతో పాటు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, డిగ్రీ కళాశాల నిర్మించాలి : జనసేన పార్టీ



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్ :

పేద మధ్యతరగతి ప్రజలు ఎక్కువగా ఉన్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లో అన్ని సదుపాయాలతో కూడిన ప్రభుత్వ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ.. అదేవిధంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మించాలని కోరుతూ... ఆదివారం షాపు నగర్ ఎక్స్ రోడ్ వద్ద జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సంతకాల సేకరణ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది... దాదాపు 500 మందికి పైగా సంతకాలు చేయడం కొంతమంది స్వచ్ఛందంగా వచ్చి పార్టీ కడువా కప్పుకోవడం హర్షించదగ్గ విషయం. ఈ సందర్భంగా నియోజకవర్గ కోఆర్డినేటర్ నందగిరి సతీష్ మాట్లాడుతూ... ఆరు లక్షలకు పైగా జనం ఉన్న మన ప్రాంతంలో కనీసం మెరుగైన విద్య వైద్యం సదుపాయాలు లేకపోవడం చాలా బాధాకరం, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు, తర్వాత మర్చిపోయిన నాయకులు ఒకసారి ఆత్మ విమర్శ చేసుకోవాలి.బస్తీ దవకణాలు సరిగా లేవు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు సైతం అంతంత మాత్రమే అన్నారు. గత విద్యా సంవత్సరం స్థానిక ప్రభుత్వ జూనియర్, ఒకేషనల్ కాలేజీలో అధ్యాపకులు లేకుండానే ముగిసిన సంగతి మన అందరికీ తెలిసిందే అన్నారు. ఇంకా మీద అయినా ప్రభుత్వం మరియు స్థానిక అధికార పార్టీ నాయకులు సంబంధిత అధికారులు చొరవ తీసుకొని విద్య వైద్య సదుపాయాలు ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు..ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన పార్టీ శ్రేణులు నాయకులు భారీగా పాల్గొన్నారు.

శ్రీశైలం మల్లన్న సన్నిధిలో కోలన్ గోపాల్ రెడ్డి

నవతెలంగాణ - దుండిగల్

శ్రీశైలం శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వారిని దర్శించుకున్న సీనియర్ నాయకులు కోలన్ గోపాల్ రెడ్డి , కార్పొరేటర్లు,సీనియర్ నాయకులు, ఎన్ఎంసి ఆయా డివిజన్ బిఆర్ఎస్ అనుబంధ కమిటీల సభ్యులు,12వ డివిజన్ బిఆర్ఎస్ నాయకులు,పెద్దలు,ఇతర ముఖ్యులు, తదితరులు పాల్గొన్నారు.




మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి 330వ ఆరాధన మహోత్సవ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి హెచ్ బీ కాలనీ ప్రధాన కూడలిలో ఉన్న స్వామీ వారి విగ్రహానికి పూలమాలలు వేసి ఆరాధనలో పాల్గొన్నారు. కాప్రా సర్కిల్ విశ్వ బ్రాహ్మణ సంఘం ప్రధాన సలహాదారులు పూసల బ్రహ్మాచారి, కేశవరం ఆంజనేయులు చారి, అధ్యక్షులు నూతలపాటి మల్లికార్జున పాల్గొన్నారు.

నవతెలంగాణ-కాప్రా

ఆర్థికమే కాదు.. సామాజిక పోరాటాలూ ముఖ్యమే

కుల,మతాలకతీతంగా కార్మికులు సంఘటితమవ్వాలి

- ప్రభుత్వరంగ ధ్వంసమంటే సామాజిక న్యాయం దెబ్బతిన్నట్టే
- 12 గంటల పని అంటే తీవ్ర ఒత్తిడే..అనారోగ్యాల పాలే
- కనీసవేతనాల జీవోలు విడుదల చేయాలి సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములు



'కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక దేశంలో కార్మికవర్గంపై దాడి తీవ్రమైంది. పరిస్థితులూ వేగంగా మారుతున్నాయి. కార్పొరేట్ల మేలు కోసం లేబర్‌కోడ్‌లను తీసుకొచ్చి హక్కులను హరించి వేస్తున్నారు. మరోవైపు సామాజిక అణచివేత తీవ్రమవుతున్నది. సమస్యల్ని పక్కదోవ పట్టించేందుకు కులమతాల పేరుతో ఏలికలు విభజన చిచ్చు పెడుతున్నారు. ఇలాంటి సమయంలో ఆర్థిక పోరాటాలే కాదు..సామాజిక పోరాటాలూ ముఖ్యమే. కార్మికువర్గమంతా కుల, మతాలకతీతంగా సంఘటితం కావాలి. 12 గంటల పనికి వ్యతిరేకంగా పోరాటాల్లోకి రావాలి. దేశభక్తులంతా ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకు నేందుకు ముందుకు రావాలి. బీజేపీపై పోరుకు దిగిన కేసీఆర్‌కు కార్మికవర్గం మద్దతు దక్కాలంటే రాష్ట్రంలో కోటి మంది కార్మికులకు మేలు చేసే కనీస వేతనాల జీవోలను తక్షణమే విడుదల చేయాలి. బీజేపీలాగా తాము యాజమాన్యాల మేలు కోసం పనిచేయం..కార్మికవర్గం మేలు కోసం పనిచేస్తామనే చిత్తశుద్ధిని సీఎం కేసీఆర్ నిరూపించుకోవాలి' అని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు **చుక్కరాములు** అన్నారు. మేడే సందర్భంగా నవతెలంగాణ ప్రతినిధి **అచ్చిన ప్రశాంత్**కు ఇచ్చిన ఇంటర్వ్యూ ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే...

12 గంటల పనివిధానం, 24X7 షాపులకు అనుమతి ప్రభావం కార్మికుల మీద ఏ విధంగా ఉండబోతున్నది?

ఇది మేడే స్ఫూర్తికి విరుద్ధం. 8 గంటల పనివిధానం పోరాడి సాధించుకున్న హక్కు. పాలకులు పనిగంటలు పెంచేందుకు చట్టాలను సవరిస్తున్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో 12 గంటల పనివిధానం అమలవుతున్నది. దీనివల్ల శ్రమదోపిడీ, పనిభారం పెరుగుతుంది. ఇది తక్కువ మంది కార్మికులతో ఎక్కువ మంది చేసే పనిని చేయించుకుని అధిక లాభాలు గడించే కుట్ర. దీనివల్ల ఉపాధి అవకాశాలు తగ్గి నిరుద్యోగ సమస్య తీవ్రమవుతుంది. కంటిన్యూగా 12 గంటలు పనిచేయడం వల్ల ఆరోగ్యం కూడా దెబ్బతింటుంది. పనిప్రదేశాల్లో సౌకర్యాలు, భద్రత లేని పరిస్థితుల్లో ఎక్కువ పని గంటల చేయడం ప్రమాదకరం. 24+7 దుకాణాలకు అనుమతించడం అంటే కార్మికులతో వెట్టి చేయించడమే. దీని వల్ల జరిగే నష్టాన్ని కార్మికులకు అర్థమయ్యేలా చెబుతున్నాం. 8 గంటల పనివిధానం కోసం ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నాం.

ప్రత్యామ్నాయ సంస్కృతి అంటే ఏమిటి? సామాజిక ఉద్యమాలను ఏవిధంగా ముందుకు తీసుకెళ్తున్నారు?

ఇప్పుడున్న పరిస్థితుల్లో ఆర్థిక అంశాలనే తీసుకుని ముందుకెళ్లటం సరిగాదు. మనిషిని ఆర్థిక అంశాలే కాకుండా భాష, కట్టుబాట్లు, సాంఘిక, సాంస్కృతిక అంశాలు కూడా ప్రభావితం చేస్తున్నాయి. ఆచారవ్యవహారాలు, కట్టుబాట్లు, జీవన విధానమే సంస్కృతి. సంస్కృతి పేరుతో ప్రజల సమస్యల్ని పక్కదారి పట్టించేందుకు సెంటిమెంట్‌ను ముందుకు తీసుకొస్తున్నారు. ఇక్కడ కులం, మతం ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. విశ్వాసాలను పాలనలో జొప్పిస్తున్నారు. ఇది ప్రమాదకరం. ఆపదలో ఉన్నప్పుడు కులం, మతం అనే తేడా లేకుండా కార్మికులు ఒకరికొకరు సహకరించేలా చైతన్యపరుస్తున్నాం. ఇది ప్రాథమికస్థాయిలోనే ఉంది. దీన్ని మరింత విస్తృతం చేయాల్సిన బాధ్యత ట్రేడ్ యూనియన్లపై ఉంది. సామాజికంగా మనుషులందరూ సమానమే. కులవివక్షను అడ్డుకోవడం, స్త్రీ, పురుషుల సమానత్వాన్ని సాధించడం, లౌకికవిధానాన్ని కాపాడటం, శ్రమ సంస్కృతిని ముందుకు తీసుకురావటం అనేదానిపై దృష్టిసారించాం. రణదివే, పూలే, అంబేద్కర్, వంటి వ్యక్తులు సామాజిక చైతన్యం కోసం చేసిన కృషిని విడమరుస్తూ ఏప్రిల్ ఆరో తేదీ నుంచి 14 వరకు వారోత్సవాలను నిర్వహించాం. ఆర్థిక, సామాజిక వివక్షలకు, దోపిడీకి వ్యతిరేకంగా జమిలి పోరాటాలే మా ముందున్న మార్గం.

కనీసవేతనాల జీవో విడుదల అంశం చర్చనీయాంశంగా ఉంది కదా దీనిపై మీరేమంటారు?

పెరిగిన ధరలు, ఇంటి అద్దెలు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్‌లో వేతనాలు సవరించాలి. తెలంగాణ వచ్చి తొమ్మిదేండ్లవుతున్నా జీవోలను విడుదల చేయడం లేదు. కోటి మంది కార్మికుల సమస్యపై రాష్ట్ర సర్కారు దృష్టి సారించడం లేదు. పైగా, పొరుగు రాష్ట్రాల కంటే ఇక్కడే వేతనాలు ఎక్కువున్నాయనీ, పెంచితే పరిశ్రమలు పక్కరాష్ట్రాలకు తరలివెళ్తాయని సాకు చెప్పటం తగదు. కార్మికుల ప్రయోజ నాలను బలిపెట్టడం సరిగాదు. శ్రమదోపిడీకి అనుమతిచ్చి పరిశ్రమలు నడిపించు కోవాలని ప్రభుత్వమే చెప్పటం ఎంత వరకు సముచితమో ఆలోచించాలి. కార్మికులకు రోజువారీ వేతనం రూ.178 ఇస్తే సరిపోతుందని మోడీ సర్కారు ప్రకటించింది. దీనిని సాకుగా చూపి యాజమాన్యాలు వేతనాలు పెంచడం లేదు. బీజేపీపై రాజకీయ పోరులో గెలవాలంటే కేసీఆర్‌కు కార్మికవర్గం మద్దతు అవసరం. దీన్ని ఆయన గుర్తించాలి. కోటిమంది కార్మికులకు మేలు చేసే జీవోలను విడుదల చేయాలి. లేనిపక్షంలో ఐక్య పోరాటాలు చేస్తాం.

ప్రభుత్వ రంగ సంస్థల మీద కేంద్రం దాడి ప్రభావం తెలంగాణ మీద ఏ విధంగా ఉంది?

ఆ ప్రభావం తెలంగాణపై కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. సింగరేణి ప్రయివేటీకరణపై కేంద్రం కన్ను పడింది. ఇప్పటికే హైదరాబాద్‌లో, దాని చుట్టుపక్కల ఉన్న కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలకు ఆర్డర్లు తగ్గాయి. కేంద్రంలోని మోడీ సర్కారు అంబానీ, అదానీ వంటి కార్పొరేట్ల మేలు కోసం పనిచేస్తున్నది. ఈ విధానాలు దేశ భవిష్యత్తుకే ప్రమాదకరం. డీఆర్‌డీఓ, మెదక్‌లో ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ధ్వంసం అవుతున్నది. ప్రభుత్వ రంగం ధ్వంసం కావడమంటే సామాజిక న్యాయం దెబ్బతిన్నట్టే. ఆర్థిక స్వావలంబన కూడా దెబ్బతింటుంది. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవడమంటే ప్రజల ఆస్తులను కాపాడుకోవడమే. నిజమైన దేశ భక్తులంతా ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకునేందుకు ముందుకు రావాలి.

రాష్ట్రంలో వలస కార్మికుల పోరాటాల పరిస్థితేంటి?

వలస కార్మికుల బతుకులు దుర్భరంగా ఉన్నాయి. తెలంగాణలో పరిశ్రమలు, నిర్మాణరంగం, వ్యవసాయ రంగంలోని తీరుతెన్నులను పరిశీలిస్తే అన్ని రకాల పనుల్లోనూ వలస కార్మికులు కనిపిస్తున్నారు. చివరకు సేవా రంగాల్లోనూ విస్తరించారు. ప్రత్యేకంగా హిందీ పాలిత ప్రాంతాల నుంచి ఈ వలసలెక్కువగా ఉన్నాయి. వారి నివాస ప్రాంతాలు చాలా దుర్భరంగా ఉంటున్నాయి. అతితక్కువ వేతనా లతో దీనావస్థల్లో జీవనం గడుపుతున్నారు. తీవ్ర దోపిడీకి గురవుతున్నారు. యాజమాన్యాలు వారిని కార్మిక సంఘాలవైపు కూడా చూడనివ్వడం లేదు. చేరనియ్యటం లేదు. వారిని ఆర్గనైజ్ చేయడంలో భాష ఒక సమస్యగా మారింది. వలస కార్మికులను సంఘటితం చేయడంలో సీఐటీయూకృషి మరింత పెరగాల్సిన అవసరం ఉంది.

మేడే సందర్భంగా కార్మికులకు మీరు ఇచ్చే సందేశం ఏంటి?

బీజేపీ ప్రభుత్వం ఉన్న కార్మిక చట్టాలను తొలగిస్తున్నది. పోరాటం చేయకుంటే హక్కులు నిలబడని పరిస్థితి. హక్కుల కోసం పోరాడటమే మేడే స్ఫూర్తి. రాబోయే రోజుల్లో కులం, మతం, ప్రాంతంతో సంబంధం లేకుండా కార్మికులు సంఘటితం కావాలని పిలుపునిస్తున్నాం. శ్రమదోపిడీకి వ్యతిరేకంగా మరిన్ని పోరాటాలు రావాలి. బీజేపీ ప్రజల మధ్య మతం ప్రాతిపదికన చీలికలు తెస్తున్నది. దీని ప్రభావం కార్మికవర్గంపైనా ఉంది. మరోవైపు లేబర్ కోడ్‌లతో కార్మికుల హక్కులను హరి స్తున్నది. అందుకే బీజేపీని ఓడించాలి. రాబోయే కాలంలో రాజకీయంగానూ కార్మికులు ఆలోచించాలి. దేశ సంపదను, లౌకికతత్వాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడు కోవాలి. దీనికన్నింటికీ కార్మికుల ఐక్యపోరాటాలే శరణ్యం.

మోడీ నిర్బంధాన్ని ప్రతిఘటించాలి



కార్మికుల హక్కులు, స్వేచ్ఛ, సౌకర్యాలు, సమానత్వం, ఓటు హక్కు, దోపిడీ, పీడన, అణిచివేత, అన్యాయాలు, నిర్బంధం, నిరంకు శత్వం, నిరాదరణ అనేక సామాజిక అణిచివేతల నుంచి పుట్టిందే మేడే. బానిస బతుకుకు అంతిమ గీతం ఆలపించి గొంతెత్తిన రోజు మేడే. కార్మిక, కర్షక నవశక్తులకు కొత్త శక్తి అందించిన రోజు మేడే. చికాగో పోరాట వీరుల రక్తంతో ఎగిరిన పోరాట ఎర్రజెండా పీడిత కార్మిక వర్గానికి దిశా నిర్దేశాన్నిచ్చింది, అండగా నిలిచింది. ఎనిమిది గంటల పని విధానం నుంచి అనేక హక్కులను, చట్టాలను సాధించిపెట్టింది మేడే. పోరాడి సాధించుకున్న ఈ హక్కులను, చట్టాలను, స్వేచ్ఛను, సౌకర్యాలను మోడీ ప్రభుత్వం హరించివేస్తున్నది. 137వ మేడే స్ఫూర్తితో కాంట్రాక్టీకరణ, ఔట్ సోర్సింగ్, స్కీమ్ వర్కర్ల రెగ్యుల రైజేషన్ కోసం కొట్లాడాలి. నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు కోసం ఉద్యమించాలి. ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీ కరణను ఆపాలి. కార్మిక వర్గ ఐక్యతను కాపాడాలి.

– ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ జనార్ధన్

దేశభవిష్యత్‌ను అంధకారంలోకి నెట్టే దుశ్చర్యలు



8 గంటల పనివిధానం కోసం యాజమాన్యాలకు వ్యతిరేకంగా చికాగో నగరంలో కార్మికులు పెద్ద ఎత్తున పోరాటం చేశారు. ఆనాడు పోలీసుల కాల్పుల్లో మరణించిన కార్మికుల నెత్తురుతో తడిసిన జెండానే ఎర్ర జెండా. మేడే పోరాట స్ఫూర్తితో కార్మికులు ముందుకు సాగాలి. స్వాతంత్ర్యానికి ముందే పోరాడి సాధించుకున్న చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాలరాస్తున్నది. మోడీ సర్కారు 44 కార్మిక చట్టాలను సమూలంగా మార్చేసి పెట్టుబడిదారులకు, యాజమాన్యాలకు అనుకూలంగా విధానాలు తీసుకొస్తున్నది. కార్మిక వర్గానికి తీవ్ర అన్యాయం చేస్తున్నది. నాలుగు కోడ్‌లను వెంటనే రద్దు చేసి మోటారు రంగంలో పనిచేస్తున్న కార్మికులకు ఒక సమగ్ర చట్టం లేదు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కార్మికుల పట్ల వివక్ష చూపుతున్నది. లక్షలాది మంది కార్మికులకు లబ్ధి చేకూర్చే కనీస వేతనాల జీవోలను కేసీఆర్ ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలి. అసంఘటిత, సంఘటిత రంగాల్లో కార్మికుల హక్కుల కోసం పోరాడుతాం.

– ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి బాలరాజ్

ఆర్థిక వ్యవస్థ మూలస్తంభాలను మోడీ సర్కారు కూల్చేస్తున్నది





ప్రభుత్వ రంగ సంస్థలు మన దేశ ఆర్థిక వ్యవస్థ ముందుకు పోవటానికి ఎంతో దోహద పడ్డాయి. సామాజిక న్యాయం జరగటానికీ ఉపయోగ పడ్డాయి. మూలస్తం భాల్లాంటి ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్రం అంబానీ, అదానీ లాంటి కార్పొరేట్లకు అమ్మేస్తున్నది. ఇది దేశ భవిష్యత్తుకే ప్రమాదకరం. అనేక పోరాటాల ఫలితంగా పారిశ్రామిక వివాదాల చట్టం మొదలుకొని కార్మిక, ఉద్యోగుల హక్కుల కోసం 44 కార్మిక చట్టాలు వచ్చాయి. నేడు వాటిని బీజేపీ సర్కారు నాలుగు కోడ్లుగా మార్చి కార్మికులు, ఉద్యోగుల హక్కులను హరిస్తున్నది. మేడే అంటేనే 8 గంటల పనివిధానాన్ని సాధిం చుకున్న దినం. నేడు మోడీ సర్కారు దానికి తూట్లు పొడిచి 12 పని దినాన్ని పార్లమెంట్‌లో ఆమోదించింది. బీజేపీ పాలిత రాష్ట్రాలు దీన్ని అమలు చేస్తున్నాయి. కార్మిక సంక్షేమం కోసం అనేక పథకాలను గత కేంద్ర ప్రభుత్వాలు తీసుకొచ్చాయి. అందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా స్పష్టంగా ఉండేది. మోడీ సర్కారు వచ్చాక కొంత అమౌంట్ ఇచ్చి మిగతాదంతా రాష్ట్రాలే భరించాలనే నెపంతో భారం మోపుతున్నది. ఇది దుర్మార్గం. సింగరేణిని అదానీకి కట్టబెట్టే కుట్రకు పూనుకున్నది. మేడే స్ఫూర్తితో మోడీ సర్కారు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడుతాం.

– భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ (బీఆర్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షులు జి.రాంబాబుయాదవ్

నాలుగు లేబర్ కోడ్లను నిలిపేయాలి



ప్రాణత్యాగాలు, పోరాటాల ద్వారా సాధించుకున్న చట్టాలను కాలరాసే అధికారం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి లేదు. రాజ్యాంగం ద్వారా కల్పించబడిన హక్కులను కాలరాయడానికి వారెవ్వరు? కార్మిక వర్గ హక్కులను అణచాలని చూస్తే కార్మికవర్గ పోరాటాలు కూడా అంతే తీవ్ర స్థాయిలో వస్తాయి. కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను వెనక్కి తీసుకోవాలి. రాష్ట్ర సర్కారు కూడా కార్మికుల పట్ల చిన్నచూపే చూస్తు న్నది. షెడ్యూల్ పరి శ్రమల జీవోలను విడు దల చేయడంలో తాత్సా రం చేస్తున్నది. కాంగ్రెస్ హయాంలో విడుదల చేసిన జీవోలే అమలవుతున్నాయి. వెంటనే కొత్త జీవోలను తీసుకొచ్చి కనీస వేతనాలను అమలు చేయాలి. వ్యవసాయ, గ్రామీణ, పారిశ్రామిక కార్మికులకు కనీస వేతనాలను అమలు చేయాలి. ప్రత్యేక చట్టం ద్వారా కనీస వేతనాలకు భద్రత కల్పించాలి. మేడే స్ఫూర్తితో కార్మికులు మరింత చైతన్యమై తమ హక్కుల కోసం పోరాటాల్లోకి రావాలి.

– ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌డీ.చంద్రశేఖర్

మేడే స్ఫూర్తితో పోరాడుతాం



కార్మిక వర్గానికి కనీస వేతనాల పెంపు, సామాజిక భద్రత, పనిగంటల తగ్గింపు కోసం మేడే స్ఫూర్తితో పోరాడుతాం.1886లో అమెరికాలోని చికాగో నగరంలో 8 గంటల పని కోసం కార్మికవర్గం పోరాడి విజయం సాధించింది. ఎంతో మంది కార్మికులు తమ రక్తాన్ని ధారపోశారు. వారి పోరాట ఫలితంగానే 8 గంటల పనివిధానం ఇన్నేండ్లు అమలైంది. నేటి కాలంలో కార్మిక వర్గం నాలుగు గంటలు పనిచేస్తే చాలు బతకగలిగేలాగా శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం నేడు అందుబాటులో ఉంది. కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 12 గంటల పనిని అమలు చేసి యజమాన్యాలకు అధిక లాభాలు గడించి పెట్టేందుకు తహతహలాడుతున్నాయి. 24 గంటలు దుకాణాలు, షాపులు తెరుచుకోవచ్చనే నిబంధనలు తీసుకురావడం ఈ సభ్య సమాజానికే సిగ్గుచేటు. పాలకవర్గాలు నిస్సిగ్గుగా పారిశ్రామికవేత్తలకు, కంపెనీ యాజమాన్యాలకు సేవ చేసే లక్ష్యంతో అనేక సంస్కరణలు తీసుకురావడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. కార్మిక వర్గం హక్కుల భద్రత కోసం, మెరుగైన జీవితాల కోసం కార్మికులు పెద్ద సంఖ్యలో పోరాటాల్లోకి రావాలి.

– కె.సూర్యం, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి.

కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే లేబర్ కోడ్‌లు



మోడీ 2014లో అధికారం చేపట్టిన తర్వాత కార్మికవర్గం మీద దాడిని ముమ్మరం చేశారు. కార్మికుల హక్కులను హననం చేశారు. పోరాడి సాధించుకున్న హక్కు లను కాలరాయడంలో భాగంగానే నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చారు. బడా కార్పొ రేట్ శక్తులకు అనుకూలంగా ఈ దేశ కార్మికవర్గానికి భంగం కలిగేలా నిబంధనలు రూపొందించారు. పోరాడి సాధిం చుకున్న చట్టాలను కార్పొ రేట్ శక్తులకు అనుకూలంగా మారుస్తు న్నారు. లేబర్ కోడ్‌ల ప్రకారం యూనియన్లను ఏర్పాటు చేసుకునే హక్కు లేదు. సమ్మె చేసే హక్కు కూడా లేదు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు భరోసా లేదు. సామాజిక భద్రత లేకుండా పోతుంది. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎనిమిది గంటలకు బదులుగా 12 గంటల పనివిధానాన్ని అమలు చేస్తున్నారు. కార్మికులను అణచివేసేందుకు యాజమాన్యాలకు సంపూర్ణ మైన అధికారాలిచ్చారు. ఇవన్నీ అత్యంత ప్రమాదకరం. లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలి. ప్రభుత్వరంగాన్ని పరిరక్షించాలి. తెలంగాణలోనూ కార్మికవర్గ వ్యతిరేక విధానాలనే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్నది. 74 షెడ్యూల్ పరిశ్రమల్లో కనీస వేతనాల జీవోను సవరించి అమలు చేయాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా బలమైన ఉద్యమాలు నిర్మించాలి.

– ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం శ్రీనివాస్

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

సీఎం కేసీఆర్‌కు బైబిల్ బహుకరణ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నూతన సచివాలయం ప్రారంభోత్సవం సందర్భంగా సీఎం కేసీఆర్‌కు ఆదివారం తెలంగాణ ఫుడ్స్ చైర్మెన్ మేడే రాజీవ్ సాగర్ బైబిల్‌ను బహుకరించారు. ఛాంబర్లలో ఆసీనులైన మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్ రెడ్డి, సత్యవతి రాథోడ్, తలసాని శ్రీనివాస్ యాదవ్ లను కలిసి పుష్ప గుచ్ఛాలు అందజేశారు. వీటితో పాటు అంగన్ వాడీలకు సన్న బియ్యం సరఫరా, మూడేండ్లలోపు పిల్లలకు ఉచితంగా పాల పంపిణీ ఫైలుపై నూతన చాంబర్‌లో తొలి సంతకం చేసిన రాష్ట్ర మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌కి రాజీవ్ సాగర్ ధన్యవాదాలు తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లపై బహిరంగ చర్చకు రండి

- మంత్రి గంగుల కమలాకర్‌కు పొన్నం సవాల్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో మొత్తం ఎంత ధాన్యం కొన్నారు? మీరు చెబుతున్నది ఎంత? దీనిపై బహిరంగ చర్చకు వస్తారా? అంటూ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ మంత్రి గంగుల కమలాకర్‌కు సవాల్ విసిరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఐకేపీ సెంటర్ల ద్వారా ధాన్యం కొనుగోలుకు సంబంధించి మంత్రి అవాస్తవాలు చెబుతున్నారని ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ధాన్యం కొనుగోళ్లలో మంత్రి చెబుతున్న అవాస్తవమని నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. వడగండ్ల వానలతో నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 25వేల పరిహారం ఇవ్వాలని కోరారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

దళిత బంధులో అవినీతి ఎమ్మెల్యేల చిట్టా వెల్లడించాలి

- ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద నరేష్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దళిత బంధు పథకంలో లబ్దిదారుల నుంచి రూ. 3 లక్షల వరకు తీసుకున్న ఎమ్మెల్యేల చిట్టాను సీఎం కేసీఆర్ వెల్లడించాలని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవింద్ నరేష్ మాదిగ డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని బషీర్ బాగ్ వద్ద డాక్టర్ బాబు జగ్జీవన్ రాం విగ్రహం ముందు ఎంఎస్‌పీ, ఎంఆర్‌పీఎస్, ఎంఎస్ఎఫ్, ఎంఎంఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. 'తెలంగాణలో అవినీతిలేని పాలనను అందిస్తామని, కన్న కొడుకు తప్పు చేసినా సహించేది లేదని' మాట్లాడిన కేసీఆర్ ..బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దళితుల నుంచి రూ. 3 లక్షలు లంచం తీసుకుంటుంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు సీహెచ్ సోమశేఖర్ మాదిగ, ఎంఎస్‌పీ నాయకులు వి ఎస్ రాజు మాదిగ, ఎంఎంఎస్ జాతీయ నాయకురాలు జేపీ లత మాదిగ, రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

గడ్చిరోలిలో ఎన్‌కౌంటర్

గడ్చిరోలి :మహారాష్ట్రలోని గడ్చిరోలిలో ఆదివారం సాయంత్రం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మరణించినట్టు పోలీసులు తెలిపారు. వారిపై రూ.38 లక్షల రివార్డు ఉందని చెప్పారు. అహేరి తహసీల్ పరిధిలోని మన్నే రాజారాం గ్రామంలో సాయంత్రం ఆరు గంటల సమయంలో ఎన్‌కౌంటర్ జరిగినట్టు గడ్చిరోలి డిఐజి సందీప్ పాటిల్ తెలిపారు. మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

పంజాబ్‌లో విష వాయువు లీక్.. 11 మంది మృతి..

చండీగఢ్ : పంజాబ్‌లో ఘోరం చోటు చేసుకున్నది. లుధియానాలో గ్యాస్ లీకైన ఘటనలో 11 మంది మృతి చెందారు. వీరిలో ముగ్గురు మహిళలు..మరో ఇద్దరు బాలికలు ఉన్నారు. మరో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నది. ఈ ఘటనలో పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. గియాస్‌పురలోని ఈస్ట్‌మన్ చౌక్ వద్ద గల సువా రోడ్‌లో ఒక విషవాయువు లీకైంది. ఈ ప్రమాదం ఆదివారం ఉదయం చోటు చేసుకున్నది. దీంతో 11 మంది మరణించారు. నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నది. వారికి ఆస్పత్రిలో చికిత్సను అందిస్తున్నారురు. అయితే, ఈ గ్యాస్ లీక్ కావడానికి గల కారణాలు ఇప్పటికీ తెలియరాలేదు.

ఎస్‌కెఎం దేశవ్యాప్త ఆందోళన

మే నుంచి నవంబర్ వరకు కార్యక్రమాలు

- సెప్టెంబరు నుంచి నవంబర్ వరకు భారీ అఖిల భారత జాతాలు
- రెజ్లర్లకు సంపూర్ణ మద్దతు : ఎస్‌కెఎం జాతీయ సమావేశం నిర్ణయం



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో రైతులు, వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై దేశవ్యాప్త ఆందోళనకు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్ కెఎం) పిలుపు ఇచ్చింది. ఆదివారం నాడిక్కడ హరికిషన్ సింగ్ సుర్జీత్ భవన్ లో సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వివిధ రైతు సంఘాల నుంచి 200 మందికి పైగా రైతు నాయకులు హాజరయ్యారు. వివరణాత్మక చర్చల తరువాత, జాతీయ సమావేశం భవిష్యత్తు కార్యక్రమాలను నిర్ణయించింది. అనంతరం ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా (పిసిఐ)లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్ కెఎం నేతలు అశోక్ దావలే, హన్నన్ మొల్లా, దర్శన్ పాల్, అవిక్ షా మాట్లాడుతూ సమావేశం నిర్ణయాలను వెల్లడించారు. "కనీస మద్దతు ధర చట్టం, రుణ మాఫీ, రైతు, వ్యవసాయ కార్మికుల పెన్షన్, సమగ్ర పంటల బీమా పథకం, రైతు హంతకుడు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి అజయ్ మిశ్రా అరెస్టు, రైతులపై తప్పుడు కేసుల ఉపసంహరణ, ఉద్యమంలో అసువులు బాసిన అమరవీర రైతు కుటుంబాలకు పరిహారం వంటి ప్రధాన సమస్యలపై మే 26 నుండి 31వరకు దేశంలోని అన్ని రాష్ట్రాల్లో నిరసనలు, ఆందోళనలు జరగనున్నాయి. ఇందులో భాగంగా పార్లమెంటు సభ్యులు, ముఖ్య రాజకీయ నాయకుల సొంత నియోజకవర్గాల్లో కార్యాలయాలు, నివాసాలకు పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు నిర్వహించి, వారికి మెమోరాండం సమర్పిస్తాం. రైతుల డిమాండ్లన్నింటినీ వెంటనే పరిష్కరించాలని హెచ్చరిస్తూ, విఫలమైతే వారు తదుపరి నిరసనలను ఎదుర్కోవలసి ఉంటుంది" అని హెచ్చరించారు.

"మే, జూన్, జూలై నెలల్లో దేశంలోని ప్రతి రాష్ట్రంలో రైతులు, వ్యవసాయ కార్మికులతో రాష్ట్ర, జిల్లా స్థాయి సమావేశాలు నిర్వహిస్తాం" అని అన్నారు. "రైతులు, కార్మికుల ప్రయోజనాలను కార్పొరేట్‌లకు విక్రయించడాన్ని నిలిపివేయాలని ఆగస్టు 1 నుండి 15 వరకు కార్మిక సంఘాలు, సంఘాల సమన్వయంతో సామూహిక నిరసనలు నిర్వహిస్తాం" అని తెలిపారు.

"సెప్టెంబరు నుండి నవంబర్ మధ్య దేశవ్యాప్తంగా భారీ అఖిల భారత జాతాలు నిర్వహిస్తాం. దీనికి ఎస్ కెఎం జాతీయ నాయకులు నాయకత్వం వహిస్తారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ మొదలైన అసెంబ్లీ ఎన్నికలు జరిగే రాష్ట్రాలపై జాతాలు ప్రత్యేకంగా దృష్టి సారిస్తాయి" అని పేర్కొన్నారు. లఖింపూర్ ఖేరీలో బిజెపి నాయకులు రైతులను హత్య చేసిన అక్టోబర్ 3న, అఖిల భారత షహీదీ దివస్ నిర్వహిస్తామని అన్నారు. "నవంబర్ 26న రైతుల చారిత్రాత్మక ఢిల్లీ చలో మార్చ్ ఢిల్లీ సరిహద్దులకు చేరిన రోజున, అఖిల భారత విజయ్ దివస్ అన్ని రాష్ట్ర రాజధానులలో కనీసం మూడు రోజుల పాటు పగలు-రాత్రి ధర్నా నిర్వహిస్తామని అన్నారు.

ఎస్ కెఎం జాతీయ సమావేశం తీర్మానాలు

ఎస్ కెఎం జాతీయ సమావేశం మూడు తీర్మానాలను ఆమోదించిందని తెలిపారు. "బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నాలో కూర్చున్న భారత మహిళా రెజ్లర్ల నిరసనకు ఎస్ కెఎం సంపూర్ణ మద్దతు ఇస్తుంది. క్రీడాకారులకు ఎస్ కెఎం సంఘీభావం తెలియజేస్తుంది. బిజెపి ఎంపిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేసింది. ఎస్ కెఎం నాయకుల ప్రతినిధి బృందం నిరసన స్థలాన్ని సందర్శించి, క్రీడాకారులను కలుసుకుని, వారికి మద్దతును తెలియజేశారు" అని తెలిపారు.

"రైతుల ఉద్యమానికి, ఎస్ కెఎంకి స్థిరమైన మద్దతుదారుగా ఉన్న మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్‌పై బిజెపి ప్రభుత్వం సిబిఐ వంటి సెంట్రల్ ఏజెన్సీలతో దాడి చేయడాన్ని ఎస్ కెఎం ఖండిస్తుంది. పుల్వామాలో మన సైనికుల అనవసరమైన ప్రాణనష్టం, అత్యున్నత స్థాయిలో బిజెపి నాయకత్వం అవినీతి మొదలైన వాటికి సంబంధించి మాలిక్ బిజెపి ప్రభుత్వం దుశ్చర్యలను బహిర్గతం చేస్తున్నారు. మాలిక్ ధైర్యాన్ని ఎస్ కెఎం కొనియాడింది.

మాలిక్‌ను కించపరిచేందుకు బిజెపి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ప్రతిఘటించే చర్యలకు ఎస్ కెఎం మద్దతు ఇస్తుంది" అని అన్నారు.

"చారిత్రాత్మక ఢిల్లీ రైతాంగ పోరాటానికి ఈ సంఘాలు మద్దతిచ్చి కొంత నిధులను విరాళంగా అందించినందున, దేశంలోని తపాలా ఉద్యోగుల సంఘాలు నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్, ఆల్ ఇండియా పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్ లను ప్రభుత్వం గుర్తింపు రద్దు చేయడాన్ని ఎస్ కెఎం ఖండించింది. ఆయా సంఘాలకు సంఘీభావం తెలియజేసింది. గుర్తింపు రద్దును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. రైతు వ్యతిరేక, కార్మిక వ్యతిరేక బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్మిక, రైతు ఐక్యతను పెంచడానికి మద్దతుగా ఉంటుంది" అని అన్నారు.

మూడు కమిషనరేట్లలో 40 పోలీసు స్టేషన్లు, రెండు డీసీపీ పోస్టులు ఏర్పాటు


కొత్త సచివాలయంలో ఫైలుపై సంతకం చేసిన హోం మంత్రి

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

నూతనంగా నిర్మించిన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయ ప్రారంభోత్సవం రోజునే తన ఛాంబర్‌లో కొత్త పోలీసు స్టేషన్ల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ రాష్ట్ర హోం మంత్రి మహమూద్ అలీ ఫైల్‌పై సంతకం చేశారు. అంతకముందు ఆయన మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో నూతన సచివాలయంలోని మూడో అంతస్థులోని తన ఛాంబర్‌లో ఆసీనులయ్యారు. ఈ కొత్త ఛాంబర్ నుంచి తొలిరోజునే 40 కొత్త పోలీసు స్టేషన్లు, రెండు డీసీపీ పోస్టుల ఏర్పాటుకు సంబంధించిన ఫైలుపై మంత్రి సంతకం చేశారు. హైదరాబాద్ సిటీ పోలీసు కమిషనరేట్‌తో పాటు రాచకొండ, సైబరాబాద్ పోలీసు కమిషనరేట్లలో ఈ 40 కొత్త పోలీసు స్టేషన్ల ఏర్పాటు జరుగుతున్నది. అలాగే, హైదరాబాద్ నగరంలోనే సౌత్‌వెస్ట్, సౌత్‌ఈస్ట్ ల పేరిట రెండు కొత్త డీసీపీ జోన్ల ఏర్పాటు జరుగుతున్నది. ఈ సందర్భంగా హోం మంత్రి కొత్త సచివాలయంలో తన నూతన ఛాంబర్‌లోకి ప్రవేశిస్తున్న సమయంలో రాష్ట్ర హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జితేందర్, డీజీపీ అంజనీ కుమార్, ఏసీబీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రవి గుప్తా, నగర పోలీసు కమిషనర్ సి.వి ఆనంద్, రాష్ట్ర శాంతి భద్రతల విభాగం అదనపు డీజీ సంజయ్ కుమార్ జైన్, రాచకొండ, సైబరాబాద్ కమిషనర్లు డి.ఎస్. చౌహాన్, స్టీఫెన్ రవీంద్ర, టీఎస్ఎస్‌పీ బెటాలియన్స్ అదనపు డీజీ స్వాతి లక్రా, రాష్ట్ర మహిళా భద్రతా విభాగం అదనపు డీజీ శిఖా గోయెల్, తదితర ఉన్నతాధికారులు హాజరై హోం మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం, రాష్ట్ర హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జితేందర్ నూతన సచివాలయంలో తన ఛాంబర్‌లోకి ప్రవేశిస్తున్న సందర్భంగా డీజీపీతో పాటు ఇతర పోలీసున్నతాధికారులు కూడా హాజరయ్యారు.

ఆటలు

భారత అగ్రశ్రేణి రెజ్లర్ల ఆందోళన ఎనిమిదో రోజుకు చేరుకుంది. భారతీయ జనతా పార్టీ (బిజెపి) పార్లమెంట్ సభ్యుడు, భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను తక్షణమే అరెస్టు చేయాలని జంతర్‌మంతర్ వద్ద దీక్షలో రెజ్లర్లు వినేశ్ ఫొగట్, సాక్షి మాలిక్, బజరంగ్ పూనియా డిమాండ్ చేశారు. లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న బ్రిజ్‌భూషణ్‌ను ప్రశ్నించటం మానేసి.. బిజెపి నాయకులు బాధిత రెజ్లర్లపైనే నిందలు వేసే పనిలో నిమగ్నమయ్యారు.





బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేయాలి

- రెజ్లర్లు వినేశ్, సాక్షి, బజరంగ్ డిమాండ్
- జంతర్‌మంతర్ వద్ద ఎనిమిదో రోజు రెజ్లర్ల దీక్ష

నవతెలంగాణ-న్యూఢిల్లీ

విద్యుత్ సరఫరా నిలిపివేశారు, నీటి సరఫరా తీసివేశారు. సాధన చేసేందుకు అవసరమైన మ్యాట్లను తీసుకురాకుండా అడ్డుకున్నారు. బ్యారికేడ్లను అడ్డంగా నిలిపి ఉంచి.. మల్లయోధులను అసౌకర్యానికి గురి చేశారు. అయినా.. మల్లయోధులు ఏమాత్రం వెనక్కి తగ్గటం లేదు. ఓ మైనర్ సహా ఏడుగురు మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధింపులకు గురిచేసిన భారతీయ జనతా పార్టీ (బిజెపి) ఎంపీ, భారత రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను తక్షణమే అరెస్టు చేయాలని ఉద్యమం ఉధృతం చేశారు. న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద రెజ్లింగ్ క్రీడాకారుల ఆందోళన ఆదివారం నాటికి ఎనిమిదో రోజుకు చేరింది. సుప్రీంకోర్టు ఆదేశంతో బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌పై ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసినా.. ఈ కేసులో ఢిల్లీ పోలీసుల నుంచి ఎటువంటి పురోగతి లేదు. దీంతో బిజెపి ఎంపీని తక్షణమే అదుపులోకి తీసుకోవాలని రెజ్లర్లు డిమాండ్ చేస్తున్నారు.

బిజెపి నేతలూ మద్దతు ఇవ్వచ్చు!

భారతీయ జనతా పార్టీ (బిజెపి) నాయకులు, అధికార పార్టీ అనుకూల మీడియా రెజ్లర్ల ఆవేదన పట్టించుకోకుండా.. రెజ్లర్లకు ఎవరు మద్దతు పలికినా ఓవరాల్‌గా ఉద్యమానికే రాజకీయ రంగు పులిమే పనిలో బిజీగా ఉన్నారు. జనవరిలో రెజ్లర్లు జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేశారు. కానీ ఏ రాజకీయ నేపథ్యం ఉన్నవారికి నిరసనలో భాగం కానివ్వలేదు. దిగ్గజ బాక్సర్ విజేందర్ సింగ్ మద్దతు ఇచ్చేందుకు వచ్చినా.. సున్నితంగా తిరస్కరించారు. తాజాగా, కేంద్ర ప్రభుత్వం, కేంద్ర క్రీడాశాఖ సహా ఢిల్లీ పోలీసులు రెజ్లర్లను లైంగికంగా వేధించిన బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను కాపాడేందుకు ప్రయత్నిస్తుండటంతో మల్లయోధులు నిరసన దీక్షను మరో స్థాయికి తీసుకెళ్లారు. ఈ సారి రైతుల నుంచి మహిళల వరకు ఎవరు మద్దతిచ్చినా సాదరంగా స్వాగతిస్తున్నారు. రాజకీయ నేతల మద్దతుతో రెజ్లర్ల ఉద్యమం రాజకీయ లక్ష్యాలతో కూడుకున్నది కాబోదని.. మా లక్ష్యం బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌ను అరెస్టు చేయటమేనని రెజ్లర్లు స్పష్టం చేశారు. 'మూడు నెలల క్రితం ఇదే జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేశాం. రాజకీయ నేతలను దీక్ష వద్దకు అనుమతించలేదు. కేవలం రెజ్లింగ్ సమాఖ్య సమస్యగానే పరిగణించి పోరాడాం. కానీ ప్రభుత్వం ఎటువంటి పరిష్కారం చూపలేదు. మూడు నెలలు ముగిసినా.. ఎటువంటి చర్యలు తీసుకోలేదు. అందుకే మళ్లీ జంతర్‌మంతర్ వద్దకు రావాల్సి వచ్చింది. బాధిత రెజ్లర్లకు అండగా నిలిచేందుకు, మద్దతు ఇచ్చేందుకు రాజకీయ పార్టీల నాయకులు వస్తున్నారు. మాకు ఎటువంటి రాజకీయ ఉద్దేశాలు లేవు. బిజెపి నాయకులు కూడా వచ్చి మాకు మద్దతు తెలపవచ్చు. వాళ్లను కూడా మేము సాదరంగా స్వాగతిస్తాం. న్యాయ పోరాటం మద్దతు ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలుపుతామని' వినేశ్ ఫోగట్ పేర్కొంది.

రాజకీయ నేతలే నడుపుతున్నారు

మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపుల ఆరోపణలపై స్పందించకుండా ఇన్నాండ్లు మౌనంగా ఉండిపోయిన బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్.. మల్లయోధులకు మద్దతుగా రాజకీయ నాయకులు రావటంతో రెజ్లర్ల ఉద్యమాన్ని నడిపిస్తున్నదే రాజకీయ నాయకులేనని బ్రిజ్‌భూషణ్ విమర్శలు గుప్పించారు. రెజ్లర్ల ఆందోళనను పక్కదోవ పట్టించేందుకు మీడియా ముందుకొచ్చి రాజకీయ నాయకుల మద్దతుపై ప్రశ్నించారు. 'ఈ పోరాటం ఇప్పుడు అథ్లెట్ల చేతుల్లో లేదు. రాజకీయ నాయకులు నడిపిస్తున్నారు. రెజ్లర్లు ఆందోళనకు దిగిన తొలి రోజు నుంచే నేను దీని వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందని అనుమానించాను. అథ్లెట్ల ఆందోళనను కాంగ్రెస్ ఇతర రాజకీయ పార్టీలు వాడుకుంటున్నాయి. ఆందోళన చేస్తున్న రెజ్లర్లది రాజకీయ లక్ష్యమే కానీ నా రాజీనామా కాదు' అని బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ అన్నారు. రెజ్లింగ్ క్రీడాకారులు న్యాయం కోసం పోలీసులు, న్యాయస్థానాలను ఆశ్రయించాలి కానీ ఇలా జంతర్‌మంతర్‌లో కూర్చోవటం కాదు. ఈ విషయంలో న్యాయస్థానం ఏం తీర్పు ఇచ్చినా శిరసావహించేందుకు సిద్ధంగా ఉన్నానని బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ వ్యాఖ్యానించారు.



ఇక ఆదివారం జంతర్‌మంతర్ ఆందోళన చేస్తున్న రెజ్లింగ్ క్రీడాకారులకు రాజకీయ, ప్రజాసంఘాల నాయకుల మద్దతు వెల్లువెత్తింది. భీమ్ ఆర్మీ అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆజాద్, రాబర్ట్ వాద్రా సహా తదితరులు సంఘీభావం తెలిపారు. లైంగిక వేధింపుల అంశంలో ప్రధాన మంత్రి, కేంద్ర ప్రభుత్వం, భారతీయ జనతా పార్టీ బాధిత రెజ్లర్ల పక్షాన కాకుండా, అధికార బిజెపి ఎంపీ బ్రిజ్‌భూషణ్ పక్షాన ఉన్నారని సంఘీభావం తెలుపుతూ నేతలు ఆరోపించారు.

వర్ష బీభత్సం

- 636 ప్రాంతాల్లో అకాల వర్షాలు
- కరీంనగర్‌లో 8.2 సెంటీమీటర్ల కుండపోత
- మరో మూడ్రోజులు వానలే..

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వాతావరణంలో వచ్చిన మార్పులతో నడి వేసవిలో వర్షాకాలంలో పడినట్టే అకాల వర్షాలు పడుతున్నాయి. ఆదివారం రాత్రి 11 గంటల వరకు రాష్ట్రంలోని 636 ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. కరీంనగర్ జిల్లా కేంద్రంలో అత్యధికంగా 8.2 సెంటీమీటర్ల భారీ వర్షం కురిసింది. అదే జిల్లా దుర్శెడ్‌లోనూ 7.4 సెంటీ మీటర్ల వర్షం పడింది. 330కిపైగా ప్రాంతాల్లో మోస్తరు వర్షం (1.5 సెంటీ మీటర్లకు పైగా) కురిసింది. కరీంనగర్, హైదరా బాద్, జనగాం, జయ శంకర్ భూపాలపల్లి, కామారెడ్డి, మెదక్, మేడ్చల్ మల్కాజిగిరి, నారాయణపేట, పెద్దపల్లి, రంగారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోనూ పలు చోట్ల భారీ వర్షం పడింది. రాబోయే మూడు రోజులు పాటు రాష్ట్రంలో తేలికపాటి మోస్తరు వానలు, అక్కడక్కడా భారీ వర్షాలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి కె.నాగరత్న తెలిపారు. పలు ప్రాంతాల్లో 30 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొన్నారు.

నిర్మల్, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరిక జారీ చేసింది. గ్రేటర్ హైదరబాద్ పరిధిలో రాబోయే 48 గంటల పాటు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. నగరంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం పడే సూచనలు ఉన్నాయి. అదే సమయంలో 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షం పడే అవకాశం కూడా ఉంది.

అమెరికాలో పతనం అంచున మరో బ్యాంకు



వాషింగ్టన్ : పతనం అంచున వేలాడు తున్న ఫస్ట్ రిపబ్లిక్ బ్యాంకును కాపాడటానికి ప్రయివేటురంగ కంపెనీలు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమైన నేపథ్యంలో అమెరికా అధికారులు రంగంలోకి దిగారని రాయిటర్స్ వార్తా సంస్థ శుక్రవారం రిపోర్ట్ చేసింది. ఫెడరల్ డిపాజిట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (FDIC), ట్రెజరీ డిపార్ట్మెంట్, ఫెడరల్ రిజర్వ్(అమెరికా కేంద్ర బ్యాంకింగ్ వ్యవస్థను ఫెడరల్ రిజర్వ్ సిస్టమ్ లేక ఫెడరల్ రిజర్వ్ లేక ద ఫెడ్ అని పిలుస్తారు) తదితర ప్రభుత్వ సంస్థలు ఈ మధ్యకాలంలో ఫస్ట్ రిపబ్లిక్ బ్యాంకును కాపాడటానికి ఫైనాన్స్ కంపెనీలతో సంప్రదింపులు జరుపు తున్నాయి. ఈ ప్రయత్నంలో బ్యాంకులు, ప్రయివేటు ఈక్విటీ కంపెనీలు పాలుపంచుకుంటున్నాయి. ఫస్ట్ రిపబ్లిక్ బ్యాంకు ఎఫ్డీఐసీ సహాయంతో బ్రతికి బయటపడటం కంటే ఒక ప్రయివేటు రంగ ఒప్పందంతో మనగలిగితేనే మేలని ప్రభుత్వం భావిస్తోంది. సిలికాన్ వ్యాలీ బ్యాంకు, సిగ్నేచర్ బ్యాంకు మార్చినెలలో దివాళా తీసిన తరువాత శాన్ ఫ్రాన్సిస్కో కేంద్రంగా పనిచేస్తున్న ఫస్ట్ రిపబ్లిక్ బ్యాంకు ఈ త్రైమాసికంలో 100బిలియన్ డాలర్ల డిపాజిట్లను కోల్పోయినట్టు ప్రకటించగానే బ్యాంకు షేరు విలువ 75శాతం పతనమైంది. ఇలా పతనం అంచున వేలాడుతున్న ఫస్ట్ రిపబ్లిక్ బ్యాకును కాపాడటానికి 11బ్యాంకుల సహకారంతో 30బిలియన్ డాలర్ల నిధులను అందజేసినప్పటికీ ఈ బ్యాంకు పట్ల విశ్వాసం ఏమాత్రం పెరగలేదు.

మాసాబ్‌ట్యాంక్ నుంచే నా రాజకీయ జీవితం ప్రారంభమైంది

- ఆర్థిక మంత్రి హరీశ్‌రావు
- డైమండ్ జూబ్లీ ఉత్సవాల పైలాన్‌కు శంకుస్థాపన



నవతెలంగాణ -హైదరాబాద్

మాసాబ్‌ట్యాంక్ పాలిటెక్నిక్ కాలేజీ నుంచే నా రాజకీయ జీవితం ప్రారంభమైందని రాష్ట్ర ఆర్థిక , ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో నాయకుడు కేసీఆర్ ప్రోత్సాహంతో ఈ కాలేజీలో చదువుకునేవాడినని చెప్పారు. ఆదివారం మాసబ్ ట్యాంక్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో డైమండ్ జూబ్లీ స్మారక స్థూపం (పైలాన్) నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాలేజీ భవనం పున:నిర్మాణం కోసం కృషిచేస్తానని అన్నారు. సీఎం కేసీఆర్ సైతం గతంలో పాలిటెక్నిక్ కాలేజీ కొత్త భవనానికి సమకూర్చడానికి అంగీకరించారని చెప్పారు. ఈ కాలేజీ కోసం ఇప్పటికే రూ. 2 కోట్లు మంజూరు చేశామని అన్నారు. పూర్తిస్థాయిలో మరోసారి అంచనాలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఆగస్టు 12, 13 తేదీల్లో డైమండ్ జూబ్లీ ఉత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో వేగంగా కాలేజీ పున:నిర్మాణ పనులు సాగాలని కోరారు. ఎమ్మెల్యే గంద్ర వెంకటరమణారెడ్డి పాలిటెక్నిక్ కాలేజీ కోసం పూర్వ విద్యార్థులంతా సహకరించాలని కోరారు. మంత్రి హరీశ్‌రావు గారి సహకారం గొప్పదని అన్నారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి మొదటి అడుగుగా పైలాన్ ఏర్పాటుకు భూమి పూజ చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జీపీటీ మా అధ్యక్షులు సురేశ్ ఆనంద్ మోహన్, ప్రధాన కార్యదర్శి లల్లూ నాయక్, ఐఆర్ఎస్ అధికారి మురళీమనోహర్, బండి రమేశ్, పూర్వ విద్యార్థి, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. బసవపున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

సమాచార శాఖ స్పెషల్ కమీషనర్ అశోక్ రెడ్డి

- బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమీషనర్ కోరం అశోక్ రెడ్డి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ నూతన సచివాలయం ప్రారంభోత్సం సందర్భంగా రెండవ అంతస్తులోని తన సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శి కార్యాలయంలో మధ్యాహ్నం 1.50 గంటలకు ఛార్జీ తీసుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సమాచార, పౌర సంబంధాల స్పెషల్ కమీషనర్‌గా, రాష్ట్ర చలన చిత్ర అభివద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌గా, ఎక్స్‌ఆఫిషియో కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన అశోక్‌రెడ్డిని సమాచార శాఖ డైరెక్టర్ రాజమౌళి, అడిషనల్ డైరెక్టర్ నాగయ్య కాంబ్లే, జాయింట్ డైరెక్టర్లు జగన్, శ్రీనివాస్, కె.వెంకటరమణ, డిప్యూటీ డైరెక్టర్లు మధుసూదన్, హష్మీ, .ఐ.ఇ రాధాకిషన్, ఆర్.ఐ.ఇ జయరాంమూర్తి, ఎఫ్.డి.సి. ఇ.డి కిషోర్‌బాబు తదితరులు అభినందించారు.

కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణపై టియూఎమ్‌ఎమ్‌యూ హర్షం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణపై తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర గౌరవాధ్యక్షులు భూపాల్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆరోగ్య శాఖలో 3వేల మందిని మాత్రమే రెగ్యులర్ చేశారనీ, ఇంకా అర్హత కలిగిన వేలాది మంది కాంట్రాక్టు ఉద్యోగులు ఉన్నారని తెలిపారు. 15,16 ఏండ్ల నుంచి పనిచేస్తున్న వాళ్లు ఉన్నారనీ, వారిని కూడా రెగ్యులర్ చేయాలని కోరారు.

ప్రపంచ గమనం

చైనాతో ఆర్థిక సంబంధాలను గణనీయంగా పెంచుకున్న మలేషియా



న్యూయార్క్ : మార్చి29 నుంచి ఏప్రిల్ 1వ తేదీదాకా మలేషియా ప్రధాన మంత్రి అన్వర్ ఇబ్రాహిం చైనాలో పర్యటించాడు. ఈ పర్యటనలో మలేషియాలో చైనా పెట్టుబడుల గురించి అనేక ఒప్పందాలు జరిగాయి. ఇండో పసిఫిక్ ప్రాంతంలో అమెరికా సైనికంగాను, ఆర్థికంగాను చైనాకు వ్యతిరేకంగా కాలుదువ్వుతున్న స్థితిలో మలేషియా ప్రధాని చైనా పర్యటన ఆసక్తిదాయకంగా ఉంది. మలేషియాలో పెట్రోకెమికల్, ఆటోమోటివ్, ఫైనాన్స్, తదితర రంగాలలో పెట్టుబడులు పెట్టటానికి చైనాలో 19 మెమొరాండా ఆఫ్ అండర్స్టాండింగ్స్ (ఎమ్ఓయుల)పైన అన్వర్ సంతకాలు చేశాడు. అదే సమయంలో అమెరికా, చైనాల మధ్య జరుగుతున్న ఘర్షణలో తన దేశం తటస్థంగా ఉంటుందని మలేషియా ప్రధాని ప్రకటించాడు. ఈ ఎమ్ఓయుల విలువ 170బిలియన్ యువాన్లు(38.5బిలియన్ డాలర్లు) ఉంటుంది. ఈ పెట్టుబడులు మలేషియా స్థూల జాతీయోత్పత్తి(జిడిపి)లో 10శాతంతో సమానం. రాబోయే రోజుల్లో మలేషియాలో చైనా పెట్టుబడులు అనేక రెట్లు పెరగనున్నాయి.

దక్షిణ చైనా సముద్ర ప్రాంతంలో చైనాతోవున్న సరిహద్దు తగాదాను పెంచ కుండా చర్చల ద్వారా పరిష్కరించుకోవటానికి మలేషియా సంసిద్ధంగా ఉందని అన్వర్ సూచించాడు. దక్షిణ చైనా సముద్రం, తైవాన్ సమస్యలతో పాటు అనేక విషయాలపై అమెరికా చైనాపై యుద్ధానికి కాలుదువ్వుతున్న స్థితిలో మలేషియా వైఖరి గురించి ప్రధాని అన్వర్ ప్రకటించటానికి ప్రాధాన్యత ఏర్పడింది. అన్వర్ చైనా పర్యటనలో అత్యున్నత స్థాయి ప్రతినిధి వర్గం పాల్గొంది. అన్వర్ బృందం 36 మంది చైనీస్ సీనియర్ ఎగ్జిక్యూటివ్స్‌తో రౌండ్ టేబుల్ సమావేశాలలో పాల్గొంది. మలేషియా-చైనా బిజినెస్ ఫోరమ్ సమావేశంలో 1000 మందికి పైగా ఇరు దేశాల బిజినెస్ ప్రతినిధులు పాల్గొన్నారు. 2009 నుంచి చైనా మలేషియాకి అత్యున్నత స్థాయి వాణిజ్య భాగస్వామిగా ఉంది. 2022లో మలేషియాకి, చైనాకి మధ్య 110.6 బిలియన్ డాలర్ల విలువైన వాణిజ్యం జరిగింది. అలాగే 2022లో మలేషియాలో చైనా అత్యంత అధిక స్థాయిలో 12.5బిలియన్ డాలర్ల ప్రత్యక్ష విదేశీ పెట్టుబడి పెట్టిన దేశంగా ఉంది. చైనా, సింగపూర్ తరువాత మూడవ అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా అమెరికా ఉండటం ఇక్కడ గమనించవలసిన విషయం.

మలేషియా ప్రధాని అన్వర్ చైనా పర్యటనలో జరిగిన ఒప్పందాల మొత్తం 170బిలియన్ యువాన్లలో 80బిలియన్లు సింగపూర్ కి సమీపంలోని జోహార్లో ని రోంగ్షెంగ్ పెట్రోకెమికల్ కంపెనీలో పెట్టటం జరుగుతుంది. 32బిలియన్ యువాన్ల పెట్టుబడి చైనా ఎలక్ట్రిక్ వాహనాల తయారీ కంపెనీ జెజియాంగ్ గీలీ పెరాక్ రాష్ట్రంలో పెట్టబోయే ఫ్యాక్టరీలో పెట్టటం జరుగుతుంది. ఇలా మలేషియా లో చైనా పెట్టుబడులు ప్రవహిస్తుంటే అమెరికా చూస్తూ ఊరుకోదు. ముఖ్యంగా శాస్త్ర, సాంకేతిక రంగాలలో మలేషియా చైనా సహకారం తీసుకుంటే అనివార్యం గా మలేషియాపై అమెరికా ఒత్తిడి ఉంటుంది. చైనా, అమెరికాల మధ్య నెలకొన్న ఘర్షణ వాతావరణంలో మలేషియా ఇరుదేశాలతో సత్సంబంధాలను కొనసాగిం చటం కత్తిమీద సామే అవుతుంది. ఎందుకంటే అంతర్జాతీయ సంబంధాలలో చైనా ప్రతి కదలికనూ తన ప్రపంచ ఆధిపత్యంపైన దాడిగా అమెరికా భావిస్తోంది.

కొంకన్ రిఫైనరీ వద్దు

ముంబయి : మహారాష్ట్రలోని రత్నగిరి జిల్లాలో కొంకన్ ఆయిల్ రిఫైనరీ చిచ్చు రేపుతున్నది. ప్రతిపాది రిఫైనరీని బర్సు-సొల్గావ్, దాని చుట్టుపక్కల ఎనిమిది గ్రామాల ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. ఈ ప్రాంతంలో రిఫైనరీ కోసం ఒక పక్క ప్రభుత్వం భూసర్వే ప్రక్రియకు నిర్ణయం తీసుకున్నది. ఆయిల్ రిఫైనరీతో భూములకు, పర్యావరణానికి నష్టం కలిగిస్తుందని ఇక్కడి ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి తరుణంలో రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా స్థానికులు తమ ఆందోళనలను మరింత తీవ్రతరం చేశారు. రిఫైనరీ ఏర్పాటు విషయంలో వెనక్కి తగ్గాలని వారు డిమాండ్ చేశారు.